ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 3
జిల్లా వార్తలు
శనివారం 13, జూలై 2024

» అనుమతులు లేకుండా 40మంది ఉద్యోగుల నియామకం » వీసీ, రిజిస్ట్రార్ల చేతివాటం » మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు





అక్రమాలకు అడ్డాగా ఏకేయూ

నీతి, నిజాయితీలకు మారుపేరుగా నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో ఒంగోలులో ఆవిర్భవించిన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అక్రమాలకు అడ్డాగా మారింది. ప్రభుత్వం నుంచి కానీ, యూనివర్సిటీ పాలక మండలి నుంచి కానీ ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండానే 40మందికిపైగా ఉద్యోగులను అడ్డగోలుగా నియమించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో రూ.కోటికిపైగా డబ్బులు చేతులు మారాయన్న విమర్శలు ఉన్నాయి. అవసరం లేకున్నా అంతమందిని నియమించి యూనివర్సిటీపై ఆర్థిక భారం మోపారు. అక్రమంగా నియమితులైన వారిలో కొందరిని పనిలేకుండా కూర్చోబెట్టి జీతాలు ఇస్తున్నారు. వారు అప్పుడప్పుడూ చుట్టపుచూపుగా వచ్చిపోతున్నారు. సంతకాల శ్రమకు వేతనాలు చెల్లిస్తున్న వైనంపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్‌కు కొందరు విద్యార్థి సంఘ నేతలు ఫిర్యాదు చేశారు.

ఒంగోలు(విద్య), జూలై 12 : ఆంధ్రకేసరి యూనివర్సిటీ (ఏకేయూ) అక్రమాలు, అవకతవకలకు కేంద్రంగా మారింది. వైస్ చాన్సలర్ ఎం.అంజిరెడ్డి, రిజిస్ట్రార్ బి.హరిబాబులు గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రజాప్రతినిధుల అడుగులకు మడుగులొత్తుతూ మొత్తం వర్సిటీ పాలనను గాడితప్పించారన్న ప్రచారం నడిచింది. కొందరు ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని వేధింపులు కొనసాగించారని, అక్రమంగా 40 మందికిపైగా కాంట్రాక్టు ఉద్యోగులను నియమించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఈ నియామకాలు జరిగాయి.

పెద్దఎత్తున అక్రమ వసూళ్లు

విశ్వవిద్యాలయంలో రకరకాల పేర్లతో భారీ మొత్తాల్లో అక్రమ వసూళ్లకు వీసీ, రిజిస్ట్రార్లు పాల్పడ్డారు. బీఈడీ కళాశాలలకు అనుమతులు ఇచ్చే విషయంలో కూడా భారీగానే డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు బీఈడీ కళాశాలల్లో ప్రవేశం కల్పించి తరగతులు నిర్వహించకుండా నేరుగా వారు పరీక్షలకు హాజరయ్యే విధంగా అనుమతించినందుకు పెద్దమొత్తంలో ముడుపులు ముట్టాయి. యూనివర్సిటీ పరీక్షలలో రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారి జవాబుపత్రాలను ఇతర యూనివర్సిటీలకు పంపి మూల్యాంకనం చేయించాల్సి ఉండగా ఇక్కడి అధ్యాపకుల తోనే చేయించి వసూళ్లకు పాల్పడ్డారన్న విమర్శలు ఉన్నాయి. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుకు కూడా కళాశాలల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

యూనివర్సిటీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగుల నియామకాలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తూ 2020 ఆగస్టు 20న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముందుగా ప్రభుత్వ అనుమతి లేదా యూనివర్సిటీ పాలకమండలి ఆమోదం లేకుండా ఎటువంటి నియామకాలు చేపట్టవద్దని అందులో ఆదేశించింది.

ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతరు

ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేసి ఏకేయూ వీసీ, రిజిస్ట్రార్‌లు పలు నియామకాలు చేపట్టారు. ఫలితంగా యూనివర్సిటీపై ఆర్థికభారం పడి కుదేలైపోయింది. ఏఎన్‌యూ పీజీ సెంటర్‌ను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేసిన తర్వాత బోధన, బోధనేతర సిబ్బందిని నియమించారు. అయినా సరే తర్వాత వచ్చిన వీసీ, రిజిస్ట్రార్లు అవసరం లేకపోయినా భారీమొత్తాల్లో డబ్బులు వసూలు చేసి అక్రమ నియామకాలకు తెరతీశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో ఉద్యోగుల బదిలీలు, నియామకాలు చేపట్టరాదు. అయితే ఏకేయూలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో కూడా కొందరికి ఉద్యోగాలు ఇచ్చారు. విశ్వవిద్యాలయం నిర్వహణకు అవసరమైన 50మంది సిబ్బంది అందుబాటులో ఉన్నా కాసులకు కక్కుర్తిపడి ఈ అక్రమ నియామకాలకు తెగబడ్డారు. ఉద్యోగాలు పొందిన వారిలో ఎక్కువశాతం మంది గత వైసీపీ ప్రభుత్వ సానుభూతిపరులు కావడం గమనార్హం. వారి వద్ద భారీమొత్తాల్లో డబ్బులు కూడా వసూలు చేసినట్లు తెలుస్తోంది.

నిధుల వినియోగంలోనూ గోల్‌మాల్

యూనివర్సిటీలో ఆర్థిక అవకతవకలు, అక్రమ నియామకాలకు పాల్పడిన వీసీ అంజిరెడ్డి, రిజిస్ట్రార్ హరిబాబుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మానవవనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. అలాగే నిధుల వినియోగంలోనూ గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనుబంధ కళాశాలల నుంచి భారీగా మామూళ్లు వసూలు చేసినట్లు కూడా ప్రచారం ఉంది. ప్రభుత్వం వర్సిటీలో జరిగిన నియామకాలు, ఇతర వ్యవహారాలపై వెంటనే విచారణ చేయిస్తే భారీగా అవకతవకలు వెలుగుచూసే అవకాశం ఉంది. వెంటనే ఓ కమిటీని నియమించి విచారణ చేయించాలని విద్యార్థి, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. కాగా ప్రస్తుతం వీసీ అంజిరెడ్డి తన పదవికి రాజీనామా చేయగా రిజిస్ట్రార్ హరిబాబు మాత్రం కొనసాగుతున్నారు.

సీనియర్ ఉద్యోగులకు నష్టం

యూనివర్సిటీలో అక్రమంగా నియమితులైన వారితో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్ ఉద్యోగులకు నష్టం వాటిల్లింది. స్కిల్డ్, అన్ స్కిల్డ్ పేరుతో కొత్తగా నియమితులైన వారికి పాత ఉద్యోగుల కంటే అధికంగా జీతం చెల్లిస్తున్నారు. ఆవిధంగా సీనియర్ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీశారు. విశ్రాంత ఉద్యోగులను రిక్రూట్ చేసుకోవద్దని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రిటైర్డ్ ఉద్యోగిని ఇక్కడకు తెచ్చి రూ.35,050 జీతంతో నియమించారు. యూనివర్సిటీలో అక్రమంగా నియమితులైన వారిలో ఒకరు తెనాలిలో ఎన్నికల ప్రచారంలో పవన్ కల్యాణ్‌పై రాయి విసిరి జనసైనికుల చేతిలో తన్నులు తిన్నారు. అయినా సరే అతనిని కొనసాగించడం కొసమెరుపు. కొత్తగా నియమితులైన వారిలో కొందరిని సాధారణ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల తరపున డబ్బు పంపిణీ చేసేందుకు కూడా వినియోగించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

విచారణ చేయాలి

ఏకేయూలో ఉద్యోగ నియామకాలలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా 40మందికి దొడ్డిదారిన ఉద్యోగాలు ఇచ్చి యూనివర్సిటీని ఆర్థికంగా ముంచేశారు. వర్సిటీలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేసి అక్రమాలకు పాల్పడ్డ వీసీ, రిజిస్ట్రార్లను కఠినంగా శిక్షించాలి. వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలి.

- రాయపాటి జగదీష్, విద్యార్థి జేఏసీ నేత



ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా


చివరి ఆయకట్టు వరకూ నీరందించాలి

» కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం
» గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిశీలన

మద్దిపాడు, జూలై 12: గుండ్లకమ్మ ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూములకు సైతం సాగునీరు అందేలా పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్షణం గేట్ల మరమ్మతులు చేపట్టి ఈ ఏడాది చివరి ఆయకట్టుకు నీరందించాలన్నారు. ప్రాజెక్టుకు సాగర్ నీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. రిజర్వాయర్ ద్వారా 5 మండలాల ప్రజలకు తాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా 80వేల ఎకరాలకు సాగునీరు అందేలా పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు 12 గేట్ల వివరాలను సైట్ ఇంజనీర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు కింద నీటి సరఫరా, భూ సేకరణ తదితర అంశాలను ఇరిగేషన్ ఎస్‌ఈ నాగమురళీమోహన్ కలెక్టర్‌కు వివరించారు. కుడికాలువ కింద 28వేల ఎకరాలకు నీరందేలా పూడికలు తీసి పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసినట్లు తెలిపారు. ఎడమ కాలువ కింద భూసేకరణలో సమస్యలు తలెత్తడంతో వర్క్ ఆర్డర్‌ను ప్రభుత్వం రద్దుచేసిందని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సుబ్బారెడ్డి, తహసీల్దార్ అనురాధ, ఇరిగేషన్ డీఈ కె.నాగరాజు, ఏఈ రామాంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ ఆశాజ్యోతి, వీఆర్వోలు అంకమ్మరావు ఉన్నారు.

అదే దందా!

» మరింత రెచ్చిపోతున్న రేషన్ మాఫియా
» ప్రభుత్వం మారినా అక్రమార్కుల తీరంతే..
» జిల్లావ్యాప్తంగా ఇతర ప్రాంతాలకు బియ్యం తరలింపు
» వారంరోజుల్లో 700కుపైగా బస్తాలు స్వాధీనం
» కొత్తవారితో కలిసి పాతవారు వ్యాపారం
» రైస్‌మిల్లుల్లో కూడా భాగస్వామ్యం



ఒంగోలు (కలెక్టరేట్), జూలై 12 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రేషన్ అక్రమార్కుల దందా ఆగడం లేదు. జిల్లావ్యాప్తంగా మాఫియా బియ్యాన్ని ఎల్లలు దాటించే పనిలో నిమగ్నమైంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసి అమ్ముకుని కోట్లు గడించారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మాఫియాపై కొరడా ఝుళిపిస్తుందని అందరూ భావించారు. అయితే అందుకు భిన్నంగా రేషన్ దందా యథేచ్ఛగా నడుస్తోంది. ఇప్పటివరకు వైసీపీ నేతలు ప్రత్యక్షంగా ఈ వ్యాపారంలో అక్రమాలకు పాల్పడగా తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాత వారు తెరపైకి వచ్చారు. వైసీపీ ప్రభుత్వం కన్నా ముందు రేషన్ వ్యాపారంలో ఉన్న అక్రమార్కులు భాగస్వాములవుతున్నారు. వారం రోజుల్లో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 700 బస్తాలకుపైగా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతుంది.

పాత డీలర్లకే రేషన్

జిల్లావ్యాప్తంగా 1,392 రేషన్ షాపుల పరిధిలో 6,70,571 తెల్లకార్డులు ఉన్నాయి. అందుకోసం ప్రభుత్వం ప్రతినెలా ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున జిల్లావ్యాప్తంగా 9,558.348 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తోంది. అందులో 70శాతానికిపైగా నెలవారీ జిల్లా దాటించి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటు న్నారు. కార్డుదారుల నుంచి డీలర్లు కిలో రూ.10కి బియ్యాన్ని సేకరిస్తుండగా.. డీలర్ల వద్ద నుంచి అక్రమార్కులు కిలో బియ్యం రూ.16 నుంచి రూ.17కు కొనుగోలు చేస్తున్నారు. అలా సేకరించిన మొత్తాన్ని కొంతమంది రైస్‌మిల్లులకు తరలిస్తుండగా, మరికొంత మంది గోతాలు కూడా మార్చకుండా లారీల్లో కాకినాడ లేదా నెల్లూరుకు తరలిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా సరే ప్రస్తుతం పాతడీలర్లే (వైసీపీ సానుభూతిపరులే) కొనసాగుతున్నారు. వారి ముసుగులో కొంతమంది అక్రమ వ్యాపారంలో కూడా భాగస్వాములుగా ఉన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ పాలనకు ముందు రేషన్ వ్యాపారంలో ఆరితేరిన వ్యాపారులు ఇప్పుడు తెరపైకి వచ్చారు. ప్రస్తుతం రేషన్ వ్యాపారం చేస్తున్న వారితో చేతులు కలిపి అక్రమంగా తరలించేందుకు శ్రీకారం చుట్టారు.

కలిసి చేసుకుందాం రండి..

జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకూ రేషన్ అక్రమ వ్యాపారం చేసిన వారిలో వైసీపీ సానుభూతిపరులే ఎక్కువ మంది ఉన్నారు. వారిలో కొంతమంది ఇప్పుడు కూడా రేషన్ మాఫియాలో భాగస్వామ్యం కావడం చర్చనీయాంశమైంది. జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఒక వ్యాపారి వైసీపీ సానుభూతిపరుల అండదండలతో రెచ్చి పోయి వ్యాపారం చేశాడు. ఇప్పుడు మరో కొత్త వ్యక్తి వద్ద ప్రత్యక్షమై తాను అందరివాడినంటూ నడిపిస్తున్నాడు. మరోవైపు అక్రమ వ్యాపారం చేసేందుకు రైస్ మిల్లులు కూడా అవసరం కావడంతో ప్రస్తుతం ఉన్న మిల్లుల్లో కొంతమంది కొత్తవారిని కలుపుకొనే ప్రక్రియ చేపట్టారు. రేషన్ బియ్యం ద్వారా నెలవారీ లక్షల్లో ఆదాయం వస్తుండటంతో దానిపైనే ప్రధాన దృష్టితో పనిచేసేందుకు కసరత్తు చేస్తున్నారు.



నాగులుప్పలపాడు మండలం నిడమానూరు వద్ద పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)



గొప్పోరు సారూ..!

బేస్తవారపేట మండలం సలకలవీడు గ్రామశివారులోని కొత్తపల్లి గ్రామానికి చెందిన చింతా నాగమణి అనే దివ్యాంగ బాలికకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ వీల్‌చైర్‌ను అందజేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం దివ్యాంగురాలు నాగమణి వీల్‌చైర్ లేక పడుతున్న ఇబ్బందులను బాలిక అమ్మమ్మ చింత సారమ్మ జేసీ గోపాలకృష్ణ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చనను వీల్‌చైర్ సమకూర్చాలని ఆదేశించారు. సంబంధిత సిబ్బంది వీల్‌చైర్‌ను కలెక్టరేట్ ప్రాంగణానికి తీసుకురాగా బాలికకు అప్పటికప్పుడే అందజేశారు. అలాగే జేసీ గోపాలకృష్ణ స్వయంగా నాగమణిని అందులో కూర్చోబెట్టి తానే నెట్టడాన్ని చూసి అక్కడున్న వారు హర్షం వ్యక్తం చేశారు. దీంతో నాగమణితోపాటు ఆమె అమ్మమ్మ ఆనందానికి అవధుల్లేవు. తమ సమస్యను ఆగమేఘాలపై పరిష్కరించిన జేసీకి గొప్పోరు సారూ అంటూ కృతజ్ఞతలు తెలిపారు.

- ఒంగోలు కలెక్టరేట్

856 సర్వే నెంబర్‌లో కొలతలు వేస్తున్న రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు(ఫైల్)



అలా వదిలేశారు..

» ఆక్రమణలని తేల్చినా చర్యలకు వెనకడుగు
» మార్కాపురంలో రూ.కోట్ల భూములు అన్యాక్రాంతమైనట్లు గుర్తింపు
» అన్నిచోట్లా వైసీపీ నేతలే పాగా
» కఠిన చర్యలు చేపట్టని అధికారులు
» రెచ్చిపోతున్న కబ్జారాయుళ్లు

మార్కాపురం, జూలై 12: పాలకుల అండదండలు, అధికారుల నిర్లక్ష్యం వెరసి రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు, పత్రికల్లో కథనాల ద్వారా ఆక్రమణలు వెలుగుచూస్తున్నా అధికార యంత్రాంగం మొదట్లో హడావుడి చేసి తర్వాత మిన్నకుండిపోతోంది. అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆక్రమణదారులకు అలుసుగా మారుతోంది. కొద్దిరోజుల తర్వాత మళ్లీ కబ్జాలకు తెరతీస్తున్నారు. ఆక్రమణదారులు విసిరే చిల్లర పైసలకు ఆశపడేవారు కొందరైతే, పాలకులకు భయపడి చూసీచూడనట్లు పనిచేసుకుపోయే వాళ్లు మరికొందరు ఉన్నారు. దీంతో రూ.వందల కోట్ల ప్రభుత్వ ఆస్తులు పరులపరమవుతున్నాయి. ఈ పరంపరకు శాశ్వత ముగింపు పలకాల్సిన యంత్రాంగం ఆ దిశగా అడుగులు వేయకపోవడం ప్రభుత్వ ఆస్తులకు శాపంగా మారింది. ఆక్రమణలు వెలుగుచూసిన తర్వాత హెచ్చరిక బోర్డులు పెట్టడం, నోటీసులు ఇవ్వడంలాంటి సున్నిత చర్యలకే పరిమితం కావడంతో వారు రెచ్చిపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపి కఠినంగా వ్యవహరించేందుకు స్థానిక అధికారులకు ఆదేశాలిస్తేనే ఈ తతంగాలకు ముగింపు పలికే అవకాశం ఉంది.


ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణం

దశాబ్దకాలంగా పోరాడుతున్నా ఆగని ఆక్రమణ

మార్కాపురం మండలం దరిమడుగు గ్రామంలోని 856 సర్వే నెంబర్‌లో 3.01 ఎకరాల ఆర్‌అండ్‌బీ స్థలం ఉంది. అందులో జాతీయ రహదారి 565కి 2.50 ఎకరాలు పోను ఎస్సీ కాలనీ సమీపంలోని పొలాల్లోకి 0.50 ఎకరాల మేర విలువైన స్థలం ఉంది. దీనిపై కన్నేసిన వైసీపీకి చెందిన ఓ మండలస్థాయి మాజీ ప్రజాప్రతినిధి ఆక్రమించుకునేందుకు పదేళ్లుగా ప్రయత్నిస్తున్నాడు. సుమారు రూ.5 కోట్ల విలువైన ఆ స్థలంలో ఆరు నెలల క్రితమే ఓ నిర్మాణాన్ని కూడా ప్రారంభించాడు. గ్రామస్థులు ఎన్నిసార్లు ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో గత నెలలో 'ఆంధ్రజ్యోతి'లో ఈ ఆక్రమణపై కథనం ప్రచురితమైంది. వెంటనే ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు పరిశీలించి అక్కడ ఆక్రమణ జరిగినట్లు గుర్తించారు. అక్కడి నిర్మాణం కూడా ఆర్‌అండ్‌బీ స్థలంలోనే జరిగిందని నిర్ధారించుకున్నారు. ప్రభుత్వ భూమిలో కట్టిన ఆ నిర్మాణాన్ని తొలగించేందుకు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 'ఆక్రమణను గుర్తించాం, ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. ఇక మా పనైపోయింది' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఆ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం ఆక్రమణదారులకు వరంగా మారింది. రూ.కోట్ల విలువైన ఇలాంటి ప్రభుత్వ ఆస్తులపై ప్రత్యేక దృష్టిపెడితేనే ఆక్రమణలను నిలువరించే అవకాశం ఉంది.

ప్రభుత్వ శాఖలకు అప్పగించిన స్థలాన్ని కాజేస్తున్నారు

మార్కాపురం పట్టణంలో 565 జాతీయ రహదారిని ఆనుకుని 1011/2 సర్వే నెంబర్‌లో 0.65 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో రెండు ప్రభుత్వ శాఖలకు కార్యాలయాలు నిర్మించుకొనేందుకు 10 సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారు. మిగిలిన ప్రభుత్వ భూమిపై పక్కన పట్టా భూమి ఉన్న వైసీపీకి చెందిన ఓ మున్సిపల్ కౌన్సిలర్ కన్నేశాడు. రూ.కోట్ల విలువైన ఆ భూమిలో తొలుత దారి కోసమని కొంత చదును చేశాడు. క్రమంగా ఆ భూమిని ఆక్రమించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. ఈ తతంగంపై గత నెలలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది దీంతో రెవెన్యూ అధికారులు అక్కడ బోర్డు పాతి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ఆ కౌన్సిలర్ తన భూమికి దారి మాటున మళ్లీ ఆక్రమణకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు రూ.కోట్ల విలువైన ఆ భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేసుకుంటే తప్ప భవిష్యత్తులో ఆక్రమణలను నిలువరించడం అసాధ్యమే. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ మోటార్ల మొరాయింపు..

- సమ్మర్ స్టోరేజీ ట్యాంకు-2 వద్ద పదేపదే సమస్య
- ఎస్ఎస్-1కి నిలిచిన పంపింగ్
- రిమ్స్‌కు ట్యాంకర్లతో నీటి సరఫరా
- మరమ్మతులకు ముందుకు రాని కాంట్రాక్టర్
- నిర్లక్ష్యం చేస్తే నగరంలో నీటి ఇక్కట్లే..

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 12 : ఒంగోలు నగరంలో ఉన్న రెండు సమ్మర్ స్టోరేజి ట్యాంకుల్లో పుష్కలంగా నీరు ఉన్నా, సరఫరాలో మాత్రం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నగరపాలక సంస్థ నిర్లక్ష్యం, కార్పొరేషన్ పాలకవర్గ సభ్యులు పట్టించుకోని తనంతో పదేపదే తాగునీటి సమస్య ఎదురవుతున్నది. నగరంలో ఇటీవల కాలంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు రోజుల క్రితం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్-2 వద్ద నీటి సరఫరాకు ఉపయోగించే మోటార్లు మరమ్మతులకు గురి కాగా, నగరంలో నీటి సరఫరాపై ప్రభావం చూపనుంది. ఉండటానికి రెండు 150 హెచ్‌పీ మోటార్లు, మరో రెండు 75 హెచ్‌పీ మోటార్లు ఉన్నాయి. అయితే వాటిలో ఏదో ఒకటి నిరంతరం మొరాయిస్తుండటంతో ఉన్నవే దిక్కవుతున్నాయి. దీంతో నీటి సరఫరా వేళల్లో మార్పులు జరగడంతో ఎప్పుడు వస్తాయో తెలియక ప్రజలు తాగునీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. ఇదిలా ఉండగా ఒంగోలు నగరంలో 50 డివిజన్లు ఉండగా, వాటన్నింటికీ నీటి సరఫరాకు నాలుగు మోటార్లు ఏర్పాటు చేశారు. అయితే గతంలో ఎప్పుడో కొనుగోలు చేసిన మోటార్లు కావడంతో పదేపదే సమస్య ఎదురవుతుంది. ఒక్క మోటారు మొరాయించినా కాలనీలకు నీటి సరఫరా షెడ్యూలులో మార్పులు జరుగుతున్నాయి. దీంతో ఒకటి, రెండు రోజుల ఆలస్యంగా నీటి సరఫరా కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రస్తుతం నాలుగు మోటార్లు ఉండగా ఏ ఒక్కటి రిపేరు వచ్చినా సమస్య తీవ్రత పెరుగుతుంది. అయితే ప్రత్యామ్నాయంగా మోటార్లు ఏర్పాటు చేసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్య ఎదురైనప్పుడు అప్పటికపుడు ట్యాంకర్లతో సరిపెడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు, నగర పాలకులు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

జీజీహెచ్‌కు నిలిచిన సరఫరా

స్థానిక వెంగముక్కలపాలెం వెళ్లే మార్గంలోని సమ్మర్ స్టోరేజ్‌ట్యాంకు-2 వద్ద మోటారు మొరాయించింది. అయితే దానిని బాగు చేసేందుకు నిధుల సమస్య రావడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితిపై అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరంలోని పైపులైను మరమ్మతులు, కొత్తపైపులైనులు, అలాగే తాగునీటి సరఫరాకు సంబంధించి పలు పనులు చేసిన ఓ కాంట్రాక్టర్‌కు నేటికీ బిల్లులు రాకపోవడంతో మోటారు రిపేరు చేసేందుకు ఆయన వెనుకడుగు వేసినట్లు సమాచారం. పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే తిరిగి పనులు చేపడతానని ఆయన తెలియజేయడంతో ఇంజనీరింగ్ అధికారులు అయోమయంలో పడ్డారు. త్వరితగతిన మోటారు రిపేరు చేయకుంటే సమ్మర్ స్టోరేజ్‌ట్యాంకు-2 నుంచి సమ్మర్ స్టోరేజ్‌ట్యాంకు-1కు పంపింగ్ నిలిచిపోయి నీటి సరఫరాకు ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. అంతేగాకుండా రెండు రోజుల నుంచి రిమ్స్ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)కి నీటి సరఫరా నిలిచిపోవడంతో ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు.

నీటి ఎద్దడి వచ్చే అవకాశం

మొరాయించిన మోటార్లు రిపేరు చేయకుంటే మంచినీటి సమస్య వచ్చే అవకాశం ఉంది. ఇప్పటి వరకు నీటి సరఫరా కోసం ఏడాదికి రూ.50లక్షలు ఖర్చు చేస్తున్నా, ప్రజలకు మాత్రం తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే నగరంలోని అన్ని ప్రాంతాలకు రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తున్నారు. విచ్చలవిడిగా ఉన్న లీకులతో గృహాలకు సరిపడినంతగా నీరు వచ్చే అవకాశాలు కన్పించడం లేదు. పైపులైనులు లేని కారణంగా ట్యాంకర్ల ద్వారా శివారుకాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే నీటి సరఫరాలో ఎదురవుతున్న లోపాలను తెలియజేస్తూ, సరఫరా వేళల మార్పును అధికారులు ముందుగా తెలియజేకపోవడంతో ఎప్పుడు వస్తాయో తెలియక పనులు మానుకుని మరీ నీటి కోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.



మరమ్మతులకు గురైన మోటార్

బదిలీల నిలిపివేతపై హైకోర్టుకు టీచర్లు

ఒంగోలు(విద్య), జూలై 12 : గత ప్రభుత్వం జారీచేసిన ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులను నిలిపివేస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను పక్కన బెట్టాలని కోరుతూ పలువురు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది మార్చిలో పలువురు టీచర్లు, హెచ్ఎంలకు బదిలీ చేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసేవరకు బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయవద్దని అప్పటి ప్రభుత్వం డీఈవోలను ఆదేశించింది. కాగా బదిలీల్లో అనేక అక్రమాలు జరిగాయని, కోట్లాది రూపాయలు చేతులు మారయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించడంతో పాఠశాల విద్య కమిషనర్ ఆ టీచర్ల బదిలీ ఉత్తర్వుల అమలును నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో ఆయా టీచర్లు హతాశులయ్యారు. ఈనేపథ్యంలో సుమారు 100మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై కౌంటర్ దాఖలు చేసేందుకు జీపీ సమయం కోరగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి ఈనెల 18వ తేదీకి వాయిదా వేశారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో శ్రీహర్షిణి విద్యార్థి యూనివర్సిటీ ఫస్ట్

ఒంగోలు(విద్య), జూలై 12 : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ విద్యార్థులు యూనివర్సిటీ ర్యాంకులు సాధించారు. బీఎస్సీ బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ కెమిస్ట్రీ విభాగంలో ఎం.పావని 1000మార్కులకు 990 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారు. ఎం.మెర్సీ 967, కె.చంద్రిక 955మార్కులు సాధించారు. అలాగే బీఎస్సీ ఫిజిక్స్ విభాగంలో టి.విజయలక్ష్మి 1000కి 883, పి.వైష్ణవి 879, జి.శివపార్వతి 866 మార్కులు సాధించగా, బీఎస్సీ స్టాటిస్టిక్స్ విభాగంలో కె.సుజిత 900 మార్కులకు 876, జి.లావణ్య 873, కె.సోని 872 మార్కులు పొందారు. ఇక బీఎస్సీ బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ విభాగంలో బి.అనూష 973, ఎస్‌కే.ఆషాభాను 963, వి.ఆశ్రయ 940 మార్కులు సాధించారు. బీసీఏ విభాగంలో యు.అర్చన 935, టి.ఆదిలక్ష్మి 934, వై.గంగాభవాని 925 మార్కులు, బీఎస్సీ అగ్రికల్చర్ విభాగంలో కె.సింధుజ 940, పి.సాద్విక 925, ఎం.నసీంమున్నీసా 922 మార్కులు సాధించారు. అలాగే బీఎస్సీ ఆక్వాకల్చర్ విభాగంలో జి.త్రివేణి 854, ఎస్.అనిల్ 824, బీఎస్సీ టాలీవిభాగంలో జి.లక్ష్మి 886, ఎస్.శివశంకర్‌రెడ్డి 885, జి.పూజిత 882 మార్కులు, బీకాం విభాగంలో ఇ.వెంకట సాయిలహరి 731, సీహెచ్.సింధు 724, ఎస్.భాగ్యశ్రీ 716, బీబీఏ విభాగంలో ఎస్‌కే.హప్ప 598, గీతిక 584, కె.ఆశీర్వాదం 479 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం స్థానిక కళాశాలలలో విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి, ఏవో ర్యాంకర్స్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇన్‌చార్జి ధిరీష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించాలి

- డాక్టర్ తిరుమలరావు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 12: కేన్సర్‌ను ప్రారంభదశలోనే గుర్తించి తదనుగుణంగా చికిత్స చేయడం ద్వారా అరికట్టవచ్చని అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రివెంటివ్ అంకాలజి నోడల్ అధికారి డాక్టర్ తిరుమలరావు పేర్కొన్నారు. ఒంగోలులోని జీజీహెచ్ మెడికల్‌కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం కేన్సర్ అవగాహన శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాశయ ముఖ ద్వారా కేన్సర్ హ్యూమన్‌పాపిలోమా కారణంగా వైరస్ వస్తుందన్నారు. వైరస్ సోకిన 10నుంచి 15 ఏళ్ళ తర్వాత కేన్సర్‌గా మారుతుందని, 9నుంచి 14 ఏళ్ల వయస్సులో వ్యాక్సిన్ ఇస్తే దీనిని నివారించవచ్చని తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ బి.శ్రీదేవి మాట్లాడుతూ కౌమార దశ బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయడం వల్ల 70నుంచి 80శాతం వరకు గర్భాశయ ముఖ ద్వారం ద్వారా కేన్సర్ రాకుండా అడ్డుకోవచ్చన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ భగీరథి మాట్లాడుతూ శిక్షణ పొందిన వైద్యాధికారులు, నర్సులు కేన్సర్‌పై రోగులకు అవగాన కల్పించాలని సూచించారు కార్యక్రమంలో డాక్టర్ ఏడుకొండలరావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుమలరావు, ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి డాక్టర్ నరేంద్ర, డాక్టర్ నబి, జిల్లా కేన్సర్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ రమ్య, డెంటల్ సర్జన్ డాక్టర్ హేమసుధ, డాక్టర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో జగన్ బొమ్మ తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 12 : ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని తొలగించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఇంకా మరాని జగన్ బొమ్మ' కథనంపై స్పందించిన ఆమె, నూతన ప్రభుత్వ విధానాలతో, త్వరలోనే ఆరోగ్యశ్రీ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం జగన్ బొమ్మతో ఉన్న బోర్డును తొలగించినట్లు తెలిపారు.

సమతానగర్‌లో చోరీ

ఒంగోలు(క్రైం), జూలై12: ఇంటి తలుపులు పెకలించి చోరీకి పాల్పడి నగదు, బంగారం ఆభరణాలు అపహరించుకు వెళ్ళారు. ఈ సంఘటన ఒంగోలు నగరం సమతానగర్‌లో గురువారం రాత్రి జరిగింది. ఒంగోలు నగరం గుప్తా స్కెర్‌లో ఉన్న హెచ్‌డీఎఫ్ బ్యాంక్‌లో పనిచేస్తున్న కొలసాని బాలక్రిష్ణ సమతా నగర్ రెండో లైన్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన తల్లి ఈనెల 10న షిరిడి వెళ్ళారు. గురువారం రాత్రి బాలక్రిష్ణ ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తలుపు పెకలించి, బీరువా పగులకొట్టి ఉంది. బీరువాలో ఉన్న నాలుగు సవర్ల బంగారపు ఆభరణాలతో పాటు, పక్కనే ఉన్న కప్‌బోర్డులో రూ.లక్షన్నర నగదును దుండగులు చోరీ చేశారు. తాలుకా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో పకడ్బందీ పర్యవేక్షణ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

చీమకుర్తి, జూలై12 : ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో సుభద్ర కోరారు. చీమకుర్తిలోని ప్రభుత్వ హైస్కూలు, బాలికల ఉన్నతపాఠశాల, మండలవనరుల కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. స్టూడెంట్స్ కిట్ పంపిణీ సక్రమంగా జరిగిందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలను సక్రమంగా నిర్వహించాలని, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారందరికీ న్యాయం చేస్తా !

- ఎమ్మెల్యే దామచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 12: ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపు కోసం, అలాగే తన విజయం కోసం కష్టపడి పనిచేసిన వారందరికీ న్యాయం చేస్తానని, ఎవరూ నిరుత్సాహ పడవద్దని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలోని పలువురు క్లస్టర్ ఇన్‌చార్జులతో సమావేశమైన ఆయన క్లస్టర్‌ల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పార్టీ అధికారంలోకి రాగానే పలు అంశాలను, పదవులు తదితరాలపై పలువురు తన దృష్టికి తీసుకొచ్చారని, అయితే ఎవరూ కూడా నిరుత్సాహపడవద్దని తెలిపారు. తప్పకుండా పార్టీ గెలుపు కోసం కష్టపడినవారికి తగిన న్యాయం చేస్తానని చెప్పారు. అలాగే డివిజన్లలో, క్లస్టర్ స్థాయిలో ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి తనకు తెలియజేయాలన్నారు. అందరికీ అండగా ఉంటానని, అందరికీ తగిన రీతిగా దశల వారీగా నాయకులు ఆశించిన వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన గెలుపునకు కృషి చేసినవారికి అండగా ఉంటానన్నారు. సమావేశంలో మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధరలు కల్పించాలి

- మంత్రులకు రైతుల విజ్ఞప్తి



మంత్రి రవికుమార్‌కు కలిసిన రైతులు, నాయకులు

నాగులుప్పలపాడు, జూలై 12: మిర్చికి గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని పలువురు రైతులు మంత్రులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఒమ్మెవరం గ్రామానికి చెందిన మిర్చి రైతులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌లను శుక్రవారం రాష్ట్ర సచివాలయం కలిసి తమ సమస్యలను తెలియజేశారు. నాగులుప్పలపాడు మండలంలో మిర్చిని రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారన్నారు. అయితే గత ఏడాది కాలం నుంచి మిర్చికి సరైన ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, దీంతో ఈ ఏడాది మిర్చి సాగుచేయాలంటేనే భయపడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పండిన పంటను కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేసుకున్నారని, ప్రస్తుత ధరలకు పంటను అమ్ముకొంటే నష్టాలు తప్పని వాపోయారు. మిర్చికి ఎగుమతి ఆర్డర్ వచ్చేలా చూసి గిట్టుబాటు ధరలు ఉండేలా చూడాలని కోరారు. అదేవిధంగా గుండ్లకమ్మ ప్రాజెక్టు గత రెండు సీజన్లగా రైతులకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. ఈ ఏడాదైనా గేట్లు ఏర్పాటు చేసి ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలపర్తి బాలకోటి, మాజీ సర్పంచ్ పి.వెంకటసుబ్బారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కొమ్మాలపాటి సురేష్ (చిన్నా), రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 12 : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు వారికి మెరుగైన సేవలు అందించడమూ ముఖ్యమని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఆ దిశగా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గృహవినియోగం, పరిశ్రమలు, వ్యవసాయం, ఆక్వాసాగుకు విద్యుత్ సరఫరా చేస్తున్న తీరును అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. విద్యుత్ సంస్థలకు ఆదాయం, బకాయిలు, ఎస్సీఎస్టీ, ఇతర బలహీనవర్గాలకు విద్యుత్ సబ్సిడీలపై సమీక్షించారు. సౌర విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వారికి వివరించాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీసీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ, ఈఈలు హైమావతి, పి.శ్రీనివాసులు, డీఈఈ కృష్ణకాంత్, ట్రాన్స్‌కో ఎస్ఈ కె.శ్రీనివాస్, డీఈఈ డి.శ్రీనివాస్, నెడ్‌క్యాప్ పీడీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ విలువలకు పట్టం కట్టిన 'నాలోన నీవే..'

- ఆకట్టుకున్న నాటికలు



నాలోన నీవే నాటికలోని ఓ సన్నివేశం

ఒంగోలు(కల్చరల్), జూలై 12: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఏడో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో ప్రదర్శించిన నాలోన నీవే నాటిక కుటుంబ సంబంధాలు, విలువలను ప్రతిబింబించింది. శ్రీకరణం సురేష్ మెమోరియల్ ఆర్ట్స్ థియేటర్స్ గుంటూరు కళాకారులు ప్రదర్శించిన నాటికలో భార్యాభర్తల అనుబంధం, అనవసరమైన ఆందోళనల వల్ల కలిగే అనర్థాలు, చివరికి వాటి గురించి తెలుసుకుని అందరూ సంతోషంగా కలిసిమెలిసి ఉండటం సారాంశంగా ప్రదర్శించిన ఈ నాటికను బొమ్మిడి రామకృష్ణ రచించి దర్శకత్వం వహించారు. నాటికలోని వివిధ పాత్రలలో కరణం సరిత, ఉమామహేశ్వరి, బొమ్మిడి రామకృష్ణ, బొమ్మిడి రాయుడు నటించారు. ఇక రెండవ నాటికగా తిరుమల ఆర్ట్స్ గుంటూరు కళాకారులు చీకట్లో చిందులాట నాటికను ప్రదర్శించారు. హాస్య భరితంగా కొనసాగిన ఈ నాటికలో నటీనటుల సంభాషణా చాతుర్యం ప్రేక్షకులను అలరించాయి.

ఏకపాత్రాభినయ పోటీల విజేతలు వీరే..

ఇక గత గురువారం ప్రదర్శించిన ఏకపాత్రాభినయ పోటీల విజేతల వివరాలను సంస్థ నిర్వాహకులు శుక్రవారం ప్రకటించారు. పౌరాణిక చారిత్రాత్మక విభాగంలో మదిరాలకు చెందిన గోరంట్ల కొండయ్య చౌదరి, శ్రీకృష్ణ పాత్రకు ప్రథమ బహుమతి సాధించగా, మండూరుకు చెందిన రాము ద్వితీయ బహుమతి, మార్కాపురానికి చెందిన కాళంగా శ్రీనివాసరావు తృతీయ బహుమతి పొందారు. మార్కాపురానికి చెందిన పి.సుబ్బయ్య ఆచారి, గట్టుపల్లి సుబ్బారావు, విజయవాడకు చెందిన రూపశ్రీలు కన్సోలేషన్ బహుమతులను కైవసం చేసుకున్నారు. సాంఘిక జానపద విభాగంలో మంగళగిరికి చెందిన ఇంటూరి ప్రసాద్‌బాబు ప్రథమ, హైదరాబాద్‌కు చెందిన ఎం.అర్జునరావు ద్వితీయ, అల్లూరుకు చెందిన బడబాగ్ని ఆంజనేయులు తృతీయ బహుమతి సాధించారు. పలువురుకి కన్సోలేషన్ బహుమతులను ప్రకటించారు. శనివారం సాయంత్రం సీవీఎన్ రీడింగ్ రూములో జరిగే వార్షికోత్సవ సభలో ముఖ్యఅతిథులు చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించాలి : కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ జశ్వంత్‌రావు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 12: నగరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై యంత్రాంగం దృష్టి సారించాలని కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమావేశం అయిన కమిషనర్ మాట్లాడుతూ స్టాప్ డయేరియా, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అన్ని అర్బన్ హెల్త్ సెంటర్‌లు, సచివాయాలలోని శానిటీ సెక్రటరీలు అందరు భాగస్వాములై ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. కాలువల్లో పూడికతీత పనులు, మురుగు సమస్య, చెత్త తొలగింపులు ఎప్పటికపుడు చేపట్టాలని ఆదేశించారు. వర్షాలు పడుతున్న క్రమంలో అందరు సమష్టిగా పనిచేసి కార్పొరేషన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు.

అవీ..ఇవీ..

పాఠశాలల్లో మొక్కలు నాటాలి : డీఈవో

ఒంగోలు(విద్య), జూలై 12: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేయాలని డీఈవో డి.సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా చేపట్టిన ఏక్ పేడ్ మాకౌనామ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులతో మొక్కలు నాటించే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జియోటాగ్ ఫొటోలను వాట్సప్ గ్రూపులో, వీడియోలను గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేయాలని హెచ్ఎంలను ఆదేశించారు. మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో విరివిగా మొక్కలు నాటి పర్యవేక్షించాలని డీఈవో కోరారు.

లోకాయుక్త ప్రధాన కార్యాలయాన్ని విజయవాడకు మార్చాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 12: కర్నూలులో ఉన్న లోకాయుక్త ప్రధాన కార్యాలయాన్ని విజయవాడకు మార్చాలని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. లోకాయుక్త కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతంలో ఉండాలని, కానీ కర్నూలులో ఏర్పాటు చేయడం వల్ల అక్కడికి వెళ్ళిరావాలంటే కష్టతరంగా ఉందని పేర్కొన్నారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం స్పందించి లోకాయుక్త కార్యాలయాన్ని విజయవాడకు మార్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



చంద్ర మృతదేహం

మద్దిపాడు, జూలై 12: ట్రావెల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం యువకుడి ప్రాణాలను బలిగొన్నది. గురువారం రాత్రి ఏడుగుండ్లపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దకొత్తపల్లికి చెందిన మోటార్‌సైక్లిస్ట్ పూనూరు చంద్ర మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం, ఒంగోలు నుంచి మోటార్‌సైకిల్‌పై వస్తున్న చంద్రను అతివేగంతో వెళ్తున్న ప్రయివేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో చంద్ర తల రోడ్డుకు తగలడంతో రక్తస్రావమై అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పండ్లతోటల సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిపాడు, జూలై 12: మద్దిపాడు మండలంలో పండ్ల తోటల సాగుకు ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని, 5 ఎకరాల్లోపు పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులని పేర్కొన్నారు. వారు రైతు పాస్‌పుస్తకం, 1బి అడంగల్ జిరాక్సులు తీసుకొని స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కాశీవిశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు

మద్దిపాడు, జూలై 12: నందిపాడు గ్రామంలోని శ్రీగంగా పార్వతి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం అర్చకులు రాజుపంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చన జరిగాయి. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 12: ఒంగోలు నగర సాయి బ్రాహ్మణ క్షౌర శాలల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో కమిటీ నగర అధ్యక్షులుగా కొణిజేటి రామకృష్ణ, ప్రధానకార్యదర్శిగా ఏల్చూరి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా భూసరపల్లి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులుగా మాచవరపు అజయ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కొణిజేటి నాగభూషణం, ఆళ్లగడప సాంబశివరావు, నిడమనూరి యలమందరావు, మాచవరపు వెంకటసుబ్బారావు, కోటేశ్వరరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు, రేపు ఒంగోలులో ఐఎంఏ సదస్సు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 12 : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జోన్-2 రాష్ట్ర స్థాయి సదస్సు శని, ఆదివారాలలో ఒంగోలులో జరుగుతుందని కో ఆర్డినేటర్ డాక్టర్ జాలాది మణిబాబు తెలిపారు. ఈ సందర్భంగా దక్షిణ బైపాస్ రోడ్‌లోని సాయి ఐటీఏ కన్వెన్షన్ హాలులో జరుగుతుందని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 13వ తేది ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం అయ్యే సదస్సు 14వ తేదీ సాయంత్రం ముగుస్తుందని వివరించారు. ఈ సదస్సుకు అధ్యక్షురాలు పి.ఝాన్సీ, కార్యదర్శి ఇ.శ్రావణి, కోశాధికారి ఎ.శ్రీదేవి, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ జయశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.వీరయ్యచౌదరి హాజరవుతారని తెలిపారు.

పొదుపు సభ్యుల భాగస్వామ్య నిధులు త్వరలోనే పంపిణీ

- మెప్మా పీడీ రవికుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 12 : మెప్మా ఆధ్వర్యంలో పొదుపు సభ్యుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న మహిళా మార్ట్‌లో అమ్మకాలపై వచ్చిన లాభాలను త్వరలోనే ఉన్నతాధికారుల ఆదేశాలలో పంపిణీ చేస్తామని మెప్మా పీడీ టి.రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మారని మెప్మా' కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎలాంటి బలవంతపు అమ్మకాలు జరగడం లేదన్నారు. ఆర్పీలకు ఎలాంటి టార్గెట్‌లు ఇవ్వలేదని, అయితే బయట ధరలకంటే మార్ట్‌లో తక్కువ ధరకు విక్రయిస్తున్నందున వాటిని కొనుగోలు చేసి, మార్ట్‌ను అభివృద్ధి చేసుకోవాలని మాత్రమే కోరామన్నారు. అదేవిధంగా సభ్యుల వాటా లాభాన్ని చెల్లించుటకు కమిటీ సిద్ధంగా ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాలతో త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

సింగరాయకొండ, జూలై 12: మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటన సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బింగినపల్లి గ్రామానికి చెందిన కేశవరపు రమణమ్మ నెలవారీ మందుల కోసం కందుకూరు ఆసుపత్రికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో స్థానిక శ్రీరామ్‌నగర్‌లో తన స్నేహితురాలు కుంచాల వెంకటరత్నం ఇంటికి చేరుకున్నారు. ఇద్దరూ ఫ్యాన్ కొనుగోలు కోసం బజార్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వెంకటరత్నం ఇంట్లో సిద్ధమవుతుండగా, రమణమ్మ మెట్లపై కూర్చొన్నారు. ఈ సమయంలో వెనుకవైపు నుంచి గోడదూకి వచ్చిన దుండగుడు ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సన్మానం



జమీమామార్వెల్‌ను సన్మానిస్తున్న ఎంఈవో, సిబ్బంది

జరుగుమల్లి (కొండపి), జూలై 12 : సీబీఎస్ఈ అనుబంధ ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ (శ్రేష్ఠ) పరీక్షలో కె.బిట్రగుంట కేజీబీవీ విద్యార్థిని వి.జమీమా మార్వెల్ ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయిలో 153వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినితోపాటు ఆమె తల్లిని శుక్రవారం స్కూల్ ఆవరణలో ఎంఈవో బి.నాగేంద్రవదన్ సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.స్రవంతి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన అంబులెన్స్

- సురక్షితంగా బయటపడిన డ్రైవర్



అంబులెన్స్‌ను బయటకు తీస్తున్న క్రేన్

సింగరాయకొండ, జూలై 12 : ఒంగోలు నుంచి నెల్లూరు వెళ్తున్న అంబులెన్స్ అదుపు తప్పి కాలువలో పడింది. ఈ ఘటన స్థానిక జాతీయ రహదారి పక్కనే ఉన్న అంబోతుకాలువ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. జాతీయ రహదారిపై కోల్డ్ స్టోరేజీ సమీపంలో ముందు వెళ్తున్న లారీని, బైక్‌ను తప్పించబోయి అంబులెన్స్ అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో డ్రైవర్ మాత్రమే ఉన్నారు. ఆయనకు ఎటువంటి గాయాలు కాలేదు. అనంతరం క్రేన్ సహాయంతో అంబులెన్స్‌ను బయటకు తీశారు.

కంభంలోని మెడికల్ షాపుల్లో తనిఖీలు

మత్తు టాబ్లెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తింపు

మార్కాపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంధ్య వెల్లడి

ఒంగోలు(క్రైం), జూలై12: ఇటీవల కంభంలో పలు మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా మత్తు టాబ్లెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు మార్కాపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పీబీ.సంధ్య తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ , డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంధ్యా సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాటాడారు. కంభంలో ఈనెల 7న మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. అయితే మహేశ్వరి మెడికల్స్, బాలాజీ మెడికల్స్‌లో నిబంధనలు పాటించకుండా మత్తు ట్లాబెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తిచామని, వారిపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించకూడదని స్పష్టం చేశారు. మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారని ఆమె పేర్కొన్నారు.

బైక్‌ను కారు ఢీకొని మహిళ దుర్మరణం

● భర్తకు తీవ్రగాయాలు



బైక్‌ను ఢీకొన్న కారు, నజిమున్ మృతదేహం

మద్దిపాడు, జూలై 12: మద్దిపాడు మండలం సీతారాంపురం కొష్టాలు దగ్గర శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు పెద్దకొత్తపల్లి దర్గా నుంచి గంగవరం వెళ్తుండగా కొష్టాలు దగ్గరకు రాగానే ఒంగోలు నుంచి గుంటూరు వెళ్తున్న ఫార్చునర్ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఒంగోలుకు చెందిన షేక్ నజిమున్(45) అక్కడిక్కడే మృతి చెందగా, ఆమె భర్త అలీషాకు తీవ్ర గాయాలయ్యాయి. గంగవరం గ్రామానికి చెందిన అలీషా ఒంగోలులో జనరేటర్ షాపు నిర్వహిస్తున్నాడు. మద్దిపాడు ఎస్సై వెలగా మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడి మృతి

పెద్దారవీడు, జూలై 12: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందు తున్న బాలుడు శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మండలంలోని తోకపల్లి వద్ద గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం ఎర్రగొండపాలెం మండలం అమ్మానిగుడిపాడుకు చెందిన సీహెచ్.బ్రహ్మాచారి, ఆయన భార్య గంగాదేవి, కుమారుడు సుబ్రమణ్యాచారీలకు తీవ్రగాయాలయ్యాయి. మార్కాపురం ప్రభుత్వ ప్రజా సర్వజన వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ సుబ్రమణ్యాచారికి ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు నిర్ధారించారు. అందుకు అవసమయ్యే డబ్బులను మనవాతావాదులు ఫోన్‌పేల ద్వారా వారి కుటుంబానికి పంపుతున్నారు. ఇంతలో శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు సుబ్రమణ్యాచారి మృతి చెందాడు. దీంతో బాగా చదివే కుమారుడు కళ్ల ఎదుటే మరణించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

అద్దంకి, జూలై 12: అద్దంకిలోని ఊర చెరువులో ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టనున్నట్లు ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎన్టీఆర్‌నగర్ సమీపంలో పలువురు వైసీపీ నాయకులు ఊరచెరువును ఆక్రమించి ఇళ్ల స్థలాలుగా మార్చి అమ్మకాలు చేస్తున్నారు. ఆ క్రమణలపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. అ లాగే, పలువురు టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి ఊరచెరువును పరిశీలించారు. ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టడంతో పాటు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపా రు. అద్దంకి కొండ వద్ద ఇండోర్ స్టేడి యంకు వెనుకవైపు కొండపైన అద్దంకి పట్టణంలోని 130 మంది కార్పెంటర్‌లకు షాపుల ఏర్పాటుకు స్థలాల కేటాయింపునకు పరిశీలన చేశారు. నామ్ రోడ్డు వెంబడి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌సుభాని, సర్వేయర్ శ్రీలక్ష్మి, వీఆర్వో బాషా, టీడీపీ నేతలు కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, చెన్నకేశవులు, నాగేశ్వరరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

అనధికార తూముల తొలగింపు

చినగంజాం, జూలై 12: సంతరావూరు సైడ్ చానల్‌లో అనధికారంగా వేసిన తూములను నీటి పారుదలశాఖాధికారులు శుక్రవారం తొలగించారు. డీఈఈ ఎస్.ప్రసాదరావు, ఏఈ ఎం.పవన్‌కుమార్‌లు రైతులతో కలిసి అనధికారకంగా వేసిన తూములను పరిశీలించారు. అనధికారంగా 12 తూములు వేసినట్లు గుర్తించారు. వీటిని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్నట్లు డీఈఈ తెలిపారు. అనధికార తూములను తొలగించి, సైడ్ ఛానల్‌కు మరమ్మతులు చేసి సక్రమంగా సాగునీటిని అందిస్తామని తెలిపారు. కొమ్మమూరు కాలువకు వచ్చిన పట్టిసీమ జలాలను సంత రావూరు లాకుల వద్ద నుంచి దిగువకు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, విక్రం నారాయణ, నక్కల వెంకటనారాయణ, గొనసపూడి, కడవకుదురు రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై తస్మాత్ జాగ్రత్త !

ఫెడెక్స్ కొరియర్ పేరుతో మోసం ● హెల్ప్‌లైన్ 1930 కాల్ చేయాలి ● ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



టోల్‌ఫ్రీ నంబరు ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్

ఒంగోలు(క్రైం), జూలై12: సైబర్ నేరగాళ్లు పేట్రేగిపోతున్నారు. ఎప్పటికప్పుడు కొత్త రకం మోసాలకు పాల్పడుతున్నారు. దానిబారిన పడిన బాధితుల బ్యాంకు అకౌంట్లను ఖాళీ చేస్తున్నారు. ఈక్రమంలో మరో కొత్తరకం దందాకు బరి తెగించారు. దేశవ్యాప్తంగా మీపేరుతో ఫెడెక్స్ కొరియర్ వచ్చిందని కాల్ చేస్తారు. కొరియర్ వచ్చిన బాక్స్‌లో డ్రగ్స్ ఉన్నాయంటూ డబ్బు ఉన్న వారిని టార్గెట్ చేస్తున్నారు. ఇలాంటి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ వివరించారు.

మోసం చేసేది ఇలా..

సైబర్ నేరగాళ్లు సమాజంలో పలుకుబడి, డబ్బు ఉన్న వారిని ఎంచుకుంటారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న సాంకేతిక పద్ధతుల ద్వారా వారి వివరాలు సేకరిస్తారు. అక్కడ నుంచి ప్రారంభమవుతుంది స్కాం. మీ పేరుతో ఫెడెక్స్ పార్శిల్ వచ్చిందని, దానిలో డ్రగ్స్ ఉన్నాయని, సదరు పార్శిల్ సీజ్ చేశామని కాల్ చేస్తారు. వారు సీబీఐ, కస్టమ్స్, ఇన్విస్టిగేషన్ బ్యూరో ఉన్నతాధికారులమంటూ మాట్లాడతారు. స్కైప్ లింక్ ద్వారా వీడియో కాల్‌లోకి వస్తారు. తాము పోలీసు అధికారులమని బెదిరిస్తారు. అంతేగాకుండా వారు పోలీస్ లోగోలు కనిపించేలా వ్యవహరిస్తారు. ఫోన్ కాల్‌లో ఇంటరాగేషన్ చేసినట్లు నటిస్తారు. మీ బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ చేస్తున్నామని బెదిరిస్తారు. మీ ఖాతాలో ఉన్న నగదు పోలీస్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయాలంటూ సైబర్‌నేరగాళ్ల ఖాతాలకు జమ చేయించుకుంటారు. ఆ తరువాత వాళ్లు ఎవరని తెలుసుకునేందుకు కాల్ చేస్తే ఎలాంటి ఫలితం ఉండదు. అలాంటి ఫోన్లు మరలా ఎవరూ తీయరు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

సెంట్రల్ పోలీసులు ఎవరూ లోకల్ పోలీసులను సంప్రదించకుండా నేరుగా ఎవరికీ ఫోన్ చేయరు. సీబీఐ, సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీస్ పేరుతో ఫోన్ కాల్స్ వస్తే అప్రమత్తంగా ఉండాలి. డ్రగ్స్ పేరుతో భయపెట్టి నగదు బదిలీ చేయాలని బెదిరిస్తే ఎవరూ స్పందించకూడదు. అలాగే ఓటీపీలు కూడ చెప్పకూడదు. అనుమానిత ఫోన్ కాల్స్ వస్తే వెంటనే లోకల్ పోలీసులను సంప్రదించాలి.

లోకల్ పోలీసులకు తెలియకుండా ఎవరూ అరెస్టు చేయరు : ఎస్పీ

లోకల్ పోలీసులకు తెలియకుండా సెంట్రల్ ఏజెన్సీలు ఎవరినీ అరెస్టు చేయరని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెంట్రల్ ఏజెన్సీల పేరుతో ఫోన్ కాల్స్ వస్తే భయపడి నగదు బదిలీ చేయవద్దని హితవు పలికారు. పోలీసు అధికారులు వీడియో కాల్స్ చేయరని, అలాంటి ఫోన్ కాల్స్‌ను తీయవద్దని చెప్పారు. ఎవరైనా బెదిరింపు కాల్స్ చేస్తే పోలీసులను ఆశ్రయించాలని, సైబర్‌నేగాళ్ల బారిన పడకుండా వెంటనే 1930 నంబరుకు కాల్ చేయాలని కోరారు.

టంగుటూరుకు తాగునీటి సరఫరా బంద్

ధ్వంసమైన పైప్‌లైన్ ● మూడోలైన్ కోసం రైల్వే బ్రిడ్జి నిర్మాణంతో పదేపదే సమస్య ● ప్రజలకు అవస్థలు



రైల్వే బ్రిడ్జి వద్ద ధ్వంసమైన పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న పంచాయతీ సిబ్బంది

టంగుటూరు, జూలై 12 : టంగుటూరుకు మరోసారి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పాలేరులో రైల్వే మూడోలైన్ బ్రిడ్జి పనులు చేస్తుండగా గురువారం పైప్‌లైన్ ధ్వంసమైంది. పంచాయతీ అధికారులు చేతులెత్తేయడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడుతున్నారు. టంగుటూరు సమీపంలో ఉన్న పాలేరులో బోరుబావులు ఏర్పాటు చేసి అక్కడి నుంచి పైప్‌లైన్‌ల ద్వారా పంచాయతీలోని ఓవర్ హెడ్ ట్యాంకులకు ఎక్కించి నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ పైపులైన్‌లు రైల్వే బ్రిడ్జి కింద నుంచి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రైల్వే మూడోలైన్‌లు పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పదేపదే పైప్‌లైన్‌లు దెబ్బతింటున్నాయి. ఈకారణంగా ఇప్పటికే అనేకసార్లు టంగుటూరుకు నీటి సరఫరా నిలిచిపోయింది. తాజాగా మరోసారి పైప్‌లైన్‌లు ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం మూడో రైల్వే లైన్ కోసం అవసరమైన బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. అందుకోసం పిల్లర్లు ఏర్పాటు చేస్తున్నారు. రెండు పిల్లర్ల మధ్యన పైప్‌లైన్ ఉంది. పిల్లర్ల ఎత్తు పెంచే క్రమంలో గురువారం పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది.

మూడురోజుల తర్వాతే..

రక్షిత మంచినీటి పథకం పైప్‌లైన్ దెబ్బతినడంతో గురువారం మధ్యాహ్నం నుంచే సరఫరా నిలిచిపోయింది. తాగేందుకు, వాడుకకు చుక్క నీరులేక జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు మైకులు పెట్టి మరీ పైప్‌లైన్ ధ్వంసమైందని, మూడు రోజులు నీరు రాదని శుక్రవారం ప్రజలకు సమాచారం ఇచ్చారు. 20వేలకు పైగా జనాభా ఉన్న మేజర్ పంచాయతీకి నీటి సరఫరాలో అడ్డంకులు ఎదురైతే వెంటనే పునరుద్ధరించాల్సిన అధికారులు ఇలా ప్రకటించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా పంచాయతీలో ప్రాంతాల వారీ రోజు మార్చి రోజు నీటి సరఫరా జరుగుతోంది. గురువారం వంతు ప్రాంతం వారు ఇప్పటికే అవస్థ పడుతున్నారు. శుక్రవారం వంతు ప్రాంతాల వారికి కూడా కష్టాలు మొదలయ్యాయి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం

నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. మాజీ ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరరావు, పంచాయతీ సభ్యుడు కామని వెంకట్రావు అదే పనిలో ఉన్నారు. వీలైతే శుక్రవారం రాత్రి, లేకుంటే శనివారం ఉదయం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం.

- జగదీష్, పంచాయతీ కార్యదర్శి

సరసమైన ధరలకు నిత్యావసర సరుకులు

అమ్మకాలను ప్రారంభించిన అధికారులు



సరుకుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

చీమకుర్తి, జూలై 12 : ప్రభుత్వ ఆదేశాల మేరకు సరసమైన ధరలకు బియ్యం, కందిపప్పుల విక్రయకేంద్రాలను శుక్రవారం నుంచి చీమకుర్తిలో ప్రారంభించారు. స్థానిక రైతుబజార్లు, రైస్‌మిల్లులు మొత్తం పట్టణంలో ఐదు ప్రాంతాల్లో తక్కువ ధరలకే సరుకులను విక్రయించే కార్యక్రమాన్ని కమిషనర్ ఈశ్వరరాజు, తహసీల్దార్ సురేష్‌లు ప్రారంభించి, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, సూరపల్లి హనుమంతరావు, ఉన్నం సుబ్బారావు, అవనిగడ్డ శేషయ్య, నర్రా నాగరాజ, గొల్లపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



కావేరిని అభినందిస్తున్న హెచ్ఎం, సిబ్బంది

పొన్నలూరు (కొండపి), జూలై 12 : మండలంలోని ముండ్లమూరివారిపాలెంకు చెందిన కావేరి ఒంగోలు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో సీటు సాధించారు. గ్రామంలోని జడ్పీస్కూల్‌లో పదో తరగతి చదివిని ఆమెను శుక్రవారం స్కూల్ ఆవరణలో హెచ్ఎం శివరామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రేపు బీచ్ కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపిక

చినగంజాం, జూలై 12: చినగంజాం మండల కార్యాలయాల సముదాయం ఎదురుగా గల సోపిరాల రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ (చెడుగుడు) జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్ల శిక్షణ అనంతరం ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఇందుకూరు పేటలో జరిగే రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

పాలంక తిరునాళ్లకు ఏర్పాట్లు

ఎర్రగొండపాలెం, జూలై 12 : నల్లమల అటవీప్రాంతంలోని పాలంక వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవార్ల తిరునాళ్ల ఉత్సవం ఈ నెల 17,18,19 తేదీలలో జరుగుతుందని, భక్తులకు అటవీశాఖ అధికారులు సౌకర్యాలు కల్పించాలని తహసీల్దారు సోమ్లనాయక్ అన్నారు. ఎర్రగొండపాలెం తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అటవీశాఖ అధికారులు భక్తులకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరపరా చేయాలని, డాక్టర్లు వైద్యశిబిరం ఏర్పాటు చేయాలన్నారు. సీఐ రాములునాయక్ మాట్లాడుతూ తిరునాళ్ల మూడు రోజులు భక్తులకు అడవిలో పోలీసు సిబ్బంది రక్షణగా ఉంటారన్నారు. ఉత్సవ కమిటీలు భోజనాలు ఏర్పాటు చేయడానికి ఫారెస్టు అధికారులు సహకారం అందించాలని కోరారు. గంజివారిపల్లె ఫారెస్టు రేంజరు వెంకటేశ్వరరెడ్డి తాగునీరు సరపరా చేస్తామని తెలిపారు. అన్ని పోలీసు, మెడికల్, ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలను అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

కొత్తపట్నం(ఒంగోలునగరం) జూలై 12: కొత్తపట్నం పంచాయతీ దేవుని తోట కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం లయన్స్ క్లబ్ ప్రతినిధులు నోట్ పుస్తకాలను, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. సుమారు రూ.18 వేల విలువైన వస్తువులను వారు పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఎం.నరసింహారావు, కార్యదర్శి ఆడపాల అయ్యప్ప, ప్రెసిడెంట్ సోమయ్య, రీజియన్ చైర్మన్ ఎ.వెంకటరావు, జోన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం సూర్యకుమారి, ఎంఈవోలు తులసికుమారి, పద్మావతి, హైస్కూలు హెచ్ఎం శ్రీదేవి, గమళ్ళపాలెం హైస్కూలు హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు చార్లెస్‌బాబు, కొండయ్య, రాజు, వరలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీలు చించివేత

మేదరమెట్ల, జూలై 12: బొడ్డువానిపాలెంలో తెలుగుదేశంపార్టీ ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత టీడీపీ ఫ్లెక్సీలు చించి కుప్పగా వేశారని గ్రామ టీడీపీ నాయకులు శుక్రవారం మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల క్రితం వైసీపీకి చెందిన ఫ్లెక్సీలను కూడా చించివేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఫ్లెక్సీలను చించడంపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రామాపురంలో బీచ్‌లు పునఃప్రారంభం

వేటపాలెం(చీరాల), జూలై 12: రామాపురం తీరంలో గత నెలలో జరిగిన వరుస ప్రమాదాలతో బీచ్‌లను మూసివేశారు. పర్యాటకులకు అనుమతి నిషేధించారు. ఈక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పోలీస్ అధికారులు, తీరంలోని రిసార్ట్స్, హోటల్స్ నిర్వాహకులతో ఒకటి రెండు, మూడు పర్యాయాలు సమీక్ష చేశారు. అంతిమంగా పర్యాటకుల భద్రతే అందరి లక్ష్యం కావాలని కొండయ్య చెప్పారు. ఈనేపథ్యంలో తీరంలో భద్రతా చర్యలకు రిసార్ట్స్, హోటల్స్ నిర్వాహకులు సంయుక్తంగా ముందుకువచ్చారు. తీరంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చే శారు. తీరం నుంచి నిర్ణీత దూరం నుంచి లోతుకు వెళ్లకుండా ఎర్ర జెండాలు పాతారు. సెర్ఫ్ టవర్లు ఏర్పాటు చేశారు. నిర్దీత స్నానాల ప్రదేశాల్లో గత ఈతగాళ్లను ఏర్పాటుచేశారు. వారికి లైఫ్ జాకెట్లతో పాటు హ్యాండ్ మైక్‌లు అందజేశారు. ప్రమాద హెచ్చరికలు ఎప్పటికప్పుడు తెలిపే విధంగా అన్నిచర్యలు చేపట్టారు. ఈక్రమంలో గురువారం రాత్రి పోలీస్ అధికారులు, రిసార్ట్స్ నిర్వాహకుల మధ్య జరిగిన చర్చల అనంతరం నిర్ణీత అంశాలను అమలుపరుస్తూ పర్యాటకులకు, రిసార్ట్స్, హోటల్స్ పునఃప్రారంభానికి అనుమతి ఇచ్చారు. ఈసందర్భంగా ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా సముద్రతీరంలో జరిగిన ప్రమాదాల కారణంగా అనుమతులు నిషేధించినట్టు చెప్పారు. ఆయా ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకుని శుక్రవారం నుంచి అనుమతులు కల్పించామన్నారు.

మునిసిపల్ మంత్రిని కలిసిన దామచర్ల



మంత్రి నారాయణతో మాట్లాతున్న ఎమ్మెల్యే జనార్దన్

రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ శుక్రవారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా దామచర్ల ఒంగోలు నగర సమస్యలతో పాటు, వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. నగర అభివృద్ధి కోసం అవసరమైన ప్రతిపాదనలు, పలు సమస్యలను మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి సానుకూలంగా స్పందించి అవసరమైన నిధులు, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు

- ఒంగోలు (కార్పొరేషన్)

అన్న క్యాంటీన్ల కోసం ఆర్థికసహాయం



ఎమ్మెల్యే దామచర్లకు విరాళం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 12: పేదల ఆకలి తీర్చేందుకు తెలుగుదేశం ప్రభుత్వం అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని, అందుకోసం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.50వేల విరాళం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు శుక్రవారం ఒంగోలులో అందజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ గత 26 రోజులుగా నగరంలో ఎమ్మెల్యే దామచర్ల, మరి కొందరు దాతల సహకారంతో ఉచితంగా భోజనం అందించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్లు కొనసాగించేందుకు, పేదల ఆకలి తీర్చడం కోసం తమ వంతుగా ఆర్థిక సహాయం ఎమ్మెల్యే దామచర్లకు అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

కౌలు రైతుల గుర్తింపునకు గ్రామ సభలు

● డీఏవో శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కొండపి, జూలై 12 : కౌలు రైతుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించి కార్డులు అందజేయాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం కొండపి మండల పరిషత్ సమావేశం హాలులో వీఆర్వోలు, వీఏఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు కార్డు ఉన్న రైతులకు పంట రుణం, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు నష్టపరిహార రాయితీలు అందుతాయన్నారు. తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కౌలుకు భూములు ఇచ్చే రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కౌలు కార్డు పరిమితి 11 నెలలు మాత్రమేనని, కౌలు రైతుకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. కౌలు రైతుల గుర్తింపునకు ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఏవో డి.విజయభాస్కర్ తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో నాగమణి పాల్గొన్నారు.

మేలురకం పశుగ్రాసాలను సాగు చేయాలి



పశుగ్రాసాన్ని పరిశీలిస్తున్న వైద్యులు రమేష్, లావణ్య, రైతులు

చీమకుర్తి, జూలై12 : మేలురకాల పశుగ్రాసాలను వాడటం వల్ల పాడిరైతులకు బహుళప్రయోజనం చేకూరుతుందని పశుసంరక్షశాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎ.రమేష్‌బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. పశుగ్రాసవారోత్సవాలను శుక్రవారం మండలంలోని కూనంనేనివారిపాలెం గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్‌నేపియర్, బాజ్రా, సీవో1, సీవో2 తదితర రకాల గ్రా సాలు ఉపయోగించటం వల్ల అధిక పాలదిగుబడితో బాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయని, గ్రాసం సమస్య కూడా తలెత్తదని రైతులకు సూచించారు. వీటికి సంబంధించిన విత్తనాలను రైతులకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ మనురూప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు నగరపాలక సంస్థ, ఒంగోలు

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ నెం.

44/2024-25 నుండి 56/2024-25 వరకు, తేది.12-07-2024

1.	మొత్తం పనుల సంఖ్య	13
2.	మొత్తం పనుల అంచనా విలువ	రూ. 82.25 లక్షలు
3.	'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో టెండర్ షెడ్యూల్ లభ్యమగు ప్రారంభ తేది	15-07-2024 సాయంత్రం 4.00 గం॥ నుండి
4.	'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో టెండర్ షెడ్యూల్ లభ్యమగు చివరి తేది	22-07-2024 సాయంత్రం 4.00 గం॥ ల వరకు
5.	'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసులో ఆన్‌లైన్ ద్వారా బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయము	22-07-2024 సాయంత్రం 4.15 గం॥ల వరకు
6.	ప్రైస్ బిడ్ తెరుచుటకు నిర్ణయించిన తేది మరియు సమయము	22-07-2024 సాయంత్రం 4.30 గం॥లకు

ఇతర వివరములకు సంప్రదించవలసిన చిరునామా

www.apeprocurement.gov.in

వివరములకు : 98499 08065

సం/- కమీషనర్,
ఒంగోలు నగరపాలక సంస్థ

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నీటి కష్టాలు

- పనులు పూర్తి చేయించడంలో అధికారుల వైఫల్యం
- ప్రాధాన్యత కల్గిన పనులే అయినా పట్టని పాలకులు


ట్యాంకర్ల వద్ద బిందెలకు నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

మార్కాపురం, జూలై 11: మార్కాపురంలో తాగునీటి కష్టాలు తీవ్రస్థాయికి చేరాయి. సుమారు ఏడేళ్ల తర్వాత మళ్లీ ప్రజలు బిందెలతో రోడ్లపైకి వస్తున్నారు. శివారు కాలనీల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. పగలు, రాత్రి తేడాలేకుండా నీటి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. దూపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, గుండ్లకమ్మ చెక్‌డ్యామ్‌లలో చుక్కనీరు అందుబాటులో లేదు. పది రోజులుగా ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ట్యాంకర్లు, వార్డుల్లో ఉన్న డీప్‌బోర్ల ద్వారా మాత్రమే ప్రజలకు నీరందుతోంది. వాస్తవానికి కొన్ని పెండింగ్ పనులపై ప్రభుత్వం, అధికార యంత్రాంగంలో ముందుచూపు కొరవడడంతోనే ఈ పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తే భవిష్యత్తులో నీటికొరత రాకుండా ఉండేందుకు అవకాశం ఉంది. ఆ దిశగా అధికార యంత్రాంగం దృష్టిసారించాల్సి ఉంది.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

మార్కాపురం పట్టణానికి సాగర్ నీటి పథకమే ప్రధాన తాగునీటి వనరు. త్రిపురాంతకం మండలం దూపాడులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి 28 కిలోమీటర్ల మేర వేసిన పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించాలి. తర్లుపాడు రోడ్డులోని పెద్ద ట్యాంకు వద్ద నీటిని శుద్ధిచేసి పట్టణంలోని ఐదు ఈఎల్ఎస్ఆర్‌ల ద్వారా అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేయాలి. ఇంత వ్యవస్థ ఉన్నా వేసవి కాలంలో నీటి కష్టాలు మళ్లీ తప్పలేదు. దీంతో లోపాలపై దృష్టిపెట్టి కొన్ని పనులు పూర్తిచేస్తే ఏడాది పొడవునా ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని అందించవచ్చు. ప్రధానంగా సాగర్ కాలువ నుంచి సమ్మర్ స్టోరేజీ ట్యాంకును త్వరగా నింపేందుకు రూ.12.5 కోట్లతో నూతన పంపింగ్ వ్యవస్థ, పట్టణంలో రూ.5.50 కోట్లతో 18 కిలోమీటర్ల మేర నూతన భూగర్భ పైప్‌లైన్, దూపాడు నుంచి బోడిరెడ్డిపల్లె మధ్య తరచూ మరమ్మతులకు గురవుతున్న పాత పైప్‌లైన్ స్థానే రూ.4.70 కోట్లతో నూతన డీఐ పైప్‌లైన్ నిర్మాణం పనులను గుర్తించారు. 2018లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ మూడు పనులకు టెండర్లు పిలిచింది. ఎన్నికల సమయం కావడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ మూడు పనులపై దృష్టిసారించలేదు. దీంతో ప్రజల నుంచి నాయకులకు ఈ పనుల విషయంలో ఒత్తిడి ఎక్కువైంది. దీంతో 2021లో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆయా పనులకు 2022లో టెండర్లు పిలిచారు. వాటిల్లో దూపాడు నుంచి బోడిరెడ్డిపల్లె వరకు 3.5 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులు, పట్టణంలో 18 కిలోమీటర్ల మేర భూగర్భ పైప్‌లైన్ పనులను దక్కించుకున్న ఏవీ రాంబాబు ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ పనులను ప్రారంభించింది. కీలకమైన సాగర్ కాలువ నుంచి సమ్మర్ స్టోరేజీ వరకు నూతన పంపింగ్ వ్యవస్థకు నాలుగుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకురాలేదు. చివర్లో 2024 జనవరిలో హైదరాబాద్‌కు చెందిన సుధాకర్ ఇన్‌ఫ్రా కంపెనీ టెండర్ దక్కించుకున్నా పనులు ప్రారంభించలేదు. అత్యంత ప్రాధాన్యత కల్గిన ఈ మూడు పనులను పూర్తి చేసేందుకు అటు పాలకులు, ఇటు అధికార యంత్రాంగం దృష్టి సారించిన పాపానపోలేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కొనసాగిన నిర్లక్ష్యం ఫలితంగానే పట్టణంలో ప్రస్తుతం తాగునీటి కష్టాలు ఏర్పడటానికి కారణమైంది.

కీలకమైన పనిపై కొనసాగిన నిర్లక్ష్యం

2,200 ఎమ్ఎల్‌డీ సామర్థ్యం కల్గిన దూపాడులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పూర్తిగా నిండాలంటే సాగర్ ప్రధాన కాలువ నుంచి 90 రోజులపాటు పంపింగ్ చేయాల్సివుంది. తక్కువ రోజుల్లో సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నింపేందుకు పాతదానికి సమాంతరంగా నూతన వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు 2018లోనే అప్పటి పురపాలక పాలకవర్గం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రెండు పంపింగ్ వ్యవస్థల ద్వారా కేవలం 30 రోజుల్లోనే ఎస్ఎస్ ట్యాంకు నిండుతుంది. అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పనికి రూ.12 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు పిలిచారు. కానీ ఎన్నికలకు ముందు కావడంతో ఎవరూ ముందుకు రాలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి ఈ పని ప్రాధాన్యతను స్థానిక మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. అయినా ఈ పనిపై దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. వేసవి కాలంలో కొంతమేర ఇబ్బందికర పరిస్థితులు ఎదురుకావడం, ప్రజల నుంచి కూడా తరచూ ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రెండేళ్ల తర్వాత 2022లో ఈ పనికి టెండర్లు పిలిచారు. కానీ కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. నాలుగుసార్లు పిలిచినా ఈ ఒక్క పని మాత్రమే పెండింగ్‌లో ఉండిపోయింది. 2024 జనవరిలో హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ పనులను దక్కించుకున్నా నేటికీ ప్రారంభించలేదు. స్థానిక పురపాలక సంఘ పాలకవర్గం కాంట్రాక్టర్‌పై ఆర్థికపరమైన ఒత్తిళ్ల నేపథ్యంలోనే పనులు మొదలు కాలేదని విమర్శలు ఉన్నాయి.

మిగిలిన పనుల పురోగతి అంతంత మాత్రమే

2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మార్కాపురం పట్టణానికి సాగర్ నీటిని అందించేందుకు రూ.45 కోట్లతో దూపాడు నుంచి మార్కాపురం వరకు పైప్‌లైన్ నిర్మాణం చేసింది. అప్పట్లో మొత్తం 28 కిలోమీటర్లకుగాను దూపాడు నుంచి బోడిరెడ్డిపల్లె జంక్షన్ వరకు 3.5 కిలోమీటర్ల మేర ప్రయోగాత్మకంగా జీఆర్‌పీ పైప్‌లైన్ వేశారు. అక్కడ నుంచి మార్కాపురం వరకు 24.5 కిలోమీటర్లు వరకు డీఐ పైప్‌లైన్ వేశారు. పథకం ప్రారంభమైన నాటి నుంచి సుమారు దశాబ్ద కాలంపాటు ఆ 3.5 కిలోమీటర్ల పరిధిలోనే నెలకు రెండుసార్లైనా లీకులు ఏర్పడేవి. దీంతో మరమ్మతుల ఖర్చులు మున్సిపాలిటీకి తలకుమించిన భారమైంది. ఈ నేపథ్యంలో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పాతదాని స్థానే నూతన పైప్‌లైన్ వేసేందుకు టెండర్లు పిలిచింది. తదనంతర కాలంలో 2022లో వైసీపీ ప్రభుత్వం మళ్లీ ఈ పనికి టెండర్లు పిలిచింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మాత్రం బిల్లులు పడటంలేదనే కారణంతో రెండేళ్ల కాలంలో ఇప్పటికి రెండు కిలోమీటర్ల మేర మాత్రమే పైప్‌లైన్ వేశాడు. వాస్తవానికి ఆరు నెలల్లో ఆ పనిని పూర్తి చేయాల్సివుంది. ప్రస్తుతం ఇంకా 1.5 కిలోమీటర్ల మేర పని పూర్తి కావాల్సివుంది. అదే విధంగా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు భూగర్భ పైప్‌లైన్ వేసినా స్థానిక 10వ రెవిన్యూ వార్డును విస్మరించారు. ఈ ప్రాంతంలో సుమారు 18 కిలోమీటర్ల మేర భూగర్భ పైప్‌లైన్ పనులకు రూ.5.20 కోట్లతో 2023లో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మాత్రం సంవత్సరం కావస్తున్నా రెండు కిలోమీటర్లు కూడా పనులు పూర్తి చేయలేదు. ఆయా ప్రాంతాల్లో ముందు సీసీ రోడ్లను పగులకొట్టి పైప్‌లైన్ వేయాలి. రోడ్లను పగులకొట్టారు కానీ పైప్‌లైన్ వేయలేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలకు పనులు పూర్తికాక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.


మార్కాపురంలో నీటి కనెక్షన్ల కోసం ఏర్పాటు చేసిన పైపులు, దూపాడు నుంచి బోడిరెడ్డిపల్లె మధ్య పైప్‌లైన్ పనులు

అవీ..ఇవీ..

బీసీ కాలనీలో డ్రైనేజి వసతి కల్పించాలి

బేస్తవారపేట, జూలై12: బేస్తవారపేట పంచాయతీలోని బీసీ కాలనీ శ్రీచౌడేశ్వరమ్మదేవి ఆలయ ఎదురు వీధిలో వర్షపు నీరు నిలిచి దోమలకు నిలయంగా మారింది. పలుమార్లు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసిన డ్రైనేజి సౌకర్యం కల్పించలేదు. దీంతో వర్షపునీరు బయటకు వెళ్లడానికి తగిన చర్యలు తీసుకోలేదు. కనీసం నీరు నిల్వ ఉన్న సమయంలో బ్లీచింగ్ చల్లలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఆ రోడ్డులో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వర్షపు నీరు నిల్వలేకుండా కనీసం రోడ్డుకు ఒకవైపైనా కాలువలు ఏర్పాటు చేసి నీరు బయటకు పంపే మార్గం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వైభవంగా శాకాంబరి ఉత్సవం


కూరగాయల అలంకరణలో వాసవి అమ్మవారు

గిద్దలూరు, జూలై 12 : పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం శాకాంబరి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ, దాతలు సమకూర్చిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారితోపాటు దేవాలయ ప్రాంగణాన్ని అలంకరించి శాకాంబరి ఉత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహికంగా వాసవిమాత అష్టకాన్ని పఠించారు. ఆయా పూజా కార్యక్రమాలలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జగదాంబకు ఆషాడమాస పూజలు


విశేష అలంకరణలో జగదాంబ అమ్మవారు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 12: ఆషాడమాస నవరాత్రుల్లో భాగంగా స్థానిక శివాలయంలోని జగదాంబమాతకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రెంటచింతల వరుణ్ తేజశర్మ అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అర్చన, నివేదన, చండీ పారాయణం, మధ్యాహ్నిక అర్చన, సాయంత్రం సహస్ర నామసహిత కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

తగు జాగ్రత్తలతో విషజ్వరాల నివారణ

మార్కాపురం రూరల్, జూలై 12: మండలంలోని ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో చందన సూచించారు. మండలంలోని తిప్పాయపాలెం గ్రామంలో శుక్రవారం ఆమె అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. దోమల నివారణకు నీరు నిల్వలేకుండా చూడాలని సూచించారు. విష జ్వరాలు డెంగ్యూ, మలేరియా, డయేరియా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని వెంటనే వాటిని తగుజాగ్రత్తలతో నివారించాలన్నారు. నీటి నిల్వ చేసే ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని కోరారు. అలాగే గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సంభాషించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. క్లాస్ రూమ్‌లో విద్యార్థుల ఇంగ్లీష్ రైటింగ్ స్కిల్స్ పరీక్షించి, గ్లోబల్ వార్మింగ్ విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు.

నేటి నుంచి మొహర్రం వేడుకలు


ఇడుపూరులోని చావిడిలో కొలువైన పీర్లు

మార్కాపురం రూరల్, జూలై 12: మండలంలోని ఇడుపూరు గ్రామంలో నేటి నుంచి మొహర్రం వేడుకలు అట్టహాసంగా ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో మొహర్రం పండుగను ఐదు రోజులపాటు నిర్వహిస్తారన్నారు. ఈ నెల 13న చిన్న షరగత్‌తో ప్రారంభమై ఈ నెల 18వ తేదీ గురువారం షాహదత్‌తో వేడుకలు ముగుస్తాయన్నారు. గ్రామంలోని ప్రజలంతా కులమతాలకతీతంగా ఈ పండుగను జరుపుకుంటారన్నారు. ఈ మొహర్రం వేడుకలు వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు వస్తుంటారు.

టీడీపీ నేతల చొరవతో పైపులైన్ పునరుద్ధరణ



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పొదిలి, జూలై 12 : పట్టణంలోని ఆరవ వార్డులో బుగ్గచలం పైపులైన్‌ను శుక్రవారం టీడీపీ నాయకులు పునరుద్ధరించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆరవ వార్డులో నీటి సమస్య, బాప్టిస్ట్ పాలెంలో నెలకొన్న విద్యుత్ సమస్యను నేడు టీడీపీ నాయకులు, కమిషనర్ చొరవతో తీర్చారు. పట్టణంలోని సమస్యలపై ఎమ్మెల్యే నారాయణరెడ్డి దృష్టిసారించి, పైపులైన్ సమస్య తీర్చడంతో కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా బాప్టిస్ట్‌పాలెం సమీపంలో ఐదు సంవత్సరాలుగా నెలకొన్న విద్యుత్ సమస్యను కూడా రాత్రికిరాత్రే విద్యుత్ అధికారుతో మాట్లాడి పరిష్కరించడం శుభపరిణామమని కాలనీవాసులు తెలిపారు.

కౌలు రైతులకు అవగాహన

పెద్ద దోర్నాల, జులై 12: చిన్నగుడిపాడు, దోర్నాల-3 సచివాలయంలో మండల వ్యవసాయాధికారి డీ.జవహర్‌లాల్‌నాయక్ కౌలు రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో జవహర్‌లాల్ నాయక్ మాట్లాడుతూ పంట సాగుహక్కుపత్రం(సీసీఆర్‌సీ) కార్డు మంజూరుతో ప్రభుత్వం అమలుచేసే పథకాలు, పంటలబీమా, రాయితీతో విత్తనాలు, ఎరువులు, స్ప్రేయర్లు తదితరములు పొందవచ్చన్నారు. కౌలురైతులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఏకపాత్రాభినయంలో శ్రీనివాసులు ప్రతిభ


కాళంగిని సన్మానిస్తున్న నిర్వాహకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 12: మార్కాపురం పట్టణానికి చెందిన కళాకారుడు కాళంగి శ్రీనివాసులు ఏకపాత్రాభినయంలో జాతీయ స్థాయిలో మూడో స్థానానికి ఎంపికయ్యారు. ఒంగోలుకు చెందిన రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. శ్రీనివాసులకు మూడో బహుమతి లభించింది. పౌరాణిక విభాగంలో శకుని శపథం పాత్రకు రంగభూమి కళాకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సీతంశెట్టి హరిబాబు, అంగలకుర్తి ప్రసాద్, ప్రముఖ రంగస్థల న్యాయ నిర్ణేత డాక్టర్ రజాక్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక, రూ.1500 నగదు అందుకున్నారు. పలువురు ప్రముఖులు కాళంగి శ్రీనివాసులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడి మృతి

పెద్దారవీడు, జూలై 12: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మండలంలోని తోకపల్లి వద్ద గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం ఎర్రగొండపాలెం మండలం అమ్మానిగుడిపాడుకు చెందిన సీహెచ్ బ్రహ్మచారి, ఆయన భార్య గంగాదేవి, కుమారుడు సుబ్రమణ్యాచారీలకు తీవ్రగాయాలయ్యాయి. మార్కాపురం ప్రభుత్వ ప్రజా సర్వజన వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ సుబ్రమణ్యాచారికి ఊపిరితిత్తుల్లో రక్తంగడ్డకట్టినట్లు వైద్యులు నిర్ధారించారు. అందుకు అవసమయ్యే డబ్బులను మనవతావాదులు ఫోన్ పే ల ద్వారా వారి కుటుంబానికి పంపుతున్నారు. ఇంతలో శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు సుబ్రమణ్యాచారి మృతి చెందాడు. దీంతో బాగా చదివే కుమారుడు కళ్ల ఎదుటే మరణించడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

రెండు మోటారు సైకిళ్లు ఢీ

- ఒకరికి తీవ్రగాయాలు

మార్కాపురం, జూలై 12: ఎదురెదురుగా వస్తోన్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం ఉదయం స్థానిక మార్కెట్ యార్డు వద్ద చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలుకాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు., పెద్దారవీడు మండలం బద్వీడు చెర్లోపల్లి గ్రామానికి చెందిన చిట్యాల తిరుపతిరెడ్డి మోటార్‌సైకిల్‌పై మార్కాపురం వస్తున్నాడు. ఈ క్రమంలో మార్కెట్ యార్డు సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తోన్న మరో బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో తిరుపతిరెడ్డి తలకు తీవ్ర గాయమైంది. మరో బైకుపై ఉన్న వారిలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తిరుపతిరెడ్డిని వెంటనే స్థానిక కందుల ఓబులరెడ్డి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా కేంద్రాన్ని పరిశీలించిన డీఎస్పీ


కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

పొదిలి, జూలై 12 : మండలంలోని సలకనూతల, దొండ్లేరు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన మణికంఠ ఎంటర్ ప్రైజెస్ బాణసంచా విక్రయ కేంద్రాన్ని దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసర ప్రాంతంలో పెన్సింగ్, రెడ్‌ఫ్లాగ్స్, వాటర్ ఫెసిలిటిని ఏర్పాటు చేయాలని యజమానికి సూచించారు. అంతే కాకుండా ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించినప్పుడు అందుకు తగిన సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్టాకును, రిజిస్టర్లు పరిశీలించారు. ఆయన వెంట సీఐలు మల్లిఖార్జున్‌రావు, ఎస్ కోటయ్యలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బేస్తవారపేట,జూలై12: బేస్తవారపేట సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా బేస్తవారపేట, సోమవారపేట, చింతలపాలెం, గొట్టమిల్లు, నేకునాంబాద్, కలగొట్ల, చెట్టిచెర్ల, ఓందుట్ల గ్రామాలకు నేటి ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అందుకు వినియోగదారులు సహకరించాలని ఏ.ఈ ఎస్.ఎస్.రావు తెలిపారు.

నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గిద్దలూరు టౌన్ : 33కేవీ రాజుపాలెం ఫీడర్, 33కేవీ సంజీవరాయునిపేట ఫీడర్, గిద్దలూరు టౌన్, 11కేవీ ఫీడర్ ప్రాంతాలలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఆయా ప్రాంతాలలో శనివారం ఉదయం 7గంటల నుండి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ బి.వి.శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు.

తిరునాళ్లకు ఏర్పాట్లు చేయండి

- అధికారులతో సమావేశంలో తహసీల్దార్ సోమ్లానాయక్

ఎర్రగొండపాలెం, జూలై 12 : నల్లమల అటవీప్రాంతం లోని పాలంక వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవార్ల తిరునాళ్ల ఉత్సవం ఈ నెల 17,18,19 తేదీలలో జరుగుతుందని, తిరునాళ్లకు వెళ్లే భక్తులకు అటవీశాఖ అధికారులు సౌకర్యాలు కల్పించాలని తహసీల్దారు సోమ్లనాయక్ అన్నారు. ఎర్రగొండపాలెం తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అటవీశాఖ అధికారులు భక్తులకు ట్యాంకర్లు ద్వారా తాగునీరు సరఫరా చేయాలని, డాక్టర్లు వైద్యశిబిరం ఏర్పాటు చేయాలన్నారు. సీఐ రాములు నాయక్ మాట్లాడుతూ తిరునాళ్ల మూడు రోజులు భక్తులకు అడవిలో పోలీసు సిబ్బంది రక్షణగా ఉంటారన్నారు. ఉత్సవ కమిటీలు భోజనాలు ఏర్పాటు చేయడానికి ఫారెస్టు అధికారులు సహకారం అందించాలని కోరారు. గంజివారిపల్లె ఫారెస్టు రేంజరు వెంకటేశ్వరరెడ్డి తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. అన్ని పోలీసు, మెడికల్, ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.

పంటసాగు హక్కుపత్రాల అందజేత

గిద్దలూరు, జూలై 12 : మండలంలోని అంబవరం, వెల్లుపల్లి, గిద్దలూరు, తిమ్మాపురం గ్రామాలలో పంటసాగు హక్కుపత్రాలపై గ్రామసభలు నిర్వహించారు. కౌలు రైతులకు పంటసాగు హక్కుపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పొలాలను కౌలుకు తీసుకొని సాగు చేసుకునే రైతులు కౌలుకార్డులు తీసుకోవాలన్నారు. పంటసాగు హక్కుపత్రం కాలపరిమితి 11 నెలలు ఉంటుందని, దీనివలన భూయజమానులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, పంట మీద మాత్రమే కౌలుదారులకు హక్కు ఉంటుందని, భూమిమీద ఎలాంటి హక్కు ఉండదని, కావున యజమానులు కౌలుకు ఇవ్వడంలో అనుమానాలు వీడాలని పేర్కొన్నారు. కౌలుకార్డులు పొందడం ద్వారా పంట నమోదు, పంటలబీమా, అవసరమైతే పంట నష్టపరిహారం, కౌలు రుణాలు, ధాన్యం అమ్మకాలు పొందవచ్చన్నారు. కావున కౌలు కార్డులు పొందని వారు భూయజమాని ఆధార్‌కార్డు పట్టాదారు పాస్‌పుస్తకం, కౌలు అగ్రిమెంటు, కౌలుదారు ఆధార్‌కార్డు, ఫొటో, మొబైల్ నెంబరు తీసుకుని వీఆర్‌వో, వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

బియ్యం, కందిపప్పు విక్రయకేంద్రాలు ప్రారంభం


సరుకులు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం, జూలై 12: ఆకాశాన్నంటిన నిత్యావసర ధరలను అదుపు చేసేందుకు ప్రభుత్వం రాయితీపై బియ్యం, కందిపప్పులను తక్కువ ధరలకు అందజేసేందుకు చర్యలు తీసుకుందని మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. స్థానిక కొత్త మార్కెట్ వద్ద ఉన్న బియ్యం దుకాణాల సముదాయం వద్ద రాయితీపై తక్కువ ధరకు బియ్యం, కందిపప్పులను అందించే విక్రయ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు విక్రయ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దుకాణదారులు నిత్యావసరాలను స్టాక్ పెట్టి ఎక్కువ ధరలకు అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్ ఉన్నారు.

పొదిలి : పట్టణంలో నిత్యవసర సరుకులైన కందిపప్పు, బియ్యం సరఫరా కేంద్రాలను పౌర సరఫరాల శాఖ అధికారులు, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిత్యావసర ధరలను నియంత్రించడంలో విఫలమైందని, టీడీపీ ప్రభుత్వం ధరల నియంత్రణలో భాగంగా డాల్ మిల్లర్స్ అసోసియేషన్స్, రైస్‌హోల్‌సేల్ షాపుల వారి సహకారంతో చిన్న బస్టాండ్ కూడలిలోని హరిహరపుత్ర డాల్‌మిల్‌లో కందిపప్పు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా వెంకటేశ్వర జనరల్‌స్టోర్స్, సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్ నందు బియ్యం కేంద్రాలను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రవి, గోడౌన్ డీటీ రామనారాయణరెడ్డి, డేవిడ్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, వీఆర్వోలు నారాయణ, యాకోబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మండల పట్టణాధ్యక్షులు మీగడ ఓబులరెడ్డి, ముల్లా ఖుద్దూస్, టీఎన్ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనీల్, జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు రసూల్, ప్రధానకార్యదర్శి కాటూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : వినియోగదారులకు సరసమైన ధరలలో నాణ్యమైన సరుకులను అందిస్తున్నట్లు టీడీపీ నాయకుడు కృష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని మున్సిపల్ కాంప్లెక్స్ గదిలో ఏర్పాటు చేసిన నిత్యవసర వస్తువులలో భాగమైన కందిపప్పు, బియ్యాన్ని సరసమైన ధరలకు అందిస్తుండగా కృష్ణకిషోర్‌రెడ్డి ప్రారంభించారు. రూ.181 ఉన్న కందిపప్పును రూ.160కి, సోనామసూరి బియ్యం రూ.55.85 రూపాయలు ఉండగా రూ.49లకు మరో రకం బియ్యం రూ.52.40 ఉండగా, రూ.48లకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షులు షానేషావలి, టీడీపీ నాయకులు దప్పిలి కాశిరెడ్డి, పాలుగుళ్ల చిన్నశ్రీనివాసరెడ్డి, శివపురం మురళి పాల్గొన్నారు.

సంక్షేమ వసతిగృహాలలో సమస్యలు పరిష్కరించండి

అధికారులకు టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు సూచన


బాలుర వసతిగృహంలో మరుగుదొడ్లు పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూలై 12 : ఎర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో ఉన్న సాంఘీక సంక్షేమ వసతిగృహాలను, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను శుక్రవారం సాయంత్రం అధికారులతో కలసి టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పరిశీలించారు. మొదటగా ఎస్సీ బాలికల వసతిగృహంలో పరిశీలించారు. మరుగుదొడ్లకు లైట్లు, తలుపులు సక్రమంగా లేకపోవడంతో ఏర్పాటు చేయాలని పంచాయతి కార్యదర్శికి చెప్పారు. విద్యార్థినుల సంఖ్యకు తగ్గట్టుగా రూములు లేవని చెప్పడంతో, పాతభవనంపై 1 అంతస్తుకు అవకాశం ఉంటే నాణ్యత పరిశీలించి అంచనాలు తయారుచేయాలని సర్వశిక్షఅభియాన్ ఇంజనీర్లును కోరారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సమస్యలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. డిగ్రీ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తా మన్నారు. మార్కాపురం రోడ్డులోని ఎస్సీ బాలుర వసతిగృహంలో మెనూ పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న మెనూ సక్రమంగా వడ్డిస్తున్నారా..? లేదా అని తెలుసుకున్నారు. మరుగు దొడ్లు సక్రమంగా లేవని నీటి సౌకర్యం లేదని, వసతి గృహం భవనానికి కిటికీలు లేక రాత్రులు దోమలతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. దీనిపై ఇన్‌చార్జ్ స్పందిస్తూ మరో నెలరోజుల్లో వసతిగృహాన్ని సందర్శిస్తానని విద్యార్థులకు వసతులు కల్పించి మెను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ రమణయ్య ఏఈ శ్రీనివాసరావు, వార్డెన్‌లు, పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే ముత్తుముల


మంత్రి నారాయణతో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 12 : రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పలువురు మంత్రు లను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణను కలిసిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మున్సిపాలిటి పరిధిలోని అభివృద్ధి పనుల గురించి చర్చించారు. పట్టణంలో మౌళిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్లు, తాగునీటి సమస్య, మురికి నీటి కాలువల ఏర్పాటు తదితర అంశాల గురించి నిధులు కేటాయించాలని కోరారు. పశ్చిమ ప్రాంతంలో వెనుకబడిన గిద్దలూరు ప్రాంతానికి ఎక్కువ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థక, పాడి పరిశ్రమలు, మార్కెటింగ్, సహకార, మత్స్యశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడును సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రుల క్యాంపు కార్యాలయం వద్ద గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు.

గత ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసింది: యూటీఎఫ్

మార్కాపురం వన్‌టౌన్, జూలై 12: గత ప్రభుత్వం విద్యారంగాన్ని సంస్కరణల పేరుతో నిర్వీర్యం చేసిందని యూటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మీగడ వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకురాళ్లుగా పని చేసి ఉద్యోగవిరమణ చేసిన ఆర్ఎం ఝాన్సీపాల్, ప్రేమమ్మ, హైమావతిలకు సన్మానసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ముగ్గురు మహిళా నాయకురాళ్లు యూటీఎఫ్ ఉద్యమానికి విశిష్ఠ సేవలు అందించారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మనమే కాపాడుకోవాలని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్ము శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మనం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు విద్యామంత్రికి విన్నవించి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వీరారెడ్డి, శ్రీరాములు, రవి, అబ్దుల్‌హై, చిన్నస్వామి, నరసింహారావు, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ముత్తోజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు అధిక సాగు వద్దు


రైతులకు అవగాహన కల్పిస్తున్న గిరిరాజ్‌కుమార్

పొదిలి, జూలై 12 : ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలను అనుసరించి రైతులు కౌలుపొలం, బ్యారన్‌లు అధిక ధరలకు లీజుకు తీసుకొని వ్యవసాయం చేయడం మంచిదికాదని వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం పొగాకు మార్కెట్లో లభిస్తున్న ధరలు అంతర్జాతీయంగా వివిధ దేశాల్లో పొగాకు పంట సాగు, ఉత్పత్తి, ఇతర అంశాల ఆధారంగా మనకు ధరలు లభిస్తున్నాయన్నారు. ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో పొగాకు దిగుబడులకు అంత రాయం కలగడంతో మన మార్కెట్ ధరలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. బోర్డు అనుమతి లేకుండా రైతులు బ్యారన్‌లు ఏర్పాటు చేయకూడదని అలా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ రద్దుచేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ విషయాన్ని గ్రహించి బోర్డ్ అనుమతి మేరకే పొగాకుసాగు, ముఠా పనివారి లభ్యతను తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని ఉత్పత్తిని పరిమితం చేసుకోవాలని సూచించారు. పొగాకు పంటపైనే దృష్టి పెట్టకుండా లాభసాటిగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని చెప్పారు. ముఖ్యంగా రైతులు లోతట్టు, పల్లపు ప్రాంతాల్లో పొగాకు సాగు చేయవద్దన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని అనుమతి మేరకు పొగాకు సాగు చేయడంతోపాటు అధికంగా కౌలు పొలంగాని, అనుమతి లేకుండా నూతన బ్యారన్‌లు ఏర్పాటు చేయవద్దన్నారు. ప్రస్తుతం ఇప్పటి వరకు 8.66 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేసినట్లు ఆయన చెప్పారు. శుక్రవారం దక్షిణాదిలో ఉన్న 11 వేలం నిర్వహణ కేంద్రాల్లోకి పొదిలిలో అధికంగా కిలో పొగాకు ధర రూ: 270 పలికినట్లు ఆయన చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


చిననరసింహులు(ఫైల్)

పామూరు/కనిగిరి, జూలై 12 : జాతీయ రహదారి 565పై జరిగిన రోడ్డు ప్రమాదంలో కనిగిరి మండలానికి చెందిన నరసింహులు(35) సంఘటన స్థలంలోనే మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకొంది. ఎస్‌ఐ ఎం సైదుబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కనిగిరి మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన రేగలగడ్డ చిననరసింహులు ద్విచక్ర వాహనంపై పామూరు మండలం భూమిరెడ్డిపల్లి, రావిగుంటపల్లి మధ్య రాత్రి సమయంలో వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న నరసింహులకు తలకు తీవ్రమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శిరీష, చిన్నారులైన ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వృత్తిరీత్యా నరసింహులు బేల్దారి మేస్త్రీ. వరంగల్ ప్రాంతంలో ముఠా కట్టుకుని కాంట్రాక్టుపై పనులు చేయిస్తుంటాడు. పనిలో నష్టాలు రావటంతో ఆరు నెలలుగా స్వగ్రామంలోనే ఉంటున్నాడు. నరసింహులు మరణవార్తతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

1,264 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేసిన అధికారులు


వివరాలు తెలుపుతున్న విజిలెన్స్ అధికారులు

పామూరు, జూలై 12 : మండలంలోని 1,264 విద్యుత్ సర్వీసులను విద్యుత్ విజిలెన్స్ శాఖ అధికారులు శుక్రవారం ఏకకాలంలో తనిఖీలు చేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 64 మందిపై కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, ఆపరేషన్ ఈఈ ఎం హరిబాబు, తెలిపారు. విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యధిక లోడును వినియోగిస్తున్న సర్వీసులను మాల్ ప్రాక్టీస్ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, 64 మందిపై రూ.2.లక్షల 90 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నా, చౌర్యానికి పాల్పడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి సబ్‌డివిజన్ డీఈఈ ఉమాకాంత్, పామూరు సబ్‌డివిజన్ డీఈఈ శ్రీకాంత్, విజిలెన్స్ డీఈఈ శ్రీనివాసరావు, పామూరు ఏఈ జిలాని పాల్గొన్నారు.

మూడు రోజుల్లోనే కౌలు హక్కుదారు కార్డులు మంజూరు


మాట్లాడుతున్న ఏవో లక్ష్మీనారాయణ, తహసీల్దార్ సుజాత

దొనకొండ, జూలై 12 : రైతులు కౌలుకు భూమిని సాగు చేస్తుంటే తప్పనిసరిగా కౌలు కార్డు పొందాలని, దరఖాస్తు చేసుకున్న మూడు రోజుల్లో వాటిని మంజూరు చేస్తామని తహసీల్దార్ సుజాత చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 1023 కౌలు హక్కుదారు కార్డులు మంజూరు చేయాలనే లక్ష్యాన్ని ఉన్నతాధికారులు నిర్దేశించినట్లు తెలిపారు. భూ యజమాని హక్కులకు భంగం కల్గకుండా ప్రభుత్వం కౌలుదారు హక్కు చట్టం ప్రవేశపెట్టిందన్నారు.ఏవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కౌలుకార్డు తీసుకోవటం వలన కౌలుదారులకు పంట నమోదు, పకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ పొందేందుకు, పండిన పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు, బ్యాంకుల రుణం పొందటానికి ఉపయోగపడుతుందని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులు

పీసీపల్లి, జూలై 12 : అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయాలని తహసీల్దార్ పద్మావతి చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సీసీఆర్సీ కార్డులపై వీఆర్వోలు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి వెంకటస్వామి పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు

వెలిగండ్ల, జూలై 12 : అర్హులైన ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డును జారీ చేయాలని తహసీల్దార్ డానియేల్ సూచించారు. వెలిగండ్ల తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులకు కౌలు రైతుల గుర్తింపు, వారికి ప్రభుత్వ పథకాల అమలుపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఏవో రంగకృష్ణ పాల్గొన్నారు

బండి దారి స్థలం ఆక్రమణ చెర వీడేనా?


దర్శిలోని బండిదారి స్థలంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లు

దర్శిలో రూ.10 కోట్లు విలువచేసే స్థలం మాయం
మొన్నటి ఎన్నికల కోడ్‌లో మరికొందరు అక్రమ నిర్మాణాలు
వైసీపీ ప్రభుత్వ హయాంలో మరింతగా రెచ్చిపోయిన అక్రమార్కులు
ముడుపులు తీసుకొని సహకరించిన అధికారులు
ఆక్రమణల తొలగింపు కోసం పోరాడుతున్న రైతులు
కూటమి ప్రభుత్వం రావటంతో న్యాయం జరుగుతుందన్న ఆశతో అన్నదాతలు

దర్శి, జూలై 12 : దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో రూ.10 కోట్లు విలువ చేసే బండిదారి స్థలం ఆక్రమణ చెర నుంచి వీడుతుందా, లేదా అన్నది చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని రైతులు ఎదురుచూస్తున్నారు. గతంలో అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేయటంతో సుమారు ఎనిమిది ఎకరాల స్థలం కబ్జాకు గురైంది. కొంతకాలంగా దశలవారీగా ఆక్రమణలకు గురవుతోంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఎవరికి దొరికిన మేరకు వారు ఆక్రమించి ప్రహరీలు నిర్మించుకొని ఆ తర్వాత అక్రమ నిర్మాణాలు చేసి హస్తగతం చేసుకున్నారు. ఆక్రమణదారులలో కొంత మంది ఉద్యోగులు కూడా ఉండడం గమనార్హం.

బ్రిటీష్ హయాంలోనే బండిదారి స్థలంగా గుర్తింపు

దర్శి-కురిచేడు ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన 244, 247, 248, 266 సర్వే నెంబర్లల్లో సుమారు పది ఎకరాల బండిదారి స్థలం ఉంది. దిగువ ప్రాంతాల పొలాలకు వెళ్లేందుకు బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో వంద అడుగుల దారిని విడగొట్టింది. రెవెన్యూ రికార్డుల్లో బండి దారి భూమిగా స్పష్టంగా నమోదు చేసింది.

ఆక్రమణలు ఇలా...

గతంలో ఒక కళాశాల యాజమాన్యం సుమారు ఎకరాకు పైగా బండిదారి స్థలం ఆక్రమించి కళాశాలలో కలుపుకొని ప్రహరీ సైతం నిర్మించుకున్నారు. చుట్టుపక్కల రైతులు మరికొంత స్థలాన్ని ఆక్రమించి పొలాల్లో కలుపుకున్నారు. మిగిలిన దారిలోనే కింది పొలాల రైతులు దారి కింద సర్దుబాటు చేసుకొని వెళ్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన ఐదెకరాల స్థలం కూడా అనేక మంది ఆక్రమించి గృహాలు నిర్మించుకున్నారు. ఎన్నికల సమయంలో ఇదే అదునుగా భావించి కొంత మంది అక్రమ నిర్మాణాలు చేపట్టి ఇప్పటికీ నిర్మాణాలు సాగిస్తున్నారు. ఎన్నికల విధుల కోసం వచ్చిన అధికారులు ఈ విషయం పట్టించుకోకపోవటంతో అక్రమార్కులు ఆడింది ఆటగా పాడింది పాటగా మారింది.


బండిదారి స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీ

ఎకరా కోటికి పైనే...

ప్రస్తుతం అక్కడ ఎకరం ధర కోటి రూపాయలకు పైగా ఉంది. చుట్టుపక్కల కొంత మంది ప్లాట్లు వేసి డీకే భూములను సెంటు లక్షా యాభైవేల రూపాయల చొప్పున విక్రయించారు. అందువలన బండిదారి భూమి చుట్టూ ప్లాట్లు కావటంతో ఈ స్థలానికి ధర మరింత పెరిగింది. కొంతమంది వైసీపీ అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఆక్రమించగా మరికొందరు వ్యాపారులు అధికారులను లోబర్చుకొని స్వాహా చేశారు. ప్రస్తుతం ఒక ఎకరం బండిదారి స్థలం మాత్రమే ఖాళీగా ఉంది. కొద్దిరోజులు గడిస్తే ఆ కొద్దీ స్థలం కూడా ఆక్రమణకు గురయ్యే పరిస్థితి నెలకొంటుంది.

ముడుపులు తీసుకొని సహకరించిన అధికారులు

దర్శి పట్టణంలో ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముడుపులు తీసుకొని అక్రమార్కులకు సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సుమారు రూ.10 కోట్లు విలువచేసే ఎనిమిది ఎకరాల బండిదారి స్థలం పూర్తిగా ఆక్రమణకు గురవుతుంటే రెండు శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారని ఆ ప్రాంత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ ఇచ్చి వదిలేశారు..

వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆక్రమణను అడ్డుకునేందుకు రైతులు ఎంతో పోరాటం చేశారు. ఉన్నతాధికారులకు పలుసార్లు ఫిర్యాదులు చేశారు. ఆ సమయంలో ఆక్రమణలు కొలిచి మార్కింగ్ ఇచ్చారు. ఆ తర్వాత తొలగింపు గూర్చి పట్టించుకోలేదు. వైసీపీ నాయకుల సూచనల మేరకు అక్రమార్కులకు అధికారులకు సహకరిస్తూ రైతుల గోడు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. అందువలన అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమించి చాలా వరకు నిర్మాణాలు చేశారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. కొంతమంది రెవెన్యూ సిబ్బంది అక్రమార్కులను ప్రోత్సహిస్తూ లక్షలాది రూపాయలు ముడుపులు వసూళ్లు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన నగర పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురించాయి. ఆక్రమణలు తొలగిస్తారని బండిదారిని యథేచ్ఛగా ఏర్పాటు చేస్తారని రైతులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

అక్రమాలకు సహకరించిన అధికారులపై వేటు తప్పదు

పామూరు మండల సర్వసభ్య సమావేశంలో ఉగ్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

పామూరు, జూలై 12 : మండలంలోని పనులు చేయకుండా నిధులు డ్రా చేసి అక్రమాలకు సహకరించిన అధికారులపై వేటు తప్పదని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి హెచ్చరించారు. సీఎస్‌పురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉగ్ర మాట్లాడుతూ అక్రమంగా డ్రా చేసుకొన్న నిధులను త్వరలోనే కక్కిస్తానన్నారు. మండలంలో ఉపాధి నిధులతో గత ప్రభుత్వంలో పనులు చేపట్టకుండానే కోట్ల రూపాయల నిధులు అక్రమంగా డ్రాచేశారని దానికి సంబంధించి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేస్తే ఇంతవరకు ఇవ్వకపోవడంపై ఎంపీడీవో రామచంద్రరావుపై ఉగ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సి. నాగులవరం నుంచి మన్నేరు వరకు రోడ్డు వేయకుండనే నిధులు డ్రా చేశారని, చెన్నపేనాయునిపల్లిలో ఒకేచోట ఐదు రోడ్లు వేసినట్లు రికార్డులు చూపించి నిధులు మింగారని ఎంపీటీసీ బొమ్మనబోయిన వెంగయ్య సభ దృష్టికి తీసుకొనిరాగా ఎమ్మెల్యే స్పందిస్తు తగిన ఆధారాలతో విజిలెన్స్‌కు సమర్పించాలన్నారు. రేగులచిలుక గ్రామంలో మరుగుదొడ్లు నిర్మించకుండానే నిధులు డ్రా చేశారని సర్పంచ్ బత్తుల కృష్ణకుమారి తెలిపారు. దేవకమ్రిలో రోడ్డు వేయకుండనే నిధులు డ్రా చేశారని సభ్యులు ప్రస్తావించగా వీటన్నిటికి బాధ్యులైన పీఆర్ ఏఈ రామకృష్ణను ఎమ్మెల్యే ప్రశ్నించగా సమాధానం లేకపోవడంతో ఆరోపణలు రుజువయితే ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. రేగులచెలక పంచాయతీ పరిధిలో స్థానికులకు పట్టాలు ఇవ్వకుండా జగనన్న లేఔట్‌పేరుతో సమీప గ్రామ ప్రజలకు పట్టాలు ఇచ్చారని సర్పంచ్ బత్తుల రమణయ్య ఉగ్ర దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపీడీవోను ఉగ్ర ప్రశ్నించగా అక్కడ ఎంతవరకు ఎవరికి పట్టాలు రాలేదని చెప్పడంతో లేఔట్‌ను రద్దు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మినిట్ బుక్‌లో తీర్మానాలు రాయకుండా సభ్యులచేత సంతకాలు చేయించడం ఏమిటని ఆగ్రహించారు. ప్రజా సమస్యలపై చర్చించారు.

హెల్మెట్‌తో ప్రాణరక్షణ



అవగాహన కల్పిస్తున్న సీఐ రామానాయక్

పామూరు, జూలై 12 : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంతో తమ ప్రాణాలు కాపాడుకోవచ్చునని సీఐ ఎం రామానాయక్ చెప్పారు. స్థానిక మమ్మీడా డీసెంటర్‌లో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. హైకోర్టు సూచన మేరకు ద్విచక్రవాహనాలు నడిపే వారితో పాటు వెనుక సీటులో కూర్చున్న వారు రక్షణ పొందుటకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రస్తుతం ప్రతి కుటుంబానికీ ద్విచక్రవాహనం తప్పనిసరి అయిందని వాహనాలు ఎక్కువై ట్రాఫిక్ సమస్య పెరిగిపోయిందని చెప్పారు. రోడ్లపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్లు వాడాలని సూచించారు. హెల్మెట్ వాడకపోతే మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం సైదుబాబు, వార్డు మెంబర్లు పిడుగు శ్రీనువాసులు, షేక్ నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులు


నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, జూలై 12 : టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు ప్రజలకు అందించేందుకు విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయటం సంతోషకరమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చెప్పారు. దర్శి పట్టణంలోని గడియారస్తంభం సెంటర్‌లో, రామాలయం వద్ద, శివరాజ్‌నగర్‌లో నిత్యావసర వస్తువుల పంపిణీ కేంద్రాలను శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగటంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. తక్కువ ధరలకు ఇక్కడ సరుకులు అందిస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై మహేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, కౌన్సిలర్లు వీసీ రెడ్డి, కనకం శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరామయ్య, నాయకులు బొట్ల కోటేశ్వరరావు, శోభారాణి, బేళ్ళ శ్రీనివాసరావు, మౌలాలి పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి ఆవరణ అంతా కంపు


పోస్టుమార్టం గది పక్కన అపరిశుభ్రం


పైపు లీకేజీతో పట్టిన పాచి

కనిగిరి, జూలై 12 : స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణ అంతా కంపుకొడుతోంది. పరిశుభ్రత లోపభూయిష్టంగా మారింది. ఆసుపత్రి ఆవరణలోని నీటి పారుదల ప్రాంతాల్లో నీరు నిలిచి పోయి పాచిపట్టి దుర్వాసన వస్తోంది. పేషెంట్లు, వారి తరపు సంబంధీకులు సేద తీరే ఆవాసాల వద్ద పైపుల నుంచి నీరు లీక్ అవుతూ వృథాగా పోతోంది. ఆ వృథా నీరు సరిగా డ్రైనేజీల్లోకి వెళ్లే మార్గంలో చెత్త పేరుకుపోయి ఉంది. దీంతో ఆ ప్రాంతమంతా రొచ్చు, దుర్గంధంతో నిండిపోయింది. మరో పక్క మున్సిపాలిటీ వాటర్‌ను సరఫరా చేసే పోస్టుమార్టం గది వెంబడి ఉన్న మోటర్ వద్ద నీరంతా వృథాగా పోయి పాచి పట్టింది. మోటర్ వద్ద, సంపులోకి వెళ్లే పైపు వద్ద వాడిపడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, చెత్త పేరుకుపోయింది. దీంతో ఆస్పత్రి ఆవరణ అంతా దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వాసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రతతో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వాల కృషి




పెద్దన్నపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్వైజర్ జరీనా

పీసీపల్లి, జూలై 12 : మహిళా సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు షేక్ జరీనా చెప్పారు. మండలంలోని పెద్దన్నపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. అనంతరం కేంద్రంలోని లబ్ధిదారులు, గ్రామంలోని మహిళలతో కలిసి మహిళా సాధికారతపై ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అబ్బూరి మల్లేశ్వరి, సహాయకురాలు మమత, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు..

వాటర్ క్యాన్లను బహూకరించిన టీడీపీ వార్డు సభ్యుడు

దొనకొండ, జూలై 12 : స్థానిక గౌతమి డిగ్రీ కాలేజీకి, ప్రజల సౌకర్యార్థం ప్రధాన సెంటర్‌లోని మంగలిషాపులకు దొనకొండ పంచాయతీ 10వ వార్డు సభ్యుడు, టీడీపీ నాయకుడు బొందల రాజు కూలింగ్ వాటర్‌క్యాన్లను శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా రాజును కాలేజీ ప్రిన్సిపల్ గోపి, అధ్యాపక సిబ్బంది, ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ నాయకుడు ప్రభాకర్ ఉన్నారు.



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
3 శనివారం 13 జూలై 2024



పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం.. రూ.కోట్లు కూడబెడుతోంది. కార్డుదారులకు చేరాల్సిన బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. నాణ్యత సరిగా ఉండదని కొందరు.. తినలేక మరికొందరు.. రేషన్ బియ్యాన్ని తీసుకో కుండా కార్డుదారులు ఎండీయూ ఆపరేటర్లు ఇచ్చే నగదు తీసుకుంటున్నారు. ఇదే అవకాశంగా ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు, దళారులు ఇలా రేషన్ మాఫియా బియ్యాన్ని బొక్కేస్తోంది. రేషన్ బియ్యం రీసైక్లింగ్‌తో మళ్లీ మిల్లర్లు ప్రభుత్వానికి అంటగడుతుండగా మరికొందరు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మరికొందరైతే విదేశాలకు కూడా తరలిస్తూ పెద్దమొత్తంలో సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. వీఆర్వో స్థాయి నుంచి జేసీ వరకు పర్యవేక్షణ లేకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియా రోజురోజుకు రెచ్చిపోతోంది. పెట్టుబడి లేకుండా రూ.కోట్లు వస్తుంది. దీంతో అధికారులను, రాజకీయ నాయకులను రేషన్ మాఫియా డబ్బుతో కొట్టి తమ జోలికి రాకుండా చేసుకుంటోందన్న విమర్శలున్నాయి. మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ బియ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో అక్రమాలు కోకొల్లలుగా వెలుగు చూస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూడా పెద్దఎత్తున బియ్యం దందా సాగుతోందనేది బహిరంగ రహస్యం. కూటమి ప్రభుత్వంలో ఈ దందాకు చెక్ పడుతుందా లేదా అని పలువురు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి రేషన్ బియ్యం దందా ఓ ఛాలెంజ్‌గా మారింది.

రేషన్ బియ్యంతో.. రూ.కోట్లు



కిలో రూ.9కి కొని.. రూ.30కి విక్రయం

- రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికే సరఫరా
- మంత్రి నాదెండ్ల తనిఖీల్లో అక్రమాలు బహిర్గతం
- ప్రభుత్వం రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేసేనా ?

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బియ్యం కిలో రూ.9. మార్కెట్‌లో ఈ రేటుకు బియ్యం ఎక్కడ లభిస్తుందని ఆశ్చర్యం వేస్తోందా. మార్కెట్‌లో కాదు ఇది తెల్ల కార్డుదారుడు బియ్యం విక్రయించే ధర. ఒక్కొక్క దళారీ చేతులు మారి తిరిగి ప్రభుత్వం వద్దకే రేషన్ బియ్యం చేరుతోంది. పెద్దఎత్తున రేషన్ బియ్యం రీ సైక్లింగ్ జరుగుతోంది. బ్లాక్ మార్కెట్‌కు భారీగా బియ్యం నిల్వలు తరలిపోతున్నాయి. బియ్యం బ్లాక్ మార్కెట్ పార్టీలతో సంబంధం లేకుండా జరుగుతుంది. రాష్ట్ర సరిహద్దులను దాటించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కార్డుదారులకు సరఫరా చేస్తున్న బియ్యంతో సగానికి పైగా నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయనేది బహిరంగ రహస్యం. రీ సైక్లింగ్ రూపంలో ప్రభుత్వానికే రూ.30కి బియ్యం కొందరు మిల్లర్లు సరఫరా చేస్తున్నారు. రేషన్ సరఫరా చేస్తున్న వాహన దారులు కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తు న్నారు. వేలి ముద్ర తీసుకుని కిలోకి రూ.9 నుంచి రూ.10 వరకు కార్డుదారులకు ఇస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని కిలో రూ.13 నుంచి రూ.14కు దళారీ లకు విక్రయిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని మిల్లుల్లో నిల్వ చేసి ఒక పట్టు పాలిష్ వేసి బ్లాక్ మార్కెట్‌లో కిలో రూ.23 నుంచి రూ.24కు విక్రయిస్తారు. పెద్దఎత్తున కాకినాడ పోర్టుకు, కొంత మేర తెలంగాణలోని హాలియా ప్రాంతానికి ఎగుమతి చేస్తున్నారు. పోర్టు నుంచి ఇతర దేశాలకు బియ్యం తరలి పోతున్న విషయాన్ని స్వయంగా మంత్రి నాదెండ్ల మనోహర్ తన తనిఖీల ద్వారా నిగ్గు తేల్చిన విషయం తెలిసిందే. హాలియా ప్రాంతానికి తరలిపోతున్న బియ్యానికి పాలిష్ పట్టించి తెలంగాణ ప్రాంతంలో మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు.

మంత్రి జిల్లా అయినా తగ్గేదేలేదు

వైసీపీ ప్రభుత్వం పడిపోయి కూటమి అధికారంలోకి వచ్చినా గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియాకి ఏమాత్రం అడ్డుకట్ట పడటం లేదు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారన్న భయం కూడా మాఫియాలో ఇసుమంతైనా కనిపించడం లేదు. అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా తమకు అడ్డే లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నది. గత 12 రోజులుగా జిల్లాలో ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) ఆపరేటర్ల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ జరుగుతోన్నది. అయితే గతంలో వలే కేజీకి రూ.15 చొప్పున లెక్కించి కార్డుదారులకు నగదు ఇచ్చి ఆ బియ్యాన్ని దారి మళ్లించి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కాకినాడ వద్ద బియ్యం తరలిపోకుండా కఠినమైన చర్యలను మంత్రి నాదెండ్ల మనోహర్ చేపట్టడంతో ఇప్పుడు రూటుమార్చి కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కలెక్టర్‌గా బూర్ల రామాంజనేయులు(ప్రస్తుత ప్రత్తిపాడు ఎమ్మెల్యే) ఉన్న సమయంలో పదేపదే బియ్యాన్ని నల్లబజారుకు తరలించిన వారిపై ఉక్కుపాదం మోపారు. అప్పట్లో పీడీ యాక్టు కేసులు నమోదు చేసి జిల్లా నుంచి బహిష్కరించారు. ఇప్పుడు కూడా అలాంటి కఠినమైన చర్యలు చేపట్టకపోతే రేషన్ మాఫియాకి ముకుతాడు పడటం కష్టమన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

దుకాణాలను చెరపట్టి..

వైసీపీ హయాంలో గుంటూరు పరిధిలో టీడీపీకి చెందిన కొంతమంది డీలర్లపై వేటు వేశారు. తొలుత పార్టీ మారమని ఒత్తిడి చేశారు. వారిలో కొందరు మారకపోవడంతో పౌరసరఫరాల అధికారుల ద్వారా దాడులు చేయించి స్టాకులో వ్యత్యాసం ఉందని చెప్పి వారిని సస్పెన్షన్ చేశారు. ఇలా నగరంలో 15 మంది డీలర్లను సస్పెన్షన్ చేసి ప్రత్యామ్నాయంగా పొదుపు సంఘాల మహిళలకు నిర్వహణ బాధ్యతలు కేటాయించారు. అయితే ఇది కేవలం కాగితాల్లో మాత్రమే. క్షేత్రస్థాయిలో ఆయా షాపులన్నీ మాఫియా చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఆయా సంఘాలకు నెలకు రూ.5 వేలు చెల్లిస్తూ షాపులను చెరబట్టిన మాఫియా ఎండీయూలను వారి దారిలోకి తెచ్చుకుంది. కార్డుదారుల నుంచి బియ్యం సేకరించి తెచ్చినందుకు ఎండీయూకు కేజీకి రూ.3 ఇస్తున్నారు. డీలర్లు మరో రూ.5 కమీషన్ చేర్చి కేజీ రూ.23కు మిల్లర్లకు అమ్ముతున్నారు.

రబ్బర్ వేలిముద్రలతో..?

రేషన్ మాఫియా తన కబంధ హస్తాల్లోకి తీసుకున్న దుకాణాల్లో ఎండీయూలకు బియ్యం సరఫరా చేసేందుకు నిత్యం ఈ-పోస్‌లో వేలి ముద్ర వేయాలి. డ్వాక్రా మహిళల పేరుతో ఉన్న షాపులకు సంబంధించి రబ్బర్ వేలి ముద్రలను మాఫియా తయారు చేయించిందన్న ఆరోపణలున్నాయి. నిత్యం షాపుల వద్దకు వారొచ్చి వేలిముద్రలు వేయాల్సిన అవసరం ఉండదు. గుంటూరులో రేషన్ మాఫియా కు నేతృత్వం వహిస్తున్న వ్యక్తికి చెందిన కుటుంబ సభ్యులకు కూడా షాపులున్నాయి. అవసరమైతే నెలకు రూ.15 లక్షలు ఇచ్చి అయినా తమ జోలికి ఎవరూ రాకుండా చేసుకొంటామన్న ధీమాని వ్యక్తపరుస్తున్నారు. పోలీసు, విజిలెన్స్, పౌరసరఫరాల శాఖలు తూతూ మంత్రంగా నమోదు చేస్తున్న కేసుల వల్ల రేషన్ మాఫి యాకి ఎలాంటి భయం అనేది లేకుండా పోయింది.

నియోజకవర్గాల వారీగా దళారీలు..

నియోజకవర్గాల వారీగా బియ్యం బ్లాక్ మార్కెట్ వ్యాపారాన్ని దళారీలు పంచుకున్నారనేది అందరికీ తెలిసిన విషయమే. వీరు మిల్లులను లీజుకు తీసుకుని వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. రాత్రి వేళ డీలర్ల నుంచి బియ్యం నిల్వలను ఎంపిక చేసుకున్న మిల్లులకు తరలిస్తారు. గోతాలు మార్చి 25 కిలోలు, 50 కిలోల ప్యాకింగ్ చేస్తారు. ఈ ప్రక్రియ అంతా రాత్రి వేళల్లో నిర్వహిస్తారు.

ఒక్కో నియోజక వర్గంలో ఒక్కొక్క రేటు బ్లాక్ మార్కెట్‌కు నిర్ణయించినట్లు సమాచారం. ఒక నియోజకవర్గంలో బియ్యం బ్లాక్ మార్కెట్ చేసే వ్యక్తుల నుంచి నెలకు రూ.28 లక్షలు చెల్లించే విధంగా ఓ నేతతో ఒప్పందం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరో నియోజక వర్గంలో రూ.20 లక్షలు చెల్లించేలా దళారీలు మరో నేతతో బేరం కుదుర్చుకున్నట్లు సమాచారం. సంబంధిత శాఖల్లో కొందరు అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వం అధికారంలో ఉండగా బియ్యం బ్లాక్ మార్కెట్ చేసిన వ్యక్తులే ఇప్పుడు కూడా కొనసాగిస్తున్నారని తెలిసింది.

నెలవారీ మామూళ్లు ఫిక్స్

వైసీపీ హయాంలో పాలకుల అండతో జిల్లాలో రేషన్ మాఫియా రెచ్చిపోయింది. గతంలో అక్కడికక్కడ స్వల్పంగా రేషన్ బియ్యం పక్కదారి పట్టేవి. అలాంటిది గడచిన ఐదేళ్లలో ఆ దందాను వ్యవస్థీకృతం చేశారు. నెలవారీ మామూళ్లు ఫిక్స్ చేసి మరీ దందాను కొనసాగించారు. ఈ దందాలో ఏకంగా వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలే సూత్రధారులుగా ఉండడంతో అధికారులు సైతం చేష్టలుడిగి చూస్తుండిపోయారు. బాపట్ల జిల్లా పరిధిలో పర్చూరు, చీరాలలో ఈ దందా అయితే వైసీపీ ప్రభుత్వంలో ఆకాశమే హద్దుగాసాగింది. రెండేళ్లలో మొత్తం 123 6ఏ కేసులు నమోదైతే చీరాల, బాపట్ల పరిధిలోనే 90 వరకు కేసులు నమోదు కావడం గమనార్హం. గతంలో ముగ్గురి మీద పీడీయాక్టు ప్రతిపాదనలను సిద్ధం చేసినా అప్పటి వైసీపీ ప్రభుత్వ ఒత్తిళ్లతో అది కాగితాలకే పరిమితమైంది. పర్చూరు నియోజకవర్గం కారంచేడు మండలం స్వర్ణలో వైసీపీ ప్రజాప్రతినిధి రైస్‌మిల్లులోనే రేషన్ దందా ఇటీవల వరకు యథేచ్ఛగా నడిచేది. ఆ మిల్లుపై జరిగిన దాడుల్లో విడతల వారీగా 700, 150, 400 బస్తాలను అధికారులు స్వాధీనం చేసుకున్నా దందాకు వైసీపీ హయాంలో అడ్డుకట్టపడలేదు. చీరాలలో సైతం వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఈ దందా నడిచింది.



నరసరావుపేటలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం నిల్వలు (పాత చిత్రం)

బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట పడేనా ?

వైసీపీ హయాంలో బియ్యం బ్లాక్ మార్కెట్ చేయడంలో అక్రమార్కులు రెచ్చిపోయారు. అప్పట్లో కొన్ని చోట్ల టీడీపీ నేతలు బియ్యం అక్రమ నిల్వలను పట్టించిన విషయం తెలిసిందే. కూటమి అధికారంలోకి రావడంతో బియ్యం బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేస్తారా లేదా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వారే. ఆయనకు గతంలో బియ్యం బ్లాక్ మార్కెట్‌పై పోరాటాలు చేసిన అనుభవం ఉంది. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వేలాది క్వింటాళ్ల బియ్యం నిల్వలను కాకినాడ పోర్టులో సీజ్ చేయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెలలో బియ్యం నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు తరలి పోకుండా మంత్రి చర్యలు తీసుకుంటారన్న వాదన వినిపిస్తోంది. కార్డు దారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యం నిల్వలు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల వద్దే ఉన్నాయి. డీలర్ల వారీగా వారి వద్ద బియ్యం నిల్వలను తనిఖీ చేస్తే కొంత మేర బియ్యం బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుందని చెప్పవచ్చు. ఈ ప్రక్రియపై దృష్టి సారిస్తారో లేదో చూడాలి.

ప్రతి నెలా 1,18,325 టన్నులు బ్లాక్ మార్కెట్‌కు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి ప్రతి నెల 1,18,325 టన్నుల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్లు సమాచారం. పల్నాడు జిల్లాలో 6,45,110 కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 89,239 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నా రు. బాపట్ల జిల్లాలో 4,84,029 కార్డులకు 63,446 టన్నులు, గుంటూరు జిల్లాలో 5,99,511 కార్డులకు 83,965 టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. బియ్యం సరఫరాపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. వీఆర్వో స్థాయి నుంచి జాయింట్ కలెక్టర్ వరకు బియ్యం సరఫరాను పర్యవేక్షించాల్సి ఉంది. రేషన్ షాపులను విధిగా తనిఖీ చేయాలని నిబంధనను కొందరు అధికారులు పాటించడంలేదు. దీంతో బియ్యం అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

నిజాంపట్నం మండల పరిధిలో ప్రభుత్వ భూముల్లో రొయ్యల సాగు



ఆక్రమణలపై ఆరా

- ప్రభుత్వ భూముల్లో రొయ్యల సాగు
- 4,000 ఎకరాలను చెరబట్టిన వైసీపీ నేతలు
- సమీక్షలో తెరపైకి ఏడబ్ల్యూడీ భూముల వ్యవహారం
- నివేదిక కోరిన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్
- జాబితాపై మత్స్యశాఖ కసరత్తు.. రేపోమాపో అందజేత

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు చెరపట్టారు.. అనుమతులు లేకుండా రొయ్యల సాగు చేపట్టారు.. నోటీసులు జారీ చేసినా అధికార పార్టీ అండతో పట్టించుకునే వారే లేరు.. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి రావడం బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో ఏడబ్ల్యూడీ భూముల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఎన్‌జీటీ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ విచ్చలవిడిగా రొయ్యలసాగు జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 9,000 ఎకరాల ప్రభుత్వ భూముల్లో రొయ్యలసాగు అవుతుండగా ఇందులో 4,000 ఎకరాల వరకు గడచిన ఐదేళ్లలో వైసీపీ నేతాగణం అనుచరులు చెరబట్టినవే. ఒక్కొక్కరు 25 నుంచి 30 ఎకరాల వరకు రొయ్యల సాగు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అనుమతులు లేకుండా సాగు చేస్తున్న రొయ్యల చెరువులకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం లేని వాటిపై చర్యలు తీసుకోవాలని గతేడాది ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. నోటీసులకు స్పందించకపోతే రొయ్యల చెరువులను ధ్వంసం చేయాలని కూడా ఆదేశించింది. కానీ ప్రభుత్వ భూముల్లో రొయ్యల సాగు చేస్తున్న వా రిలో ఎక్కువ శాతం మంది వైసీపీ నేతల అనుచరులే కావడంతో అధికారులు నోటీసుల జారీతో సరిపెట్టారు తప్పితే ఎన్‌జీటీ ఆదేశాలను అమలు చేయలేదు. ఎకరం, రెండెకరాల ప్రభుత్వ భూమిలో రొయ్యల సాగు చేసుకుంటున్న పేద రైతులు దాదాపు 5,000 మంది వరకు ఉన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు అప్పటి వరకు సాగు చేసుకుంటున్న రైతులను అడ్డుకుని ఆ భూముల్లో సాగు చేపట్టారు. నిన్నమొన్నటి వరకు జిల్లా వ్యవసాయ సలహా మండలిలో సభ్యుడిగా ఉన్న బాపట్లకు చెందిన ఓ వైసీపీ నేత వందల ఎకరాల ప్రభుత్వ భూములను చెరబట్టి రొయ్యల సాగు చేపట్టారని సమాచారం. విచిత్రమేమిటంటే ఇదే వ్యక్తి పర్యావరణ కాలుష్యం గురించి సమావేశాల్లో ఉపన్యాసాలు ఇవ్వడం విశేషం.

తాత్కాలిక లైసెన్సులు ఇచ్చే అవకాశం...

ముందుగా ఆ భూముల్లో పాగా వేసిన వారి వివరాలు బయటకు వచ్చిన తర్వాత అర్హులైన పేదలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయనున్నది. అర్హులైన వారికి ప్రభుత్వ భూముల్లో రొయ్యల సాగు చేసుకునే అవకాశం కల్పిస్తూ ఎన్‌జీటీ నిబంధనలు అమలయ్యేలా చూడాలనే కృతనిశ్చయంతో కొత్త ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఇదే అభిప్రాయాన్ని రెవెన్యూమంత్రి అనగాని సైతం జిల్లా సమీక్షలో వెలిబుచ్చారు. ఉత్పత్తులు మంచిరేటుకు అమ్ముకోవాలంటే రొయ్యల సాగు చేసే పొలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ లైసెన్సులు ఇవ్వాల్సి ఉంది. ఇతర దేశాలకు ఎగుమతి చేసేటప్పుడు సైతం ఈ లైసెన్సు అనేది కీలకం. దీంతో మొత్తం వివరాలు వచ్చాక అర్హులైన వారికి తాత్కాలిక లైసెన్సులను కాలపరిమితితో ఇచ్చే అవకాశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇదే సమయంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను భోజ్యం చేసిన వైసీపీ నేతలపై కొరఢావిధించాలనే డిమాండ్లు ఉన్నాయి.

సోమవారం నాటికి నివేదిక

బుధవారం కలెక్టరేట్ వేదికగా జరిగిన సమీక్షలో ప్రధానంగా ఈ అన్‌రిజిష్టర్డ్ రొయ్యల సాగు అంశంపై చర్చ నడిచింది. దీంతో పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని మంత్రి అనగాని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన కసరత్తును మత్స్యశాఖ చేస్తోంది. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి రొయ్యలసాగు చేసింది ఎవరు అనే కోణంతో పాటు, ఉన్న సాగుదారులను బలవంతంగా బయటకు పంపించి చెరబట్టింది ఎంత అనే కోణంలో కూడా వివరాలు రాబడుతున్నారు. మరోవైపు ఎన్‌జీటీ ఆదేశానుసారం నోటీసులు అందుకున్న వారిలో స్పందించిన వారెంతమంది, వాటిని ఖాతరు చేయకుండా వ్యవహరించినవారు ఎంతమంది అనే అంశాలపై కూడా అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం నివేదికను మండలాల వారీగా సేకరిస్తున్నారు.

అభివృద్ధికి.. అనువైన సమయం

- భవనాసి చెరువులో అడుగంటిన నీరు
- పూడిక తీసి.. పర్యాటకంగా తీర్చిదిద్దాలని వినతులు



భవనాసి చెరువులో పూర్తిగా అడుగంటిన నీరు

అద్దంకి, జూలై 12: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కంభం చెరువు తరువాత పెద్ద చెరువులలో భవనాసి చెరువు ఒకటి. 106 సంవత్సరాల నాటి చెరువు కావడంతో పూడిక బాగా పేరుకు పోయింది. సుమారు 10 అడుగుల మేర పూడిక ఉన్నట్లు అంచనా. చెరువులో పూర్తిస్థాయిలో నీరు అడుగంటడం చాలా అరుదు. గత ఏడాది సాగర్ ఆయకట్టుకు సాగు నీరు విడుదల కాకపోవడంతో నీటి నిల్వ తక్కువగా ఉండి ప్రస్తుతం అతి తక్కువ నీరు మాత్రమే చెరువులో ఉంది. గతంలో కరువు పరిస్థితులు నెల కొన్న సమయంలో మినహా ఎప్పుడూ ఇలా నీరు తక్కువగా ఉన్న పరిస్థితులు లేవు. శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాన్ని ఆనుకుని ఉన్న భవనాసి చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. సుమారు దశాబ్ద కాలంగా భవనాసి చెరువును కేంద్ర ప్రభుత్వ నిధులతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. భవనాసి చెరు వు మధ్యలో ఐలాండ్‌ను ఏర్పాటు చేసి బుద్ధుడు.. లేదా ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పార్క్‌గా అభివృద్ధి చేయడంతో పాటు బోటింగ్ సౌకర్యం కల్పిస్తే పర్యాటకంగా విశేష ఆదరణ పొందుతుంది. అయితే ఆ ప్రతిపాదనలు ఇంతవరకు కార్యరూపందాల్చలేదు. ప్రస్తుతం నీటి నిల్వ బాగా తక్కువగా ఉన్నందున పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఇది మంచి సమయం అని పలువురు అభిప్రాయ పడుతున్నారు. భవనాసి చెరువు రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసే పనులు కూడా 15 సంవత్సరాలుగా సాగుతున్నాయి. ప్రస్తుతం గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ఉండడంతో అసంపూర్తిగా ఉన్న భవనాసి రిజర్వాయర్ పనులు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించి భవనాసి చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని అద్దంకి ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

భూసార పరీక్షల ఆధారంగానే ఎరువుల వినియోగం

రైతులకు జిల్లా వనరుల కేంద్రం డీడీ విజయనిర్మల సూచన



మాట్లాడుతున్న డీడీ విజయ నిర్మల

అద్దంకి టౌన్, జూలై 12: రైతులు తమ భూములలో సాగుచేసే పంటలకు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగానే ఎరువులు వినియోగించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల సూచించారు. శుక్రవారం మండలంలోని కలవకూరు రైతుసేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎక్కువ శాతం భూములలో కర్బన శాతం త క్కువగా ఉందన్నారు. ఆ భూములలో కర్బన శాతం పెరగడానికి పచ్చిరొట్టి పైర్లను సాగుచేసి పూత దశలో భూమిలో కలియదున్నాలని చెప్పారు. డాట్ సెంటర్ కోఆర్డినేటర్ బాల మురళీధర్ నాయక్ మాట్లాడుతూ మొక్కజొన్న, వరి పంటలలో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలను గురించి వివరించారు. మరోశాస్త్రవేత రాధాకృష్ణ పసుపు, మిరప పంటల సాగులో యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. ఏడీఏ రత్నాకుమారి మాట్లాడుతు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఏడీఏ కె.ధన్‌రాజ్ మాట్లాడుతూ కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలు తగ్గించాలి

కొత్తపేట(చీరాల), జూలై 12: చీరాల డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు అంతరాయాలు తగ్గించి మెరుగైన సేవలు అందించాలని ఈఈ జాన్‌థామస్ అన్నారు. శుక్రవారం చీరాల డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక కారణాలతో అంతరాయం ఏర్పడితే ఆయా ప్రాంతాల సిబ్బంది యుద్ధప్రాతిపదికన స్పందించాలన్నారు. కార్యక్రమంలో చీరాల, వేటపాలెం, పర్చూరు డీఈఈలు టి.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసులు, ఎన్.రమేష్‌బాబు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

చీరాలటౌన్, జూలై 12: అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు మృతిపై చీరాల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ప్రసాద్ థియేటర్ సెంటర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రాజన్న(69)కు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారికి వివాహాలు జరిగి వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. భార్యతో స్థానికంగా ఉంటున్నాడు. గురువారం రాత్రి ప్రసాద్ థియేటర్ సెంటర్‌లో కుప్పకూలి మృతిచెందాడు. ఆయన కుమారుడు సుధీర్ ఇచ్చిన వివరాల మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఇన్‌చార్జ్ డీఎస్పీగా జగదీష్‌నాయక్ బాధ్యతల స్వీకరణ

చీరాలటౌన్, జూలై 12: చీరాల ఇన్‌చార్జ్ డీఎస్పీగా జగదీష్ నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లా సీసీఎస్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బదిలీల నిలిపివేతపై హైకోర్టుకు టీచర్లు

ఒంగోలు(విద్య), జూలై 12 : గత ప్రభుత్వం జారీచేసిన ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులను నిలిపివేస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను పక్కనబెట్టాలని కోరుతూ పలువురు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది మార్చిలో పలువురు టీచర్లు, హెచ్ఎంలకు బదిలీ చేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకు బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయవద్దని అప్పటి ప్రభుత్వం డీఈఓలను ఆదేశించింది. బదిలీల్లో అనేక అక్రమాలు జరిగాయని, కోట్లాది రూపాయలు చేతులు మారయని ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించడంతో పాఠశాల విద్యా కమిషనర్ ఆ టీచర్ల బదిలీ ఉత్తర్వుల అమలును నిలిపివేయమని ఆదేశించారు. దీంతో ఆయా టీచర్లు హతాశులయ్యారు. ఈ నేపథ్యంలో సుమారు వందమంది టీచర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై కౌంటర్ దాఖలు చేసేందుకు జీపీ సమయం కోరగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి ఈనెల 18వతేదీకి వాయిదా వేశారు.

ఆయకట్టు చివరి వరకూ నీరందించాలి

గుండ్లకమ్మ ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్ అన్సారియా



ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మద్దిపాడు, జూలై 12: గుండ్లకమ్మ ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూములకు సైతం సాగునీరు అందేలా పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె గుండ్లకమ్మ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్షణం గేట్ల మరమ్మతులు చేపట్టి ఈ ఏడాది చివరికి నీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టుకు సాగర్ నీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని, ఒంగోలు నగరానికి తాగునీరు అందించటమే ప్రాజెక్టు లక్ష్యమన్నారు. ప్రాజెక్టు పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. రిజర్వాయర్ ద్వారా 5 మండలాల ప్రజలకు తాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా 80వేల ఎకరాలకు సాగునీరు అందేవిధంగా పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టు కింద వివాదాలను తక్షణం పరిష్కరించాని సూచించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు 12 గేట్ల వివరాలను సైట్ ఇంజనీర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు కింద నీటి సరఫరా, భూసేకరణ తదితర అంశాలను ఇరిగేషన్ ఎస్ఈ నాగమురళీమోహన్ కలెక్టర్‌కు వివరించారు. కుడికాలువ కింద 28వేల ఎకరాలకు నీరందేలా పూడికలు తీసి పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసినట్లు తెలిపారు. ఎడమ కాలువ కింద భూసేకరణలో సమస్యలు తలెత్తడంతో వర్క్ ఆర్డర్‌ను ప్రభుత్వం రద్దుచేసిందని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సుబ్బారెడ్డి, తహసీల్దార్ అనురాధ, ఇరిగేషన్ డీఈ కే.నాగరాజు, ఏఈ రామాంజనేయులు, డీటీ ఆశాజ్యోతి, వీఆర్వోలు అంకమ్మరావు ఉన్నారు.

గొప్పోరు సారూ..!

అడిగిన వెంటనే దివ్యాంగురాలికి వీల్‌చైర్

జేసీ గోపాలకృష్ణ స్పందన


వీల్‌చైర్ అందిస్తున్న జేసీ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 12: బేస్తవారపేట మండలం సలకలవీడు గ్రామశివారులోని కొత్తపల్లి గ్రామానికి చెందిన చింతా నాగమణి అనే బాలికకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ వీల్‌చైర్‌ను అందజేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం దివ్యాంగురాలు నాగమణి వీల్‌చైర్ లేక పడుతున్న ఇబ్బందులను బాలిక అమ్మమ్మ చింత సారమ్మ జేసీ గోపాలకృష్ణ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చనను వీల్‌చైర్ సమకూర్చాలని ఆదేశించారు. సంబంధిత సిబ్బంది వీల్‌చైర్‌ను కలెక్టరేట్ ప్రాంగణానికి తీసుకొని రాగా బాలికకు అప్పటికప్పుడే అందజేశారు. అలాగే జేసీ గోపాల్‌కృష్ణ స్వయంగా నాగమణిని అందులో కూర్చోబెట్టి తానే నెట్టడం చూసి అక్కడున్న వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో నాగమణితో పాటు ఆమె అమ్మమ్మ ఆనందానికి అవధుల్లేవు. తమ సమస్యను ఆగమేఘాలపై పరిష్కరించిన జేసీకి గొప్పోరు సారూ అంటూ పలుమార్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు అర్చన పాల్గొన్నారు.

అక్రమాలకు అడ్డాగా ఏకేయూ

అనుమతులు లేకుండా 40మంది ఉద్యోగుల నియామకం

వీసీ, రిజిస్ట్రార్‌లదే చేతివాటం

ఆంధ్రకేసరి యూనివర్సిటీపై ఆర్థిక భారం

మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు

నీతి నిజాయితీలకు మారుపేరుగా నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో ఒంగోలులో ఆవిర్భవించిన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అక్రమాలకు అడ్డాగా నిలిచింది. ప్రభుత్వం నుంచి గాని యూనివర్సిటీ పాలక మండలి నుంచి ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండానే 40మందికిపైగా ఉద్యోగులు అడ్డగోలుగా నియమించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి అవసరం లేకున్నా అంతమందిని నియమించి యూనివర్సిటీపై ఆర్థిక భారాన్ని మోపారు. ఈ నియామకాల్లో కోటికిపైగా నిధులు చేతులు మారాయన్న విమర్శలు ఉన్నాయి. అక్రమంగా నియమితులైన వారిలో కొందరికి పనిలేకుండా కూర్చోబెట్టి జీతాలు ఇస్తున్నారు. అప్పుడప్పుడు చుట్టపుచూపుగా వచ్చి పోతుంటారు. సంతకాల శ్రమకు వేతనాలు చెల్లిస్తున్న వైనంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్‌కు కూడా కొందరు విద్యార్థి సంఘ నేతలు ఫిర్యాదు చేశారు.

ఒంగోలు(విద్య), జూలై 12 : ఆంధ్రకేసరి యూనివర్సిటీ (ఏకేయూ) అక్రమాలు, అవకతవకలుగా కేంద్రంగా మారింది. వైస్ చాన్సలర్ ఎం.అంజిరెడ్డి, రిజిస్ట్రార్ బి.హరిబాబులు గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రజాప్రతినిధుల అడుగులకు మడుగులొత్తుతూ మొత్తం వర్సిటీ పాలనను గాడితప్పించారన్న ప్రచారం నడిచింది. కొందరు ఉద్యోగులను కావాలనే లక్ష్యంగా చేసుకుని వేధింపులు కొనసాగించారని, అక్రమంగా 40 మందికిపైగా కాంట్రాక్టు ఉద్యోగులను నియమించారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఈ నియామకాలు జరిగాయి. యూనివర్సిటీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగుల నియామకాలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తూ 2020 ఆగస్టు 20న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముందుగా ప్రభుత్వ అనుమతి లేదా యూనివర్సిటీ పాలకమండలి ఆమోదం లేకుండా ఎటువంటి నియామకాలు చేపట్టవద్దని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

భారీగా వసూళ్లు

అయితే ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేసి ఏకేయూ వీసీ, రిజిస్ట్రార్‌లు పలు నియామకాలు చేపట్టారు. ఫలితంగా యూనివర్సిటీపై ఆర్థిక భారం పడి కుదేలైపోయింది. ఏఎన్‌యూ పీజీ సెంటర్‌ను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేసిన తర్వాత బోధన, బోధనేతర సిబ్బందిని నియమించారు. అయినా సరే తర్వాత వచ్చిన వీసీ, రిజిస్ట్రార్లు అవసరం లేకపోయినా భారీమొత్తాల్లో డబ్బులు వసూలు చేసి అక్రమ నియామకాలకు తెరతీశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు ఉన్న సమయంలో ఉద్యోగుల బదిలీలు, నియామకాలు చేపట్టరాదు. అయితే ఏకేయూలో ఎన్నికల కోడ్ అమలు ఉన్న సమయంలో కూడా కొందరికి ఉద్యోగాలు ఇచ్చారు. విశ్వవిద్యాలయం నిర్వహణకు అవసరమైన 50మంది సిబ్బంది అందుబాటులో ఉన్నా కాసులకు కక్కుర్తిపడి ఈ అక్రమ నియమకాలకు తెగబడ్డారు. ఆయా అభ్యర్థులలో ఎక్కువ శాతం మంది గత వైసీపీ ప్రభుత్వ సానుభూతిపరులు కావడం గమనార్హం. వారి వద్ద భారీమొత్తంలో మామూళ్లు కూడా వసూలు చేసినట్లు తెలుస్తోంది.

సీనియర్ ఉద్యోగులకు నష్టం

యూనివర్సిటీలో అక్రమంగా నియమితులైన వారితో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్ ఉద్యోగులకు నష్టం వాటిల్లింది. స్కిల్డ్, అన్ స్కిల్డ్ పేరుతో కొత్తగా నియమితులైన వారికి పాత ఉద్యోగుల కంటే అధికంగా జీతం చెల్లిస్తున్నారు. ఆ విధంగా సీనియర్ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీశారు. రిటైర్డ్ ఉద్యోగులను రిక్రూట్ చేసుకోవద్దని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రిటైర్డ్ ఉద్యోగిని ఇక్కడకు తెచ్చి రూ.35,050 జీతంతో నియమించారు. యూనివర్సిటీలో అక్రమంగా నియమితులైన వారిలో ఒకరు తెనాలిలో ఎన్నికల ప్రచారంలో పవన్ కళ్యాణ్‌పై రాయి విసిరి జనసేనికుల చేతిలో తన్నులు తిన్నారు. అయినా సరే అతనిని కొనసాగించడం కొసమెరుపు. కొత్తగా నియమితులైన వారిలో కొందరిని సాధారణ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల తరఫున డబ్బు పంపిణీ చేసేందుకు కూడా వినియోగించుకున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

విచారణ జరిపితే..

యూనివర్సిటీలో ఆర్థిక అవకతవకలు, అక్రమ నియామకాలకు పాల్పడిన వీసీ అంజిరెడ్డి, రిజిస్ట్రార్ హరిబాబుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మానవవనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదులు అందాయి. అలాగే నిధుల వినియోగంలోనూ గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనుబంధ కళాశాలల నుంచి భారీగా మామూళ్లు వసూలు చేసినట్లు కూడా ప్రచారం ఉంది. ప్రభుత్వం వర్సిటీలో జరిగిన నియామకాలు, ఇతర వ్యవహారాలపై వెంటనే విచారణ జరిపితే భారీగా అవకతవకలు వెలుగుచూసే అవకాశం ఉంది. వెంటనే ఓ కమిటీని నియమించి విచారణ జరపాలని విదార్థి, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. కాగా ప్రస్తుతం వీసీ అంజిరెడ్డి తన పదవికి రాజీనామా చేయగా రిజిస్ట్రార్ హరిబాబు మాత్రం పదవిలో కొనసాగుతున్నారు.



ఆంధ్రకేసరి విద్యా కేంద్రం

భారీగా అక్రమ వసూలు

విశ్వవిద్యాలయంలో రకరకాల పేర్లతో భారీ మొత్తాలలో అక్రమ వసూళ్లకు వీసీ, రిజిస్ట్రార్లు పాల్పడ్డారు. బీఈడీ కళాశాలలకు అనుమతులు ఇచ్చే విషయంలో కూడా భారీగానే డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు బీఈడీ కళాశాలలో ప్రవేశం కల్పించి ఇక్కడ తరగతులు నిర్వహించకుండా నేరుగా వారు పరీక్షలకు హాజరయ్యే విధంగా అనుమతించినందుకు పెద్దమొత్తంలో ముడుపులు ముట్టాయి. యూనివర్సిటీ పరీక్షలలో రీవెల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారి జవాబుపత్రాలను ఇతర యూనివర్సిటీలకు పంపి మూల్యాకనం చేయించాల్సి ఉండగా ఇక్కడి అధ్యాపకులతోనే చేయించి వసూళ్లకు పాల్పడ్డారన్న విమర్శలు ఉన్నాయి. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుకు కూడా కళాశాలల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

బోల్డన్ని అక్రమాలు.. విచారణ చేయాలి

-రాయపాటి జగదీష్, విద్యార్థి జేఏసీ నేత

ఏకేయూలో ఉద్యోగ నియామకాలలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా 40మందికి దొడ్డిదారిన ఉద్యోగాలు ఇచ్చి యూనివర్సిటీని ఆర్థికంగా ముంచేశారు. వర్సిటీలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేసి అక్రమాలకు పాల్పడ్డ వీసీ, రిజిస్ట్రార్లను కఠినంగా శిక్షించాలి. ఉద్యోగాల నుంచి తొలగించాలి.

అదే దందా!

మరింత రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

ప్రభుత్వం మారినా తగ్గని అక్రమార్కులు


జిల్లావ్యాప్తంగా ఇతర ప్రాంతాలకు బియ్యం తరలింపు

వారంరోజుల్లో 700లకుపైగా బస్తాలు స్వాధీనం

కొత్తవారితో కలిసి పాతవారు వ్యాపారం

రైస్‌మిల్లుల్లో కూడా భాగస్వామ్యం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 12 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రేషన్ అక్రమార్కుల దందా ఆగడం లేదు. జిల్లావ్యాప్తంగా మాఫియా ఇతర ప్రాంతాలకు బియ్యాన్ని తరలించే పనిలో పడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసి అమ్ముకుని కోట్లు గడించారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మాఫియాపై కొరడా ఝుళిపిస్తారని అందరూ ఎదురుచూశారు. అయితే అందుకు భిన్నంగా రేషన్ దందా యథేచ్ఛగా నడుస్తోంది. ఇప్పటివరకు వైసీపీ నేతలు ప్రత్యక్షంగా ఈ వ్యాపారంలో అక్రమాలకు పాల్పడగా తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాత వారు తెరపైకి వచ్చారు. వైసీపీ ప్రభుత్వం కన్నా ముందు రేషన్ వ్యాపారంలో ఉన్న అక్రమార్కులు భాగస్వాములు అవుతున్నారు. గత వారంరోజుల వ్యవధిలో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 700 బస్తాలకుపైగా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



పాత డీలర్లకే రేషన్

జిల్లావ్యాప్తంగా 1,392 రేషన్ షాపుల పరిధిలో 6,70,571 తెల్లకార్డులు ఉన్నాయి. అందుకోసం ప్రభుత్వం ప్రతినెల ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున జిల్లావ్యాప్తంగా 9,558.348 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. అలా వచ్చిన వాటిని సుమారు 70శాతానికిపైగా నెలవారీ జిల్లా దాటి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కార్డుదారుల నుంచి డీలర్లు కిలో రూ.10కి కొనుగోలు చేస్తుండగా డీలర్ల వద్ద నుంచి అక్రమార్కులు కిలో బియ్యం రూ.16 నుంచి రూ.17కు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన అక్రమార్కులు కొంతమంది రైస్‌మిల్లులకు తరలిస్తుండగా మరికొంతమంది గోతాలు కూడా మార్చకుండా లారీల్లో కాకినాడ లేదా నెల్లూరుకు తరలిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా సరే ప్రస్తుతం పాతడీలర్లే(వైసీపీ సానుభూతిపరులే) కొనసాగుతున్నారు. ఆ డీలర్ల ముసుగులో కొంతమంది అక్రమ వ్యాపారంలో కూడా భాగస్వాములుగా ఉన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ ప్రభుత్వానికి ముందు రేషన్ వ్యాపారంలో ఆరితేరిన వ్యాపారులు ఇప్పుడు వెలుగులోకి వచ్చారు. ప్రస్తుతం రేషన్ వ్యాపారం చేస్తున్న వారితో చేతులు కలిపి అక్రమంగా తరలించేందుకు శ్రీకారం చుట్టారు.

కలిసి చేసుకుందాం రండి..

ఇలా జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం ఎక్కువ మంది వైసీపీ సానుభూతి పరులే ఎక్కువమంది ఉండగా వారిలో కొంతమంది ఇప్పుడు కూడా రేషన్ మాఫియాలో భాగస్వామ్యం కావడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఒక వ్యాపారి వైసీపీ సానుభూతిపరుల అండదండలతో రెచ్చిపోయి వ్యాపారం చేశాడు. ఇప్పుడు మరో కొత్త వ్యక్తి వద్ద ప్రత్యక్షమై తాను అందరి వాడినంటూ నడిపిస్తున్నాడు. మరోవైపు అక్రమ వ్యాపారం చేసేందుకు రైస్‌మిల్లులు కూడా అవసరం కావడంతో ప్రస్తుతం ఉన్న రైస్‌మిల్లుల్లో కొంతమంది కొత్తవారిని కలుపుకొనే ప్రక్రియ చేపట్టారు. రేషన్ బియ్యం ద్వారా నెలవారీ లక్షల్లో ఆదాయం వస్తుంటంతో దానిపైనే ప్రధాన దృష్టితో పనిచేసేందుకు కసరత్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం రేషన్ పంపిణీ జరుగుతుండటంతో కొత్తవారితో కలిసి పాత వ్యాపారులు కొనుగోలు దందా చేస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.,

తేలిన ఆక్రమణలు..

చర్యలకు మాత్రం మీనమేషాలు..

రూ.కోట్ల భూములు కబ్జాకు గురైనట్లు గుర్తింపు

అయినా పట్టించుకోని యంత్రాంగం

కఠిన చర్యలు లేకపోవడంతో రెచ్చిపోతున్న అక్రమార్కులు

మార్కాపురం, జూలై 12: పాలకుల అండదండలు, అధికారుల నిర్లక్ష్యం వెరసి రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు, పత్రికల్లో కథనాల ద్వారా ఆక్రమణలు వెలుగుచూస్తున్నా అధికార యంత్రాంగం మొదట్లో హడావుడి చేసి తర్వాత మిన్నకుండిపోతోంది. అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆక్రమణదారులకు అలుసుగా మారుతోంది. కొద్దిరోజులు తర్వాత మళ్లీ ఆక్రమణలకు తెరతీస్తున్నారు. ఆక్రమణదారులు విసిరే చిల్లర పైసలకు ఆశపడేవారు కొందరైతే పాలకులకు భయపడి చూసీచూడనట్లు పని చేసుకుపోయే వాళ్లు మరికొందరు ఉన్నారు. ఇలా రూ.వందల కోట్ల ప్రభుత్వ ఆస్తులు పరులపాలవుతున్నాయి. ఈ పరంపరకు శాశ్వత ముగింపు పలకాల్సిన యంత్రాంగం ఆ దిశగా అడుగులు వేయకపోవడంతోనే ప్రభుత్వ ఆస్తులకు శాపంగా మారింది. ముఖ్యంగా ప్రభుత్వ భూముల జోలికొచ్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తేనే ఆక్రమణలను నిలువరించగలిగేది. ఆక్రమణలు వెలుగుచూసిన తర్వాత హెచ్చరిక బోర్డులు పెట్టడం, నోటీసులు ఇవ్వడంలాంటి సున్నిత చర్యలకే పరిమితం కావడంతో వారు రెచ్చిపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపి కఠినంగా వ్యవహరించేందుకు స్థానిక అధికారులకు ఆదేశాలిస్తేనే ఈ తతంగాలకు ముగింపు పలికే అవకాశం ఉంది.


856 సర్వే నెంబర్‌లో కొలతలు వేస్తున్న రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు

- దశాబ్ధకాలంగా పోరాడుతున్నా ఆగని ఆక్రమణ

మార్కాపురం మండలం దరిమడుగు గ్రామంలో 856 సర్వే నెంబర్‌లో 3.01 ఎకరాల ఆర్‌అండ్‌బీ స్థలం ఉంది. అందులో జాతీయ రహదారి 565కి 2.50 ఎకరాలు పోను ఎస్సీ కాలనీ సమీపంలోని పొలాల్లోకి 0.50 ఎకరాల మేర విలువైన స్థలం ఉంది. దీనిపై కన్నేసిన ఓ మండలస్థాయి మాజీ ప్రజాప్రతినిధి ఆక్రమించుకునేందుకు పదేళ్లుగా పోరాడుతున్నాడు. సుమారు రూ.5 కోట్ల విలువైన ఆ స్థలంలో ఆరు నెలల క్రితమే ఓ నిర్మాణాన్ని కూడా ప్రారంభించాడు. గ్రామస్థులు ఎన్నిసార్లు ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో గత నెలలో 'ఆంధ్రజ్యోతి'లో ఈ ఆక్రమణపై కథనం ప్రచురితమైంది. వెంటనే ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు అక్కడ పరిశీలించి ఆక్రమణ జరిగినట్లు గుర్తించారు. అక్కడి నిర్మాణం ఆర్‌అండ్‌బీ స్థలంలోనిదే అని నిర్ధారించుకున్నారు. ప్రభుత్వ భూమిలో కట్టిన ఆ నిర్మాణాన్ని తొలగించేందుకు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. ఆక్రమణ గుర్తించాం, ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం కాబట్టి మా పనైపోయింది అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఆ స్థలానికి కంచెను ఏర్పాటు చేసుకోకపోబట్టే ఆక్రమణదారులకు వరంగా మారింది. రూ.కోట్ల విలువైన ఇలాంటి ప్రభుత్వ ఆస్తులపై ప్రత్యేక దృష్టిపెడితేనే ఆక్రమణలను నిలువరించే అవకాశం ఉంది.

ప్రభుత్వ శాఖలకు అప్పగించిన స్థలాన్ని కాజేస్తున్నారు.

మార్కాపురం పట్టణంలో 565 జాతీయ రహదారిని ఆనుకుని 1011/2 సర్వే నెంబర్‌లో 0.65 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో రెండు ప్రభుత్వ శాఖలకు కార్యాలయాలు నిర్మించుకొనేందుకు 10 సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారు. మిగిలిన ప్రభుత్వ భూమిపై పక్కన పట్టా భూమివున్న ఓ మున్సిపల్ కౌన్సిలర్ కన్నేశాడు. ఇంకేముంది రూ.కోట్ల విలువైన ఆ భూమిలో తొలుత దారి కోసమని కొంత చదును చేశాడు. క్రమంగా ఆ భూమిని ఆక్రమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడు. ఈ తతంగంపై గత నెలలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది దీంతో రెవెన్యూ అధికారులు అక్కడ బోర్డు పాతి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ఆ కౌన్సిలర్ తన భూమికి దారి మాటున మళ్లీ దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు రూ.కోట్ల విలువైన ఆ భూమికి చుట్టూ కంచె ఏర్పాటు చేసుకుంటే మినహా భవిష్యత్తులో ఆక్రమణలను నిలువరించడం అసాధ్యమే. ఆ దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పామూరు/కనిగిరి, జూలై 12 : జాతీయ రహదారి 565పై జరిగిన రోడ్డు ప్రమాదంలో కనిగిరి మండలానికి చెందిన నరసింహులు(35) సంఘటన స్థలంలోనే మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకొంది. ఎస్‌ఐ ఎం సైదుబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కనిగిరి మండలం జమ్ములమడక గ్రామానికి చెందిన రేగలగడ్డ చిననరసింహులు ద్విచక్ర వాహనంపై పామూరు మండలం భూమిరెడ్డిపల్లి, రావి గుంటపల్లి మధ్య రాత్రి సమయంలో వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న నరసింహులకు తలకు తీవ్రమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శిరీష, చిన్నారులైన ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వృత్తిరీత్యా నరసింహులు బేల్దారి మేస్త్రీ. వరంగల్ ప్రాంతంలో ముఠా కట్టుకుని కాంట్రాక్టుపై పనులు చేయిస్తుంటాడు. పనిలో నష్టాలు రావటంతో ఆరు నెలలుగా స్వగ్రామంలోనే ఉంటున్నాడు.


చిననరసింహులు(ఫైల్)

బీచ్‌లు పునఃప్రారంభం

వేటపాలెం(చీరాల), జూలై 12: తీరంలో గత నెలలో జరిగిన వరుస ప్రమాదాలతో బీచ్‌లను మూసివేశారు. పర్యాటకులకు అనుమతి నిషేధించారు. ఈక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పోలీస్ అధికారులు, తీరంలోని రిసార్ట్స్, హోటల్స్ నిర్వాహకులతో ఒకటి రెండు,మూడు పర్యాయాలు సమీక్ష చేశారు. అంతిమంగా పర్యాటకుల భద్రతే అందరి లక్ష్యం కావాలని కొండయ్య చెప్పారు. ఈనేపథ్యంలో తీరంలో భద్రతా చర్యలకు రిసార్ట్స్, హోటల్స్ నిర్వాహకులు సంయుక్తంగా ముందుకువచ్చారు. తీరంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. తీరం నుంచి నిర్దీత దూరం నుంచి లోతుకు వెళ్లకుండా ఎర్ర జెండాలు పాతారు. సెర్ఫ్ టవర్లు ఏర్పాటు చేశారు. నిర్దీత స్నానాల ప్రదేశాల్లో గత ఈతగాళ్లను ఏర్పాటుచేశారు. వారికి లైఫ్ జాకెట్లతో పాటు హ్యాండ్ మైక్‌లు అందజేశారు. ప్రమాద హెచ్చరికలు ఎప్పటికప్పుడు తెలిపే విధంగా అన్నిచర్యలు చేపట్టారు. ఈక్రమంలో గురువారం రాత్రి పోలీస్ అధికారులు, రిసార్ట్స్ నిర్వాహకుల మధ్య జరిగిన చర్చల అనంతరం నిర్దీత అంశాలను అమలుపరుస్తూ పర్యాటకులకు, రిసార్ట్స్, హోటల్స్ పునఃప్రాంభానికి అనుమతి ఇచ్చారు.

ఈసందర్భంగా ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ గతకొద్ది రోజులుగా సముద్రతీరంలో జరిగిన ప్రమాదాల కారణంగా అనుమతులు నిషేధించినట్టు చెప్పారు. ఆయా ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకుని శుక్రవారం నుంచి అనుమతులు కల్పించామన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థినులతో ఉపాధ్యాయులు

పంగులూరు, జూలై 12: మండలంలోని పంగులూరు, చందలూరు ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన పంగులూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని పూల నాగప్రణతికి నూజివీడు కళాశాలలో సీటు లభించింది. ఇదే పాఠశాలకు చెందిన మరో విద్యార్థి రాయని సాంబశివ మహేష్‌కు ఒంగోలు కళాశాలలో సీటు లభించింది. చందలూరు ఉన్నత పాఠశాలకు చెందిన గొట్టిపాటి చంద్రిక, భూమా శ్రీలిఖిత, చందలూరు హారిక, బద్దిగం రూపశ్రీ, కోమటి హేమశ్రీలు ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినికి నూజివీడులో సీటు

బల్లికురవ, జూలై 12: మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన విద్యార్థిని గోరంట్ల లక్ష్మీలావణ్య ట్రిపుల్ ఐటీ సీటును సాధించారు. మండలంలోని కొండాయపాలెంకు చెందిన లక్ష్మీలావణ్య గత ఏడాది కేజీబీవీలో పదో తరగతి సాధించారు. 585 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థినికి నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటును ప్రభుత్వం కేటాయించింది. శుక్రవారం ఎంఈవోలు వస్త్రంనాయక్, రమేష్‌బాబు, కేజీబీవీ ప్రిన్సిపాల్ సరళకుమారి, ఉపాధ్యాయులు లక్ష్మీలావణ్యకు అభినందనలు తెలిపారు.

కోలలపూడి నుంచి ఇద్దరు విద్యార్థినులు..

మార్టూరు, జూలై 12: మండలంలోని కోలలపూడి హైస్కూల్‌కు చెందిన ఇద్దరు బాలికలకు ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించినట్లు ప్రధానోపాధ్యాయుడు గోలి రామకోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జల్లి క్రీస్తువీణ నూజివీడులో సీటు పొందగా, మద్దుమాల మనీషా ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు పొందినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

అనధికార తూములు తొలగింపు

చినగంజాం, జూలై 12: సంతరావూరు సైడ్ చానల్‌లో అనధికారంగా వేసిన తూము లను నీటి పారుదల శాఖాధి కారులు శుక్రవారం తొలగిం చారు. డీఈఈ ఎస్.ప్రసాద రావు, ఏఈ ఎం.పవన్‌కుమా ర్‌లు రైతులతో కలిసి అనధి కారకంగా వేసిన తూముల ను పరిశీలించారు. అనధికా రంగా 12 తూములు వేసిన ట్లు గుర్తించారు. వీటిని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్నట్లు డీఈఈ తెలిపారు. అనధికార తూములను తొలగించి, సైడ్ ఛానల్‌కు మరమ్మతులు చేసి సక్రమంగా సాగునీటిని అందిస్తామని తెలిపారు. కొమ్మమూరు కాలువకు వచ్చిన పట్టిసీమ జలాలను సంతరావూరు లాకుల వద్ద నుంచి దిగువకు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, విక్రం నారాయణ, నక్కల వెంకటనారాయణ, గొనసపూడి, కడవకుదురు రైతులు పాల్గొన్నారు.

ఈనాం భూములపై ఆర్డీవో వివరాల సేకరణ

మార్టూరు, జూలై 12:మండలంలో జంగమహేశ్వరపురం, లక్కవరం గ్రామాల పరిధిలోని ఈనాం భూముల వివరాలుపై శుక్రవారం ఆర్‌డీవో గంధం రవీందర్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ రెండు గ్రామాల పరిదిలోని ఈనాంభూముల పరిస్థితిపై చర్చించారు. పూర్వకాలం నుంచి రెండు గ్రామాలలో ఈనాంభూములు ఉన్నాయి. లక్కవరం గ్రామంలో 390 మంది రైతుల ఆధ్వర్యంలో 565 ఎకరాలు, జంగమహేశ్వరపురం గ్రామంలో 2830 ఎకరాలు ఉన్నాయి. వీటికి పాస్ పుస్తకాలు పొందడం కోసం ఈనాం భూములను క్రమబద్ధీకరించాలని ఏళ్ల తరబడి ప్రభుత్వం దృష్టికి రైతులు తీసుకెళుతున్నారు. ప్రస్తుతం ఈ భూములకు సంబంధించిన ఫైలు ఏకార్యాలయంలో, ఏస్థాయిలో ఉందనే విషయంపై ఆర్‌డీవో వివరాలు సేకరించారు. సమావేశంలో తహసీల్దార్ సంధ్యశ్రీ, డీటీ కోదండ రామ్, ఆర్‌ఐ రహమాన్ భాషా, వీఆర్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

వీర్లంకమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఏలూరి



వీర్లంకమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి

చిన గంజాం, జూలై 12: పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలోని అవనిగడ్డ కుటుంబీకుల ఇలవేల్పు దేవర వీర్లంకమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శుక్రవారం రాత్రి దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలలో ఏలూరి సాంబశివరావు విజయం సాధిస్తే పెద గంజాం గ్రామంలోని పోలేరమ్మ అమ్మవారికి 101 కొబ్బరికాయలు కొడతామని పెద గంజాం టీడీపీ నాయకులు మొక్కుకున్నారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి అధ్వర్యంలో జరిగిన మొక్కుబడుల కార్యక్రమంలో ఏలూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఎన్నికలలో విజయం సాధించిన తరువాత తొలిసారి పెదగంజాం గ్రామ పంచాయతీలో పలు కార్యక్రమాలలో పాల్గొనటానికి వచ్చిన ఎమ్మెల్యే ఏలూరికి పెదగంజాం, పల్లెపాలెం గ్రామస్థులు భారీ గజమాలలతో స్వాగతం పలికారు. కార్య క్రమంలో పెదగంజాం సర్పంచ్ నక్కల కృష్ణ, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు పొద వీరయ్య, అబ్దుల్ కలాంఆజాద్, నాయకులు ఆసోది బ్రహ్మానందరెడ్డి, కోమట్ల శ్రీనివాసరెడ్డి గొల్లపోతు వెంకటేశ్వర్లు, దండుప్రోలు తిరుపతిరావు, వాటుపల్లి ఏడుకొండలు, కోకి భాస్కరరెడ్డి, వడ్లమూడి వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు ప్రగతికి తోడ్పాటునందించాలి

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వినతి

» సీఎం దృష్టికి తీసుకెళ్లిన పలుసమస్యలు



చంద్రబాబుతో ఎమ్మెల్యే ఏలూరి (ఫైల్)

పర్చూరు, జూలై 12: పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. శుక్రవారం సచివాలయంలోని సీఎం చాంబర్‌లో ఎమ్మెల్యే ఏలూరి కలిశారు. ఈసందర్భంగా పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

గుంటూరు ఛాలన్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు యుద్ధప్రాతి పదికన నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రిని కోరారు. గుంటూరు చానల్ పొడిగింపుతో తాగు, సాగునీటి సమస్య పరిష్కారం అవుతుదన్నారు. 2019లో మన ప్రభుత్వంలో రూ.275 కోట్ల నిధులు మంజూరుచేసినట్టు గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆపనులు రద్దు చేసిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా వైసీపీ నేతలు ఓట్లు తొలగించేందుకు కుట్రలు చేశారని దీనిపై విచారణ చేపట్టేందుకు సిట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. కుట్రలకు పాల్పడిన వారిపై ఎలాంటి విచారణ జరపకుండా 52 మందిపై తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి నీరు కార్చారన్నారు.

చిలకలూరిపేట మండలం పసుమర్రు వద్ద మే నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే ఏలూరి కోరారు. ప్రమాదంలో మృతి చెందిన వారు పర్చూరు నియోజకవర్గంలోని చిన్నగంజాం మండలానికి చెందిన వారని తెలిపారు. నియోజకవర్గంలో 25 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలని కోరారు. పర్చూరు నియోజకవర్గంతోపాటు, బాపట్ల జిల్లాను ప్రగతి పథంలో అగ్రభాగంలో నిలిపేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఏలూరి కోరారు. బస్సు ప్రమాద బాధితులను ఆదుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. అలాగే, గుంటూరు చానల్ పొడిగింపు కాలువల మరమ్మతులకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యోన్నతి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కును అందజేస్తున్న ఎంఈవో సుధాకరరావు, ఫౌండేషన్ డైరెక్టర్ వీరనారాయణ తదితరులు

అద్దంకిటౌన్, జూలై 12: మెరిట్ విద్యార్థుల చదువుకు ఎటువంటి ఆటంకం కలుగకుండా చేయూత నందిస్తున్న విద్యోన్నతి ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈవో -1 బూదాటి సుధాకరరావు అన్నారు. శక్రవారం స్థానిక కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యోన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం హెచ్‌ఎం గురవయ్య అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది 30 మందికి రూ.10 వేల చొప్పున ఇస్తున్నట్టు చెప్పారు. విద్యోన్నతి ఫౌండేషన్‌కు తన వంతుగా డాక్టర్ చదలవాడ ఫణింద్రబాబు రూ.20 వేలు ప్రకటించారు. అలాగే, పెంట్యాల గంగాధర్ రూ.20 వేలు సిండికెట్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ తాళ్ళూరి బాబురావు రూ.10 వేలు ఇస్తున్నట్టు ప్రకటించారు. కాకానిపాలెం ఉన్నత పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు ఈ ఏడాది నుంచి రూ.10 వేల చొప్పున ఇద్దరికి అందిస్తానని సింగు సుబ్బాయమ్మ తెలిపారు. అనంతరం దూళిపాళ్ల వెంకటేశ్వర్లు, బోడెంపూడి శ్రీరామమూర్తిల జ్ఞాపకార్థం వారి మనుమరాలు డాక్టర్ షర్మిల ప్రియాంక సౌజన్యంతో ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటడంతో పాటు మెరిట్ స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులకు మొక్కలను అందించారు. పాఠశాల ఆవరణంలో పలురకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎం.త్రిమూర్తులు, బోడెంపూడి జయశంకర్, మాపర్తి సాంబశివరావు, చప్పిడి వీరయ్య మలాది శ్రీనివాసరావు, పీడీ ముద్దన విష్ణుప్రసాద్, హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు, రిటైర్డ హెచ్‌ఎం కమలాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఊరచెరువులో ఆక్రమణల తొలగింపునకు చర్యలు



ఊరచెరువులో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

అద్దంకి, జూలై 12: ఊర చెరువులో ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టనున్నట్లు చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ నగర్ సమీపంలో పలువురు వైసీపీ నాయకులు ఊర చెరువును ఆక్రమించి ఇళ్ల స్థలాలుగా మార్చి అమ్మకాలు చేస్తున్నారు. ఆక్రమణలపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. అలాగే, పలువురు టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి ఊరచెరువును పరిశీలించారు. ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టడంతో పాటు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అద్దంకి కొండ వద్ద ఇండోర్ స్టేడియంకు వెనుకవైపు కొండపైన అద్దంకి పట్టణంలోని 130 మంది కార్పెంటర్‌లకు షాపుల ఏర్పాటుకు స్థలాల కేటాయింపునకు పరిశీలన చేశారు. నామ్ రోడ్డు వెంబడి అగ్నిమాపక కేంద్రం ఏ ర్పాటుకు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో త హసీల్దార్ మహబూబ్ సుభాని, సర్వేయర్ శ్రీలక్ష్మి, వీఆర్వో బాషా, టీడీపీ నేతలు కాకాని అశోక్, వడ్లవల్లి పూర్ణచంద్రరావు, యూనియన్ నాయకులు చెన్నకేశవులు, నాగేశ్వరరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



బియ్యం, కందిపప్పు అమ్మకాలను ప్రారంభిస్తున్న అధికారులు, టీడీపీ నేతలు

అద్దంకి, జూలై 12: బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర ధరల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తహసీల్దార్ సుభాని అన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్, డాల్ మిల్లర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని కాకానిపాలెంలో బియ్యం, కందిపప్పు అమ్మకాలను శుక్రవారం తహసీల్దార్ సుభాని, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ప్రారంభించారు. స్టీమ్ బియ్యం కిలో రూ.49, పచ్చి బియ్యం రూ.48, కంది పప్పు రూ.160 చొప్పున విక్రయిస్తున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వాసుదేవ రావు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాస రావు, కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, గోపి, భోజనపల్లి సత్య నారాయణ, గుంటూరు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో.. చీరాల, జూలై 12: తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని శుక్రవారం ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. పేరాల చిన్నరథం సెంటర్లో ఏర్పాటుచేసిన విక్రయ కేంద్రంలో బియ్యం కేజీ రూ.49లకు, ముడి బియ్యం కిలో రూ.48, దేశవాలీ కందిపప్పు రూ.160లకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఈఅవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

» ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి

» సాదాసీదాగా ముగిసిన మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

బల్లికురవ, జూలై 12: సీజనల్ వ్యాధుల ప్రబలకుండా తక్షణమే అన్ని గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం జరిగిన బల్లికురవ మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిధులు లేకపోవటంతో సమావేశం సాదాసీదాగా ముగిసింది. అధికారులు శాఖలవారీగా ప్రగతి నివేదికలు చదివి సమావేశాన్ని ముగించారు. ఈసందర్భంగా ఎంపీడీవో హనుమారెడ్డి మాట్లాడుతూ అన్ని గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామస్థాయిలోని అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. వ్యవసాయధికారిణి కుమారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు 30 శాతం సబ్సిడీపై కందులు, పెసలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. గృహనిర్మాణ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక అనుమతులు ఉన్న లబ్ధిదారులు డిసెంబరులోపు పనులు మొదలు పెట్టాలని, లేకుంటే గృహాలు రద్దవుతాయని చెప్పారు. వెలుగు ఏపీఎం సురేంద్రబాబు మాట్లాడుతూ పొదుపు సంఘాలలోని గ్రుపులకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. పశువైద్యాధికారి మహేశ్వరరావు మాట్లాడుతూ గొర్రెలు, తెల్లజాతి రకాల జంతువులకు వ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. వైద్యఆరోగ్యశాఖ వైద్యాధికారి రవితేజ మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా తమ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఎంఈవో వస్త్రం నాయక్ మాట్లాడుతూ బల్లికురవలో బాలికలకు వసతి గృహాన్ని మంజూరుచేయాలని కలెక్టర్‌కు నివేదిక పంపాలని కోరారు.

సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు చింతల అంజలి, ఈవోపీఆర్డీ సుమతి, సీడీపీవో సుధ, పలుశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఆర్టీసీ, ఇరిగేషన్, ఎన్ఎస్పీ అధికారులు గైర్హాజరయ్యారు.

రైతు కుటుంబానికి పరిహారం అందేలా చర్యలు



కౌలురైతు మృతదేహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

నూతలపాడు(పర్చూరు), జూలై 12: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు భౌతికకాయాన్ని అధికారులు సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మండలంలోని నూతలపాడుకు చెందిన బాదుడుల నాగరాజు(37) అప్పుల బాధతో చిలకలూరిపేట మండలం బొప్పూడి సమీపంలోని పొలాల్లో గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహాన్ని స్వగ్రామం నూతలపాడు తరలించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో వ్యవసాయ అధికారులతోపాటు, రెవెన్యూ అధికారులు మృతుని నివాసానికి వెళ్ళి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు. నివాళులర్పించిన వారిలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.రామమోహన్‌రావు, తహసీల్దార్‌లు సీహెచ్ సుబ్బయ్య, వై.నాగరాజు, ఏవో రామ్మోహన్‌రెడ్డి, ఆర్‌ఐ ప్రేమ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

టీడీపీ ఫ్లెక్సీలను చించివేసిన గుర్తుతెలియని వ్యక్తులు

మేదరమెట్ల, జూలై 12: మండలంలోని బొడ్డువానిపాలెంలో తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు టీడీపీ ఫ్లెక్సీలు చించివేశారని ఆ గ్రామ టీడీపీ నాయకులు మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల క్రితం వైసీఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీలను కూడా గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఫ్లెక్సీలను చించడం గ్రామంలో ఉద్రిక్తతలకు దారి తీసింది. ఫ్లెక్సీల చించివేతపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆటపాటలతో చిన్నారులకు విద్యా బోధన

బల్లికురవ, జూలై 12: అయిదేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటలతో మెరుగైన విద్యను అందిస్తున్నట్టు సంతమాగులూరు ఐసీడీఎస్ సీడీపీవో సుధ తెలిపారు. శుక్రవారం బల్లికురవ మండల కేంద్రంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ పోషణ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషకాహారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. ఈఅవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాలలో సమయపాలన పాటించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు.

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే కొండయ్య దంపతులు



సింహచల పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య దంపతులు

చీరాల, జూలై 12: సింహచల పుణక్షేత్రంలో వరాహ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం ఎమ్మెల్యే కొండయ్య, సతీమణి బాలకొండమ్మ, పెదకుమారుడు గౌరీఅమర్‌నాథ్‌లతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించకున్నారు. ఈసందర్భంగా ఆలయ ఈవో ఎమ్మెల్యే కొండయ్య, ఆయన కుటుంబసభ్యులను ఆలయ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు బీచ్ కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపిక

చినగంజాం, జూలై 12: చినగంజాం మండల కార్యాలయాల సముదాయం ఎదురుగా గల సోపిరాల రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం ఉమ్మడి ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ(చెడుగుడు) జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్ల శిక్షణ అనంతరం ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఇందుకూరు పేటలో జరిగే రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట(చీరాల), జూలై 12: వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ప్రాంగణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మెయింటెనెన్స్‌లో భాగంగా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని సంప త్నగర్, కొత్తపేట, ఐఎల్‌టీడీ కాలనీ, వడ్డె సంఘం, పాపాయిపాలెం, వాకావారి పాలెం, రేశయ్యకాలనీ, రామాపురం, వాడరేవు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చినగంజాంలో.. చినగంజాం, జూలై 12: మండలంలోని చినగంజాం, కొత్తపాలెం, పెదగం జాం సబ్‌స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మతులలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈఈ పడవల గణనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మార్టూరులో.. మార్టూరు, జూలై 12: విద్యుత్ సబ్‌స్టేషన్‌ల్లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మార్టూరు, రాజుపాలెం, కొత్తగా ఏర్పాటుచేసిన విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిదిలో సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఇంకొల్లులో.. ఇంకొల్లు, జూలై 12: మండలంలోని ఇంకొల్లు, ఇడుపులపాడు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ జాగర్లమూడి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అద్దంకిలో.. అద్దంకి, జూలై 12: అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా బ్రేకర్ లు ఏర్పాటు చేస్తున్నందున శనివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మైనర్‌లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం

చీరాలటౌన్, జూలై 12: మైనర్‌లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని న్యాయాధికారి సుధ పేర్కొన్నారు. కోర్టు భవన సముదాయంలో శుక్రవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నియంత్రణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌కే రెహానా, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, ఎస్‌డి మతీన్, తదితరులు పాల్గొన్నారు.


ఆరు కిలోల గంజాయి పట్టివేత

చీరాలటౌన్, జూలై 12: గం జాయి, ఇతర మత్తు పదార్థాల తో యువత భవితవ్యం ఛిన్నా భిన్నమవు తుంద ని టూటౌన్ సీఐ సోమశేఖర్ అ న్నారు. స్టేషన్ పరిధిలో ఆరు కి లోల గంజాయిని సీజ్ చేశారు. ఇందుకుసంబంధించిన వివరాలను శుక్రవారం స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మే రకు స్టేషన్ పరిధిలోని కారంచేడు - ఈపూరుపాలెం రోడ్డులో సీఐ సిబ్బందితో కలిసి ముమ్మర తనిఖీలు చేశారు. ఈక్రమంలో ఉజిలీపేటకు చెందిన మా డపాటి వీరాంజనేయులు, రాజు జయలక్ష్మి, వల్లభ శామ్యేల్, నల్లగొర్ల రాజేష్, జయంతిపేటకు చెందిన కావూరి నానిలను అదుపులోకి తీసుకుని ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే, గత మంగళవారం వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో ఉజిలీపేట సచివాలయం సమీపంలో ఓ మహిళ విక్రయాలు జరుపుతుండగా దాడి చేసి పట్టుకున్నారు.

ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి నియంత్రణకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, నాగూర్ వలి, ఆంజనేయులు, స్వరూప పాల్గొన్నారు.

మార్టూరు రోటరీ కార్యవర్గం ప్రమాణస్వీకారం

మార్టూరు, జూలై 12: మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా మద్దుమాల కోటేశ్వర రావు, కార్యదర్శిగా మాదాల సాంబశివరావు, కోశాధికారిగా గరిమిడి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. గురువారం రాత్రి స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమా నికి ఎఫర్ట్ సంస్థ అధ్యక్షుడు జాష్టి వెంకటమోహనరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గవర్నర్ శరత్‌చౌదరి నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు తాళ్లూరి సాంబశివరావు, కొర్రపాటి కాజారావు, ఇంటూరి ఆంజనేయులు, చెన్నుపాటి బసవరాములు, షేక్ కాజాహుస్సేన్, చెరుకూరి అంజిబాబు, ఈశ్వరప్రసాద్, రావి అంకమ్మచౌదరి, జాష్టి అనూరాధ పాల్గొన్నారు.



- రూ.100 కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు
- నిషేధిత జాబితా నుంచి తొలగించిన అధికారులు
- రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదు
- సుప్రీం కోర్టులో కేసు నడుస్తున్నా బేఖాతరు
- నెల్లూరు రూరల్ మండలంలో వెలుగులోకి...

ఎవరు ఎందుకు చేశారు!?

పట్టా భూములకు ఆధారాలు ఉన్నా నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు అనేక కొర్రీలు పెట్టే అధికారులు దాదాపు రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని మాత్రం ఆ జాబితా నుంచి తొలగించారు. నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు లో సుమారు 21 ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగిస్తూ గతేడాది జనవరిలో ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా ఈ విషయం వెలుగులోకి రావడం సంచలనం రేకెత్తిస్తోంది. ఇంత పెద్ద అక్రమ వ్యవహారానికి సూత్ర, పాత్రధారులు ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది.

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.521లో 5.20 ఎకరాలు, 525లో 2.39 ఎకరాలు, 527లో 8.59 ఎకరాలు, 529-ఏలో 4.76 ఎకరాల భూమి ఉంది. రికార్డుల్లో ఇదంతా ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. పూర్వపు ఫసల్లీలో కూడా ప్రభుత్వం, అనాధీనంగా నమోదు చేసి ఉన్నారు. అయితే కొన్ని ఫసలీల్లో అనుభవదారులుగా సర్కార్ పేపర్ మిల్లును చూపించారు. సర్కారు పేపర్ మిల్లుకు ఈ సర్వే నంబర్లకు ఆనుకొని ఉన్న 522, 523, 524, 526 సర్వే నంబర్లలో 25.29 ఎకరాల భూమి ఉంది. 1980లో సర్కార్ పేపర్ మిల్లు రైతుల నుంచి ఈ భూమిని కొనుగోలు చేసింది. ఆ తర్వాత పేపర్ మిల్లు పెట్టి నష్టాలు రావడం, రుణాలు చెల్లించక పోవడంతో బ్యాంకులు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ భూ ముల వేలానికి హైకోర్టు లిక్విడేటర్‌ను నియమించింది. కానీ అప్పట్లో సర్కారు పేపరు మిల్లు యాజమాన్యం వారి పట్టా భూములతో పాటు పక్కనే ఉన్న భూమిని కూడా అనుభవిస్తూ వచ్చింది. అయితే లిక్విడేటర్ ఈ మొత్తం భూమిని కలిపి వేలం వేశారు. కానీ 2004లో అప్పటి కలెక్టర్ ఈ వేలాన్ని రద్దు చేయాలని హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ప్రభుత్వ భూముల వేలాన్ని రద్దు చేసింది. కేవలం పట్టా భూమిని మాత్రమే వేలం వేసేందుకు అనుమతి ఇచ్చింది. ఆ క్రమంలో 521, 525, 527, 529-ఏ సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అప్పటి నెల్లూరు తహసీల్దార్ నోటీసులు కూడా జారీ చేశారు. అయితే అప్పటికే ఒక సంస్థ ఈ భూమి మొత్తాన్ని వేలంలో పాడుకుంది. హైకోర్టు ఆదేశాలతో లిక్విడేటర్ సర్కారు పేపర్ మిల్లుకు చెందిన 25.29 ఎకరాల పట్టా భూమిని మాత్రమే ఆ సంస్థకు రిజిస్ట్రేషన్ చేశారు. కానీ సదరు సంస్థ మిగిలిన భూమి కూడా తమకు రిజిస్ట్రేషన్ చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఇప్పటికీ ఈ కేసు సుప్రీంకోర్టులో పెండింగ్ ఉంది.

● సుప్రీం కోర్టులో ఉన్నప్పటికీ..!

వేలంలో సర్కారు పేపరు మిల్లు స్థలాన్ని కొనుగోలు చేసిన సంస్థ ఆ భూమిలో మూడేళ్ల క్రితం లేఅవుట్ వేసింది. ఈ లేఅవుట్‌కు చుట్టూ ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఆ భూమి కూడా తమదేనంటూ బయట ప్రచారం చేసుకోవడంతో పాటు ఆక్రమణలు చేస్తున్నారని కొందరు స్థానికులు 2021లో అప్పటి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. కానీ వారు పట్టించుకోకపోవడంతో వారు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ వేయాల్సిందిగా అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబును హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో సర్వే నెం.521, 525, 527, 529-ఏలలోని సుమారు 21 ఎకరాలు ప్రభుత్వ భూమిగా కలెక్టర్ హైకోర్టుకు తెలియజేశారు. ఆ భూమిపై వివాదం ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఉందని, ఎవరూ ఆక్రమణలు చేయడం లేదని నివేదించారు. అదే సమయంలో సదరు భూమిలో బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇలా సదరు 21 ఎకరాల భూమి ప్రభుత్వ భూమిగా నిర్ధారించినా రెవెన్యూ అధికారులు ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించడం గమనార్హం. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం 22-ఏ జాబితాను సవరించింది. కొన్ని గైడ్‌లెన్స్ ఇచ్చి, వాటి ప్రకారం ఆ జాబితా నుంచి తొలగించాలని ఆదేశించింది. ప్రభుత్వ భూములను మాత్రం నిషేధిత జాబితాలో నుంచి తొలగించే అధికారం ఎవరికీ లేదు. కానీ జిల్లా అధికారులు మాత్రం నిషేధిత జాబితా నుంచి తొలగించారు. అటు సుప్రీంకోర్టు, ఇటు హైకోర్టులో కేసులు నడుస్తున్నా లెక్క చేయకుండా బరితెగించారు. 2021, డిసెంబరులో ఆ భూమిలో బోర్డులు పెట్టిన అధికారులే.. 2022 డిసెంబరులో ఆ భూములను 22-ఏ నుంచి తొలగించేందుకు ప్రతిపాదనలు పంపడం గమనార్హం. అంతేగాక ఆ భూమి సర్కారు పేపరు మిల్లుదిగా నిర్ధారిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీఎం జగన్మోహన్‌రెడ్డి పేరుతో లేఖ కూడా పంపారు. ఈ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. నిషేధిత జాబితాలో నుంచి తొలగించారు కాబట్టి సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేసేస్తే అందుకు ఎవరు బాధ్యులన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ప్రాంతంలో ఎకరా సుమారు రూ.5 కోట్లు పలుకుతుండగా మొత్తం రూ.100 కోట్ల భూమి పరులపాలయ్యే పరిస్థితి నెలకొంది. అసలు ప్రభుత్వ భూమిగా నిర్ధారించాక 22-ఏ జాబితా నుంచి ఎలా తొలగించారు? ఎందుకు తొలగించారు? ఎవరి కోసం తొలగించారు? అన్న ప్రశ్నలకు జిల్లా ఉన్నతాధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది. ఎందుకంటే తహసీల్దార్ దగ్గర నుంచి కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ ఈ జాబితాపై సంతకం పెట్టి ఆమోదించినవారే.



నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడులోని ప్రభుత్వ భూమి, జగన్ సర్కారు పంపిన లేఖ (ఇన్‌సెట్‌లో)



నెల్లూరు (హరనాథ పురం), జూలై 12 : జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలు, తెలుగు గంగ ప్రాజెక్టుల స్థితిగతులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పూర్తిస్థాయిలో నివేదకలు సిద్ధం చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇరిగేషన్ అధికారులు ఆదేశించారు. ఈ నెల 14న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు జిల్లాకు రానున్న నేపథ్యంలో ఆయన పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనం అధికారులతో సమీక్షించారు. సోమశిల, కండలేరు

ఇరిగేషన్ ప్రాజెక్టులపై నివేదిక సిద్ధం చేయండి

● అధికారుల సమీక్షలో మంత్రి ఆనం

జలాశయాల్లో పెండింగ్ పనులు, మొదలు పెట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తిస్థాయిలో నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తెలుగగంగ ప్రాజెక్టులో చేపట్టాల్సిన పనులపై కూడా సమగ్ర నివేదిక తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణారెడ్డి, జలవనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్, కండలేరు ఎస్ఈ వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రేపు మంత్రులు జలాశయాల పరిశీలన


సోమశిల, కండలేరు జలాశయాలను రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలు ఆదివారం పరిశీలించనున్నారు. సోమశిల జలాశయం సందర్శన తరువాత సోమేశ్వరాలయం, కండలేరు రిజర్వాయలర్లను వారు పరిశీలిస్తారు. ఆ జలాశయాల అభివృద్ధికి ప్రాథమికంగా చేపట్టాల్సిన పనులను ఆనం, నారాయణలు మంత్రి నిమ్మల దృష్టికి తీసుకెళ్లనున్నారు. ప్రధానంగా సోమశిల ఆప్రాన్, రక్షణ గోడ నిర్మాణ పనులు, గేట్ల మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసేలా మంత్రి నిమ్మలకు వివరిస్తారు. అనంతరం కండలేరు జలాశయ అతిథి గృహంలో జలవనరుల శాఖ అధికారులతో మంత్రులు సమీక్షిస్తారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ప్రభుత్వ భూముల్లో బినామీల పాగా!

- నకిలీ పట్టాలతో పాసుపుస్తకాలు
- ఇప్పటికే వందల ఎకరాల అమ్మకాలు
- ఇంత జరుగుతున్నా కళ్లు తెరవని రెవెన్యూ శాఖ



ప్రభుత్వ భూముల చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

ఉదయగిరి, జూలై 12 : అవన్నీ ప్రభుత్వ భూములు అయితేనేం.. బినామీ పేర్లతో పట్టాలు సృష్టించి, పట్టాదారు పాసుపుస్తకాలు కూడా పుట్టించారు. అంతేకాదండోయ్ అడంగల్, 1బీలలోనూ నమోదు చేయించారు. ఇలాంటి వందలాది ఎకరాల భూములనే రూ.లక్షలకు విక్రయించి రిజిస్ట్రేషన్లు సైతం చేయించారు. ఇలాంటి భూములను కొనుగోలు చేసిన కొందరు రాత్రికిరాత్రి కంపచెట్లను తొలగించి చదును చేయగా, మరికొందరు వాటి చుట్టూ కంచెలు ఏర్పాటుకు రాళ్లను పాతారు. జిల్లాకు విసిరేసినట్టు ఉన్న ఉదయగిరి ప్రాంతంలో ఈ భూబాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది.

● బినామీ పేర్లతో పట్టాలు

ఉదయగిరి మండలం కొండాయపాళెం మజారా కింద వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిలో వందల ఎకరాల భూములను స్థానికులు, స్థానికేతరుల పేర్లతో బినామీ పట్టాలు సృష్టించి గుట్టుచప్పుడు కాకుండా కొందరికి విక్రయించారు. ఒక్కో ఎకరా రూ.2.5 లక్షల చొప్పున చేతులు మారుతున్నాయి. సర్వే నెంబర్ 635/1, 2, 3, 4, 7, 956/1, 2, 957/1, 2, 3, 958/1, 2, 3, 961/1, 965/3, 970/1, 971/1, 2, 3, 1039/3, 1054/1, 1059లతోపాటు అనేక సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూములను బినామీ పట్టాలు సృష్టించి అమ్మకాలు జరిపారు. ఇవేగాక వందల ఎకరాలు ప్రభుత్వ భూములకు బినామీ పట్టాలు సృష్టించినట్లు సమాచారం. కొనుగోలు చేసిన వ్యక్తులు కొందరు వీటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

● నెల్లూరు కేంద్రంగా...

కొండాయపాళెం మజారా ప్రభుత్వ భూములకు సంబంధించి గత కొన్నేళ్ల క్రితం నెల్లూరులో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. ఈ తతంగంలో భారీస్థాయిలో ముడుపులు అందినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నాయకులు, ఉద్యోగులు, వ్యాపారులు లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన భూముల చుట్టూ ముళ్లకంచె ఏర్పాటుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఆ భూముల్లో పనులు నిరాటంకంగా కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కొండాయపాళెం మజారా భూములపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. కొండాయపాళెం పంచాయతీ వీఆర్వో వెంకట్‌ను వివరణ కోరగా తనకు విషయం తెలియదని రెండు రోజుల్లో పరిశీలించి వివరాలు తెలియజేస్తానని చెప్పారు.



ప్రభుత్వ భూముల్లో సాగు చేసిన జామాయిల్

డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్

నెల్లూరు (విద్య), జూలై 12 : డీఎస్సీలో పోస్టుల సంఖ్యను పెంచి మెగా డీఎస్సీ ప్రకటించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రాజశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నెల్లూరులోని పీడీఎస్‌యూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం. 83, 84, 117లను తక్షణమే రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని పోస్టులను భర్తీ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎం.సునీల్ మాట్లాడుతూ సంక్షేమ రంగానికి ఎన్‌డీఏ ప్రభుత్వం పెద్దపీట వేయాలని ఆకాంక్షించారు. నీట్ పేపర్లను లీక్ చేసిన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. వీటన్నిటిపై భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని, విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నేతలు పాల్గొన్నారు.

తెల్లరాయి అక్రమ తవ్వకాలపై పరిశీలన

సైదాపురం, జూలై 11 : మండల పరిధిలోని చాగణం గ్రామ ప్రభుత్వ భూముల్లో తెల్లరాయి అక్రమ తవ్వకాలపై శుక్రవారం మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ, పట్టా భూ ముల్లో అక్రమంగా తెల్లరాయి తరలించడంపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ మేరకు సర్వే బృందంతో విచారించామని, సర్వే పూర్తయ్యాక శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం ఫిర్యాదుదారుడు బద్వేలు జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్, అటవీ శాఖ భూముల్లో రూ.50 కోట్ల విలువ జేసే తెల్లరాయిని అక్రమంగా తరలించారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై 20 రోజుల కిందట తాము మైనింగ్ డీడీ కార్యాలయం చుట్టూ తిరి గినా ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. దీంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు అధికారుల బృందం సర్వే చేపట్టిందని అన్నారు.



తెల్లరాయి తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు

ఏందుకు రాలేదు!

- పీహెచ్‌సీలలో 55 శాతం మందికే వైద్యం
- ఆర్నెల్ల తర్వాత గ్రేడ్‌లు ప్రకటించిన వైద్య ఆరోగ్య శాఖ
- జిల్లాలోని ఒక్క పీహెచ్‌సీకీ దక్కని ఏ గ్రేడ్
- బీ గ్రేడ్‌లో 19, సీ-26, డీ-4
- గ్రేడ్‌లకు దూరంగా ఏఎస్‌పేట, సౌత్‌మోపూరు, ఇస్కపాళెం

నెల్లూరు (వైద్యం) జూలై 12 : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) పనితీరుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రతినెల గ్రేడ్‌లను ప్రకటిస్తుంది. ఎన్నికల నేపథ్యంలో 6 నెలల తర్వాత జూన్ నెలకు సంబంధించి పీహెచ్‌సీల గ్రేడ్‌లను ప్రకటించింది. బీ, సీ, డీ గ్రేడ్‌లు తప్ప ఒక్క పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ రాలేదంటే జిల్లాలోని పీహెచ్‌సీల పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది. జిల్లాలో 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా అనుమసముద్రం, సౌత్ మోపూరు, ఇస్కపాళెం పీహెచ్‌సీలు అసలు గ్రేడ్‌లకు ఎంపిక కాలేదు. ఇక్కడ ప్రజలకు వైద్యసేవలు సరిగ్గా అందడం లేదన్న విషయంపై రాష్ట్ర ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక జొన్న వాడ, వరిగొండ, చాకిచర్ల, కలిగిరి, కుల్లూరు వంటి 19 పీహెచ్‌సీలలో అసలు ప్రసవాలే జరగలేదని ఆరోగ్యశాఖ తాజా బులెటిన్ వెల్లడిస్తుంది. ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు రూ.30 కోట్లకుపైగా విడుదల చేస్తుంది. ఒక్కో పీహెచ్‌సీ నిర్వాహణ, అత్యవసర మందుల కోసం రూ.1.75 లక్షల వంతున విడుదల చేస్తుంది. ఇంతగా కేంద్రం ఖర్చు చేస్తున్నా పీహెచ్‌సీలలో మాత్రం ఆశించిన స్థాయిలో ఫలితాలు ఉండటం లేదు.

● దక్కని ఏ గ్రేడ్!

ఆరోగ్య కేంద్రాల పనితీరులో ఒక్క పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ రాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలలో 285 స్థానంలో లింగ సముద్రం పీహెచ్‌సీ నిలిచి, జిల్లాలో మొదటిస్థానం దక్కించుకుంది. ఇక్కడ 3074 మందికి వైద్యం, 6 ప్రసవాలు, 1,499 మందికి పలురకాల పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత 385వ స్థానంలో అనంతసాగరం పీహెచ్‌సీ జిల్లాలో 2వ స్థానం దక్కించుకుంది. రామతీర్థం, ముత్తుకూరు, సంగం, వరిగుంటపాడు, మైపాడు, మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తరువాత స్థానాలలో ఉన్నాయి. గ్రేడ్‌ల పరంగా బీ గ్రేడ్‌లో 19 పీహెచ్‌సీలు, సీ గ్రేడ్‌లో 26, డీ గ్రేడ్‌లో 4 పీహెచ్‌సీలు నిలిచాయి. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలలో 55 శాతం ప్రజలకు వైద్యసేవలు అందించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది.



లింగసముద్రంలోని పీహెచ్‌సీ కేంద్రం



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణమది. ఇక్కడున్న పురాతన భవనాల్లో విలువైన టేకు దుంగలు ఉన్నాయి. అప్పట్లో టేకు దుంగలను అమర్చి ఆ తర్వాత స్లాబు వేసిన ఆనవాళ్లు ఉన్నాయి. ఈ దుంగల విలువ మార్కెట్లో రూ.లక్షల్లో ఉండటంతో దొంగల కళ్లు ఈ భవనాలపై పడ్డాయి. ఇంకేముంది.. కొంతమంది ఉద్యోగుల సహకారంతో చోరీకి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ రెండుసార్లు చోరీ కూడా జరిగాయి. అయినా ఆశ చావని అక్రమార్కులు పురాతన భవనాల శకలాలను తొలగిస్తూ దుంగల దొంగతనానికి మార్గం సుగమం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిఘా ఏర్పాటు చేయకపోతే విలువైన టేకు దుంగలు పరులపాలయ్యే ప్రమాదం ఉంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

అరె పైకప్పు ఏమైంది!?

డీఎంహెచ్‌వో కార్యాలయం వెనుక పాత భవనం పైకప్పును తొలగించిన దుండగులు

దుంగల దొంగలు తెగబడ్డారు!



టేకు దుంగల కోసం పాత భవనాన్ని పగలగొట్టిన దృశ్యం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సంగం: 33కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెన్స్ పనులతో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్న 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో ఏఈ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయగిరి రూరల్: సబ్‌స్టేషన్‌లో నెలకొన్న మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఖుద్దూస్‌భాష ప్రకటనలో తెలిపారు.

వింజమూరు: పట్టణంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రింటర్ అందజేత



ప్రింటర్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

వరికుంటపాడు, జూలై 12: స్థానిక ఉన్నత పాఠశాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ మండల కన్వీనర్ యర్రా చినబ్రహ్మయ్య పాఠశాలకు ప్రింటర్‌ను వితరణ చేశారు. శుక్రవారం నెల్లూరుజిల్లా పార్లమెంట్ యువత కార్యదర్శి ఎంఎంకె చౌదరి ఈ ప్రింటర్‌ను హెచ్‌ఎం వీరభద్రయ్యకు అందజేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచన మేరకు ప్రింటర్‌ను ఇవ్వడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రమణయ్య, నాయబ్‌రసూల్, పోలిబోయిన కొండయ్య, అజయ్‌యాదవ్, మదన్‌యాదవ్, రామకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీపై ఫిర్యాదు

ఏఎస్ పేట, జూలై 12: గుడిపాడు ఎంఎల్‌హెచ్‌పీపై శుక్రవారం మాజీ వైస్ ఎంపీపీ దేవరాల హజరత్తయ్య ఏఎస్‌పేట పీహెచ్‌సీ వైద్యురాలు మంజులకు ఫిర్యాదు చేశారు. గుడిపాడులో అనారోగ్యంతో ఉన్న ఓ వ్యక్తికి సాయంత్రం ప్రాథమిక వైద్యం కోసం స్థానిక ఎంఎల్‌హెచ్‌పీఈ, ఏఎన్‌ఎంలను సంప్రదించగా వారు అందుబాటులో లేరు. ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని తెలిపారు. విషయంపై జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు.

స్కూల్ కిట్స్ అందజేత



విద్యా సామగ్రిని తరలిస్తున్న టీచర్లు

సీతారామపురం, జూలై 12: స్టూడెంట్ కిట్‌లో భాగంగా సీతారామపురం ఏపీ మోడల్ స్కూల్ స్టాక్ రూంలో ఉంచిన 1899 స్కూల్ కిట్స్‌ను శుక్రవారం సీతారామపురం, అయ్యవారిపల్లి, బసినేనిపల్లి, ఓగూరువారిపల్లి కాంప్లెక్స్ పరిధిలోని 40పాఠశాలలకు ఎంఈఓ మస్తాన్‌వలి పంపిణీ చేశారు. మధ్యాహ్నం 1.30నుంచి అయ్యవారిపల్లి, బసినేని పల్లి కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలో పిల్లలకు బ్యాగ్స్ షూస్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయనతో సీఆర్పీలు కులారి వెంకటేశ్వర్లు, ఆవుల వెంకటేశ్వర్లు, విజయ్ భాస్కర్, జయరావ్, సిబ్బంది రమాదేవి ఉన్నారు.

ఆలయ స్థలం పరిశీలన

ఉదయగిరి రూరల్, జూలై 12: పట్టణంలోని ఆనకట్ట సమీపంలోని గంగమ్మ ఆలయ స్థలాన్ని శుక్రవారం ఆత్మకూరు ఆర్డీవో మధులత పరిశీలించారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని స్థానిక రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆమె వెంట తహసీల్దారు స్రెహబాబు, సర్వేయరు రవి, వీఆర్వో వెంకట్ ఉన్నారు.

డిజిటల్ అసిస్టెంట్లను జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించాలి

వింజమూరు: డిజిటల్ అసిస్టెంట్లను జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించాలని ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు వెలుగోటి మధు డిమాండ్ చేశారు. పట్టణంలోని తెలుగుదేశం కార్యాలయంలో శనివారం ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి ఎన్జీవో నాయకులు డిటిటల్ అసిస్టెంట్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలి

ఆత్మకూరు, జూలై 12: విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ నేతలు పనిచేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వెన్ను నరేంద్ర తెలిపారు. స్థానిక డాక్టర్ చెర్లో రమణారెడ్డి స్మారక భవన్‌లో శుక్రవారం సంఘం పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ ఖాదర్‌బాష, ఎన్ చక్రి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా శ్రీను, కార్తీక్, భరణి, మనోజ్‌తోపాటు ఏడుగురు సభ్యులుగా ఉన్నారు.

'నేను బడికిపోతా' ర్యాలీ

కలువాయి, జూలై 12: తెలుగురాయపురంలో శుక్రవారం నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఎంఈవో-2 శేషగిరిరావు, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, మస్తాన్‌బాబు, పాల్గొన్నారు.

సంగం: స్థానిక విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో నేడి బడికిపోతా కార్యక్రమంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బడిఈడు పిల్లలందరూ బడిలో చేర్పిదాం అని నినాదాలు చేశారు. చివరలో ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో జానికీరామ్, మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దారు శివనాగిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, జూలై 12: మున్సిపాలిటీలోని 15వ వార్డు పరిధిలోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకుని జేసీబీతో చదును చేస్తుండగా శుక్రవారం టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి స్థానికులతో అక్కడికి కలిసి వెళ్లి పనులను అడ్డుకున్నారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, టీడీపీ నేతలతో కలిసి కమిషనర్, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తిప్ప పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి సొమ్ము చేసుకునేందుకు విక్రయిస్తారని పేర్కొన్నారు. ఈ విషయంలో న్యాయం చేయాలని కోరారు. గతంలో కొందరు వైసీపీకి చెందిన వారు ఆక్రమించుకొని లక్షల రూపాయలు సొమ్ము సమస్యను రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి స్థానిక గిరిజనులకు చెందేలా చూడాలని కోరతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, మంగమ్మ, రమణమ్మ, లక్ష్మీ, సునీత, మహిహిళలు పాల్గొన్నారు.

పశుగ్రాసం విత్తనాలు పంపిణీ

మర్రిపాడు, జూలై 12: స్థానిక సచివాలయంలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ ఏడీ గురుజయంతి పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. పాడి రైతులకు మొక్కజొన్న, జొన్న 5కేజీల బ్యాగులను సబ్సిడీతో అందజేశారు. ప్రస్తుతం 500కేజీలు జొన్న, 500కేజీలు మొక్కజొన్న ఉందన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు జనార్దన్ పాల్గొన్నారు.



మొక్కజొన్న ప్యాకెట్లను అందుకుంటున్న రైతులు

సీతారామపురం: పబ్బులేటిపల్లి రైతుసేవా కేంద్రంలో శుక్రవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పశు పోషకులకు పశువుల ఆరోగ్యం, పోషణ యొక్క ప్రాముఖ్యత, మన ప్రాంతంలో పశువుల మేతకు లభ్యం అయ్యే వివిధరకాల గడ్డి జాతులు, పశువులకు జీవాలకు పోషణలో ఆవశ్యకత గురించి పశువైద్యాధికారి అనూష వివరించారు. రైతులకు ప్రభుత్వ సబ్సిడీపై అందించే గడ్డి విత్తనాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులకు ఖనిజ లవణ మిశ్రమం, బి.కాంప్లెక్స్ టానిక్ అందజేశారు. కార్య క్రమంలో పబ్బులేటిపల్లి సర్పంచ్ ఆదినారాయణ, చిన్ననాగంపల్లి ఉప సర్పంచ్, రైతు సేవ కేంద్ర సిబ్బంది, వెటర్నరీ అసిస్టెంట్లు మహేశ్వరి, గౌస్, నరేష్ పాల్గొన్నారు.

14న సోమశిల, కండలేరుకు మంత్రుల రాక

అనంతసాగరం, జూలై 12: సోమశిల, కండలేరు జలాశయాలను ఈ నెల 14 రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు సందర్శించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పా ట్లు చేస్తున్నారు. సోమశిలలో వరదకు దెబ్బతి న్న కట్టడాలు, ధ్వంసమైన సోమేశ్వరుడి ఆల యం పరిశీలిస్తారు. అనంతరం తెలుగుగంగ, సోమశిల అధికారులతో స్థానిక అతిథిగృహంలో సమీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నెల్లూరుకు చేరుకొని బారాషాహిద్ దర్గాను దర్శించుకొని రొట్టెల పండుగ ఏర్పాట్లు పరిశీలన చేస్తారు.



రీచ్‌ను పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసులు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆరోగ్య వైద్యాధికారి వెంకటసుబ్బయ్య

ఉదయగిరిరూరల్, జూలై 12: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి సకాలంలో వైద్య సేవలు పొందాలని ఎంఈవో శ్రీనివాసులు, గండిపాళెం ఆరోగ్య వైద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టాప్ డయేరియా, డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా గురించి వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకేశవులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి



బైక్ ర్యాలీలో పాల్గొన్న హనుమాన్ భక్త బృందం సభ్యులు

ఆత్మకూరు, జూలై 12: పట్ట ణంలో ఈ నెల 21న నిర్వహించ నున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని హనుమా న్ భక్త బృందం, హిందూ చైతన్య వే దిక నాయకులు పిలుపునిచ్చారు. శుక్ర వారం హనుమాన్ భక్త బృందం ప ట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అ నంతరం ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల, ఏఎస్ఆర్, ఎస్వీఎస్ఆర్‌జె డిగ్రీ కళాశా లలకు వెళ్లి విద్యార్థులను ఆహ్వానించారు. రాజకీయాలకతీతంగా ప్రతిఒక్కరూ కార్యక్రమంలో వేడుకల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, బీజేపీ నాయకులు ఏఎంసీ మాజీ ఛైర్మన్, కుడుముల సుధాకర్‌రెడ్డి, కరటంపాటి సుధాకర్, హనుమాన్ భక్త బృందం సభ్యులు మాధవరెడ్డి, వేము శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ దేవసేనమ్మ

ఆత్మకూరు, జూలై 12: నువ్వూరుపాడు, బట్టేపాడు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు పంటసాగు హక్కుపత్రాల మంజూరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ కౌలురైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధి, పంట నష్టపరిహారం, పంటల భీమా, సబ్సిడీ విత్తనాలు, సీసీఆర్‌సీ కార్డులను గురించి తెలిపారు. వీఆర్వో ద్వారా ఈ పత్రాలను పొందే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్‌బాబు, నువూరుపాడు సర్పంచ్ కటారి దొరసానమ్మ, వీఆర్వోలు, వీపీఏలు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెలే కాకర్ల ఆర్థిక సాయం

ఉదయగిరి, జూలై 12: పట్టణంలోని స్టేట్‌పేట ఎస్సీ కాలనీకి చెందిన ఇండ్ల సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితమయ్యాడు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఇండ్ల అంకయ్య ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. శుక్ర వారం రాత్రి ఎమ్మెల్యే ఇండ్ల సుబ్ర హ్మణ్యం నివాసానికి వెళ్లి ఆయన చేతుల మీదుగా రూ.10వే లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరా మిరెడ్డి, నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



బాధితుడి బంధువులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సరసమైన ధరల్లో నాణ్యమైన సరుకులు

- రాయితీ కందిపప్పు స్టాల్ ప్రారంభం
- కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, జూలై 12: సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణ రైతుబజారులో రాయితీపై ఇచ్చే నిత్యావసర సరుకుల కౌంటర్‌ను శుక్రవారం కావలి ఆర్డీవో శీనానాయక్, డీఎస్పీ ఎం.వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ నగేష్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. మార్కెట్ ధరకన్నా తక్కువ ధరకు ప్రభుత్వం ఇచ్చే బియ్యం, కందిపప్పును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత రైతుబజారులోని దుకాణాలన్నింటినీ పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

● ఆక్రమణలను తొలగించండి

రైతుబజారు ముందు వినియోగదారులు పార్కింగ్ చేసుకునే స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రైతుబజారు, పోలీస్‌స్టేషన్లలోకి వెళ్లేందుకు దారి లేకుండా ఆక్ర మిస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. రైతుబజారులోని సమస్యలను పరిష్కరించి ఆధునీకరించాలన్నారు.



రైతుబజారులో స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

● అన్నా క్యాంటీన్ భవనం పరిశీలన

ఫైర్‌స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేయనున్న అన్నా క్యాంటీన్ భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగ స్టు 15నుంచి 30లోపు ఈ క్యాంటీన్‌ను ప్రారంభిస్తామన్నారు. కావలిలో ఒంగోలు బస్టాండ్ సెంటర్ లేదా పెద్ద పవని బస్టాండ్ సెంటర్‌లో మరో క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

జాతీయవాదం పెంపొందేలా 100అడుగు జెండా

ట్రంకురోడ్డులోని అమృత్‌పథకం పైలాన్ స్థూపాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కూల్చి వేయించారన్నారు. ఆ ప్రదేశంలో సొంత నిధులతో 100 అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేసి ఆగస్టు 15లోపు ప్రారంభిస్తానన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ డీఈ సాయిరాం, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్‌బాబు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, జ్యోతి బాబూరావు, బీజేపీ నేతలు వెంకటసత్యనారాయణ, గుండ్లపల్లి భరత్‌కుమార్, జనసేన నాయకులు పొబ్బా సాయి విఠల్, సమ్మన వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ధృడ సంకల్పంతోనే సత్ఫలితాలు : ఎమ్మెల్యే కావ్య

కావలి టౌన్: విద్యార్థులు ధృడ సంకల్పం కలిగివున్నపుడే సత్ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పుల్లారెడ్డినగర్‌లోని శ్రీవశిష్ట జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ సురేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన తరగతుల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే, డీఎస్పీ వెంకటరమణ పాల్గొన్నారు. ఎంపీసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన శ్రీపూజిత తదితర ర్యాంకర్లను వారు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అల్తాఫ్, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జోతి బాబురావు, అర్షియా, బీజేపీ నేత భరత్‌కుమార్, జనసేన నేత సాయి పాల్గొన్నారు.

చినపవని చెరువు అలుగు మరమ్మతులకు చర్యలు

- మైనర్ ఇరిగేషన్ ఏఈఈ ప్రసాద్

లింగసముద్రం, జూలై 12: చినపవని సాగునీటి చెరువు అలుగును తాత్కాలిక మరమ్మతులు చేసేం దుకు చర్యలు తీసుకుంటామని మండల మైనర్ ఇరి గేషన్ ఏఈఈ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. ఏడాది క్రితం పెదపవని గ్రామానికి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చెరువు వెనుక భాగంలో తమ పొలాలు మునిగిపోతున్నాయని ఈ చెరువు అలుగు పగులకొట్టారని అప్పట్లో ఏఈఈ ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున చెరువులోకి నీరు చేరి వృథాగా పోతోందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ టీడీపీ నేతలు సోంపల్లి మనోహర్, రవీంద్ర, బ్రహ్మయ్య మరికొందరు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వివరించారు. దీంతో ఎమ్మెల్యే నాగేశ్వరరావు తగిన చర్యలు తీసుకోవాలని ఏఈఈ ప్రసాద్‌ను ఆదేశించారు. దీంతో శుక్రవారం ఏఈఈ ప్రసాద్ సాగునీటి చెరువు అలుగును పరిశీలించి ప్రస్తుతం తాత్కాలికంగా అలుగు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే రైతుల వినతి మేరకు చెరువుకు ఉత్తర భాగంలో శిథిలావస్థలో ఉన్న వంతెనను ఆయన పరిశీలించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు వివరించి ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

కౌలురైతులకు పంట రుణాలు

అల్లూరు, జూలై 12 : సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకూ పంట రుణాలు ఇచ్చేందుకు ప్రభు త్వం చర్యలు తీసుకుందని తహసీల్దారు దుర్గేశ్వరరావు తెలిపారు. అల్లూరు సచివాలయం-1లో శుక్రవారం ఆయన రైతులతో సమావేశమై మాట్లాడారు. కౌలు రైతుల పంట రుణాలు ఇచ్చేందుకు భూ యజమానుల నుంచి భూమి తాలూకు వెబ్‌ల్యాండ్ రికార్డు, ఆధార్‌కార్డులను తీసుకు రావాలన్నారు. దీనితో భూ యజమానులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, సదరు రుణం కేవలం కౌలు రైతులకు మాత్రమే వర్తిస్తుందే తప్ప భూ యజమానికి వర్తించదని స్పష్టం చేశారు. రాయితీ ద్వారా అన్ని రకాల ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ సామగ్రి అందజేస్తామన్నారు. కార్యక్ర మంలో డిప్యూటీ తహసీల్దారు నాగలక్ష్మి, కార్యదర్శి వరప్రసాద్, వీఆర్వో రంతుల్లా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు దుర్గేశ్వరరావు

ఎట్టకేలకు ఆక్రమణలు తొలగింపు

కావలి, జూలై 12: పట్టణ రైతుబ జారు ముందు ఉన్న ఆక్రమణలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రమే మున్సిపల్ అధికారులు తొలగించారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి బాబూ రావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు.



మున్సిపాలిటీలో కార్మికుల సంఖ్య పెంచాలి



కందుకూరు, జూలై 12: కందుకూరు మున్సిపాలిటీలో పారిశుధ్యం, ఇంజనీరింగ్ విభాగాలలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్య పెంచాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో పెరిగిన జనాభా, పెరిగిన నివాస ప్రాంతాలను బట్టి కార్మికుల సంఖ్యను 150కి పెంచాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్మికుల మస్టర్ పాయింట్‌లో కనీసం గది కూడా లేనందున ఎండకు, వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీరు, టాయిలెట్ సౌకర్యం కూడా లేకపోవటం శోచనీయమని, తక్షణం తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. పారిశుధ్య నిర్వహణలో ఉపయోగిస్తున్న ఆటోలు, ట్రాక్టర్లకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని, కార్మికుల ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన సదుపాయాలన్నీ అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఎస్‌ఏ గౌస్, సురేష్, ఆనంద్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్స్ పరిశీలన

కొండాపురం, జూలై12: మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీచేసిన స్టూడెంట్ కిట్స్ రాష్ట్ర అబ్జర్వర్ శారద శుక్రవారం మండలంలో పరిశీలించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసిన కిట్లలో అన్ని వస్తువులు ఉన్నాయో లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రానికి వెళ్లి వివరాలను ఎంఈవో-2 ఆనందరావును అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు 3,230 స్టూడెంట్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలుసుకున్నారు. ఆమె వెంట సీఎంఓ పెంచలయ్య, ప్రదానోపాధ్యాయులు రహీమ్, ఖాదర్‌భాషా, సీఆర్‌ఎంపీ అయ్యన్న తదితరులు ఉన్నారు.

ఇంటిపన్ను అక్రమ వసూళ్లపై ఫిర్యాదు

అల్లూరు, జూలై 12: నార్తుమోపూరులో ఇంటిపన్ను అక్రమ వసూళ్లు పంచాయతీ కార్యాలయంలోని ఓ ప్రైవేటు ఉద్యోగి నిర్వాహకమే అని కార్యదర్శి వరప్రసాద్ తెలిపారు. ఈ విషయంపై శుక్రవారం ఆయన పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేశారు. స్థానికులు కొంతమంది గురువారం నగర పంచాయతీ కమిషనరు ఫణికుమార్‌కు వినతిపత్రం ఇచ్చిన విషయం విదితమే. ఈ మేరకు స్థానికంగా అలజడి నెలకొంది. దీంతో తనపై కొంతమంది ఫిర్యాదు చేయడంతో కార్యాలయంలో విచారించగా జరిగిన విషయం తెలుసుకు న్నట్లు కార్యదర్శి తెలిపారు. ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వీధిలైట్లకు మరమ్మతులు

వలేటివారిపాలెం, జూలై 12: మండలంలోని పోలినేనిపాలెంలో సర్పంచ్ అనుమోల అమరేశ్వరి శుక్రవారం విద్యుత్ సిబ్బందిచే వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వీధిలైట్లు మరమ్మతులకు గురై గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వీధిలైట్లకు మరమ్మతులు చేయించినట్లు సర్పంచ్ అమరేశ్వరి తెలిపారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల మంజూరు

లింగసముద్రం, జూలై 12: నిబంధనల మేరకు కౌలు రైతులకు పంట సాగుదారుని హక్కు ధ్రువీకరణ పత్రం కార్డులు (సీసీఆర్‌సీ) మంజూరు చేస్తామని మండల వ్యవసాయ అధికారి అబ్రహంలింకన్ చెప్పారు. శుక్రవారం ముత్యాలపాడు, పెద పవని గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్డులు పొందిన రైతులు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు పంట నష్ట పరిహారం పొందుటకు, ఈ-క్రాప్ నమోదు చేసుకొనుటకు అర్హులవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విఆర్‌వోలు హనుమల్ల, వినోద్, విఏఎలు ప్రేమ్‌బాబు, నజీర్ పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: అర్హత కలిగిన కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు మంజూరు చేయాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు వీఆర్వోలకు సూచించారు. వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏఓ హేమంత్‌భరత్ కుమార్, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

బిట్రగుంట: జక్కేపల్లి గూడూరు పంచాయతీలోని సోమేశ్వరపురంలో రైతులకు కౌలు కార్డులపై అవగాహన కల్పించారు. తహసీల్దారు వెంకటరత్నం, మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మి, నాగులవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యర్రం వెంకటేశ్వ ర్లురెడ్డి, జక్కేపల్లి గూడూరు, ఏటీకండ్రిక, ఎస్‌జీవీ కండ్రిక సర్పంచులు బండ్ల సురేష్ గౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే బోగోలు బిట్-1, నాగులవరం పంచాయతీలో జరిగిన కార్యక్రమానికి కావలి ఏడీఏ నాగరాజు, డిప్యూటీ తహసీల్దారు జూలియాభాయ్, ఆర్ఐ, వీఆర్వోలు, వీపీఏలు ఉన్నారు.

● **కావలి రూరల్ :** గౌరవరంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూశాఖ అధికారులు శుక్రవారం పంటసాగు హక్కుపత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి లలిత మాట్లాడారు.

'పాలిటెక్నిక్'లో డీబీఎస్ విద్యార్థుల ప్రతిభ

కావలి టౌన్, జూలై 12: డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని డీబీఎస్ కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం కళాశాలలో అభినందించారు. ప్రిన్సిపాల్ శ్యాసుందర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీబీఎస్ ప్రిన్సిపాల్ టీవీ రావు, ఏవో రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కందుకూరు, జూలై 12: విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కోసం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కందుకూరు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని టౌన్ ఎఈఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గుర్తించి తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

● **లింగసముద్రం :** వీఆర్ కోట, లింగసముద్రం సబ్‌స్టేషన్లలో మెయింటెన్స్ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ షేక్ ఫిరోజ్ ఒక ప్రకటనలో తెలిపారు. లింగసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, వీఆర్ కోట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఫిరోజ్ తెలిపారు.

● **వలేటివారిపాలెం :** పోకూరు, నలదలపూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శింగమనేనిపల్లె, నలదల పూరు, కళవళ్ల, నూకవరం, పోకూరు, నేకునాంపురం, కాకుటూరు, బడేవారిపాలెం గ్రామాలలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరపరా నిలిపివేస్తునట్లు ఏఈ మధుబాబు తెలిపారు

● **బిట్రగుంట :** జక్కేపల్లిగూడూరు, వడ్డిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం శనివారం విద్యుత్ కోత ఉంటుందని మండల విద్యుత్‌శాఖ అధికారి నాగూర్‌వల్లి తెలిపారు.

ఎమ్మెల్యే ఇంటూరికి ఘన సన్మానం



ఇంటూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న బధిరులు

కందుకూరు, జూలై 12: దివ్యాంగుల పించన్‌ను ఒకేసారి 3వేలు నుంచి 6వేల రూపాయలకు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని బధిరుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు కృతజ్ఞత తెలుపుతూ కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును శుక్రవారం స్థానిక కార్యాలయంలో బధిరులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.